జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం




రంగారెడ్డి | శుక్రవారం 14 మార్చి 2025 | సంపుటి : 15 | సంచిక : 191 | వెల: రూ.5 | పేజీలు: 08 | RNI NO.APTEL/2010/36516

విక్రం సంవత్సరం - పింగళ 2081, ఆషాఢము 3 ఇండియన్ సివిల్ క్యాలెండర్ - 1946, ఆషాఢము 17 పుర్ణిమంతా - 2081, ఆషాఢము 16 అమాంత - 2081, ఆషాఢము 3 తిథి శుక్లపక్షం తదియ నక్షత్రం పుష్యమి

Published from GUNTOORU, VIJAYAWADA, VISHAKAPATANAM, TIRUPATHI http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

# ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు



- 175 నియోజకవర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు
- తొలుత 26 జిల్లాల్లో ఏర్పాటు
- 10 కొత్త ప్రాజెక్టుల ద్వారా 80,104 మందికి ఉద్యోగాలు
- ఎస్ఐపీబీ సమావేశంలో సీఎం చంద్రబాబు
- ఒప్పందం చేసుకున్న పరిశ్రమలు వెంటనే గ్రౌండ్ అయ్యేలా చర్యలు

ప్రజాజ్యోతి అమరావతి

రాష్ట్రానికి పెట్టుబడుల విషయంలో ఒప్పందం చేసుకున్న పరిశ్రమలు వెంటనే గ్రౌండ్ అయ్యేలా చర్యలు తీసుకోవాలని సిఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఆమోదం తెలిపిన, ఒప్పందాలు చేసుకున్న ప్రాజెక్టుల పురోగతిపై నిత్యం పరిశీలించాలని... దీని కోసం ట్రాకర్‌ను ఏర్పాటు చేసి పర్యవేక్షించాలని సిఎం ఆదేశించారు. గురువారం సచివాలయంలో తన అధ్యక్షతన జరిగిన 4వ ఎస్ఐపీబీ సమావేశంలో ముఖ్యమంత్రి రాష్ట్రానికి కొత్తగా వస్తున్న పెట్టుబడుల ప్రతిపాదనలను పరిశీలించారు. పరిశ్రమలు, విద్యుత్, పర్యాటకం వంటి రంగాల్లో మొత్తం 10 సంస్థలు రూ.1,21,659 కోట్లు పెట్టుబడులు ముందుకురాగా ఎస్ఐపీబీ సమావేశంలో ఆమోదం తెలిపారు. వీటి ద్వారా 80,104 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలుగనున్నాయి. అలాగే, గత మూడు ఎస్ఐపీబీ సమావేశాల్లో ఆమోదం పొందిన ప్రాజెక్టులు, వాటి పురోగతిని ముఖ్యమంత్రి సమీక్షించారు. రాష్ట్రంలో ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఒక ఎంఎస్ఎంఈ పార్క్ చొప్పున మొత్తం - మిగతా3లో



## విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చింది టీడీపీనే

- కొన్నేళ్లుగా విద్యుత్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయి
- గతంలో కరెంటు కోతల సమయంలో రైతుల అవస్థలు ప్రత్యక్షంగా పరిశీలించా
- రైతుల ఇబ్బందులు చూసాక పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వాలని నిర్ణయించుకున్నా
- విద్యుత్ సంస్కరణలు అమలు చేసేందుకు ప్రయత్నిస్తే ప్రపంచ బ్యాంకు జీతగాడని అవహేళన చేశారు

ప్రజాజ్యోతి అమరావతి


ప్రపంచ వ్యాప్తంగా ఎక్కడైనా విద్యుత్ వినియోగం ఆధారంగానే ప్రజల అభివృద్ధిని లెక్కిస్తారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ఏపీ శాసనసభలో విద్యుత్ రంగంపై లఘు చర్చలో సీఎం మాట్లాడుతూ.. కొన్నేళ్లుగా విద్యుత్ రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వచ్చాయన్నారు. గతంలో కరెంటు కోతల సమయంలో రైతుల అవస్థలు ప్రత్యక్షంగా పరిశీలించానని.. రైతుల ఇబ్బందులు చూసాక పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ ఇవ్వాలని నిర్ణయించుకున్నామని - మిగతా3లో



## మావోయిస్టుల లొంగుబాటు

- 17 మంది మావోయిస్టులు లొంగుబాటు
- గంగులూరు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున లొంగిపోయిన మావోయిస్టులు
- లొంగిపోయిన వారికి పునరావాస పథకం కింద ఒక్కొక్కరికి రూ. 25 వేల రూపాయల నగదు ప్రోత్సాహక బహుమతి

# అన్నిదార్లు పిఠాపురం వైపే



- నేడే జనసేన ఆవిర్భావ సభ
- 1600 మంది పోలీసులతో భారీగా బందోబస్తు
- రాష్ట్రం నలు వైపుల నుంచి వచ్చే వారికి ప్రత్యేక ఏర్పాట్లు
- ఆహారం, మంచినీరు అందరికీ అందేలా చర్యలు
- సభా స్థలంలో 12 అంబులెన్సులు, మెడికల్ బృందాలు సిద్ధం
- మహిళలకు ప్రత్యేక గ్యాలరీలు, సౌకర్యాలు
- శుక్రవారం సాయంత్రం 3.30 గంటల నుంచి సభ మొదలు

ప్రజాజ్యోతి కాకినాడ

పిఠాపురం జనసేన పార్టీకి ఎన్నో మరుపురాని జ్ఞాపకాలు ఇచ్చింది. జనసేన పార్టీ 12వ ఆవిర్భావ దినోత్సవం జయకేతనం సభకు కూడా పిఠాపురం వేదిక అయింది. ఈ సందర్భంగా పిఠాపురం ప్రజలకు నిండు మనసుతో కృతజ్ఞతలు చెప్పుకొందాం.. థాంక్యూ పిఠాపురం అని జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గతంలో ఎన్నడూ లేనంతగా పిఠాపురంలో జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని న భూతో అన్న రీతిలో నిర్వహిస్తున్నామని, దీనికి పార్టీలోని ప్రతి ఒక్కరూ సమేకం కావాలని పిలుపునిచ్చారు. జనసిన పార్టీ ఆవిర్భావ దినోత్సవం "జయ కేతనం" సభ ఏర్పాట్లను నాదెండ్ల మనోహర్ - మిగతా3లో



## 144 కోట్లు దాటిన భారత జనాభా

- మరో 77 ఏళ్లలో భారత జనాభా 2011 లెక్కల ప్రకారం రెట్టింపు
- పదేళ్లుగా ఇండియాలో శిశు మరణాలు బాగా తగ్గాయి
- 2011లో జరిపిన జనాభా లెక్కల ప్రకారం భారత జనాభా 121 కోట్లు.
- తాజాగా విడుదల చేసిన ఐక్యరాజ్యసమితి జనాభా నిధి



## చంద్రయాన్-4కి మార్గం సుగమం!

- విజయవంతంగా స్పాడెక్స్ శాటిలైట్స్‌ని అన్‌డాక్ చేసిన ఇస్రో!
- అంతరిక్షంలో ఉపగ్రహాలను కలిపే ప్రక్రియను డాకింగ్‌గా పిలుస్తారు
- వాటిని మళ్లీ వేరే చేసే ప్రక్రియనే అన్‌డాకింగ్ అంటారు.
- ఇది ప్రతి భారతీయుడికి సంతోషకరమైన విషయం

## విశాఖ ఉక్కు పరిశ్రమను సెయిల్‌లో విలీనం చేయాలి



- ఈ నెల 14న చేపట్టనున్న నిరసనలకు సీపీఐ మద్దతు ఇవ్వాలి
- పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ

ప్రజాజ్యోతి అమరావతి

విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం ఫ్యాక్టరీకి సొంతంగా గనులు కేటాయించి, సెయిల్ విలీనం చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 14న రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన నిరసనలకు సీపీఐ మద్దతు ప్రకటిస్తున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ప్రకటించారు. ఈ మేరకు నిసన కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలని సీపీఐ శ్రేణులకు - మిగతా3లో

## రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కూటమి పాలన..

- గవర్నర్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు
- అన్ని పనులు తెలుగుదేశం వారికే చేయాలి
- వైఎస్సార్‌సీపీ వారికి ఏ పనీ చేయకూడదు
- అలా చేస్తే పాముకు పాలుపోసినట్లేనంటూ చేసిన తీవ్ర వ్యాఖ్యలను గవర్నర్ దృష్టికి తీసుకువచ్చాం
- రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కూటమి పాలన సాగుతున్న నేపథ్యంలో తక్షణం గవర్నర్ జోక్యం చేసుకోవాలి



ప్రజాజ్యోతి విజయవాడ

రాష్ట్రంలో నెలకొన్న తాజా పరిణామాలపై రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను వైఎస్సార్‌సీపీ ప్రతినిధి బృందం రాజ్‌భవన్‌లో కలిసి వినతిపత్రం సమర్పించింది. రాష్ట్రంలో రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కూటమి పాలన సాగుతున్న నేపథ్యంలో తక్షణం గవర్నర్ జోక్యం చేసుకోవాలని కోరింది. అనంతరం రాజ్‌భవన్ బయట పలువురు మాజీ మంత్రులు, వైఎస్సార్‌సీపీ నేతలతో కలిసి శాసనమండలి ప్రతిపక్షనేత బొత్స సత్యనారాయణ మీడియాతో మాట్లాడారు. ఇటీవల గంగాధర నెల్లూరులో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ అన్ని పనులు తెలుగుదేశం వారికే చేయాలి.. వైఎస్సార్‌సీపీ వారికి ఏ పనీ చేయకూడదు.. అలా చేస్తే పాముకు - మిగతా3లో

# దేశం కాలుష్యానికి కేరాఫ్‌గా మారుతోందా..



**న్యూఢిల్లీ :** దేశంలో గాలి నాణ్యత వేగంగా పడిపోతుందా అంటే పర్యావరణ నివేదికలు అదే చెబుతున్నాయి. రోజు రోజుకూ దేశంలో కాలుష్య తీవ్రత పెరుగుతోంది. గాలి నాణ్యత పడిపతోంది. ప్రపంచంలో అత్యంత కాలుష్య నగరాలు 20 ఉండగా, అందులో 13 దేశాలు భారత్‌లోనే ఉండడం గమనార్హం. ప్రపంచంలోని అత్యంత కాలుష్య నగరాల జాబితాలో భారత్ ఒక ప్రముఖ స్థానంలో ఉంది. 2024లో స్విస్ ఎయిర్ క్వాలిటీ టెక్నాలజీ సంస్థ ఎఖింతితీ విడుదల చేసిన 'వరల్డ్ ఎయిర్ క్వాలిటీ రిపోర్ట్' ప్రకారం, ప్రపంచంలోని టాప్ 20 కాలుష్య నగరాల్లో 13 భారతదేశంలోనివే ఉన్నాయి. ఈ జాబితాలో మేఘాలయలోని బైర్నీహట్ అగ్రస్థానంలో నిలిచింది. దేశ రాజధాని ఢిల్లీప్రపంచంలోనే అత్యంత కాలుష్య రాజధానిగా గుర్తింపు పొందింది. పరిస్థితి ఇలాగే కొనసాగితే చాలా ప్రమాదమని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

**భారత్‌లోని 13 కాలుష్య నగరాలు**

బైర్నీహట్(మేఘాలయ) అత్యంత కాలుష్య నగరంగా నిలిచింది.
ఢిల్లీ అత్యంత కాలుష్య రాజధానిగా రికార్డు సష్టించింది.
ముల్లన్‌పూర్ (పంజాబ్)
ఫరీదాబాద్ (హర్యానా)
లోనీ(ఉత్తరప్రదేశ్)
న్యూఢిల్లీ
గురుగ్రామ్(హర్యానా)
గంగానగర్(రాజస్థాన్)
గ్రేటర్ నోయిడా(ఉత్తరప్రదేశ్)
భివాడీ(రాజస్థాన్)
ముజఫ్ఫర్‌నగర్(ఉత్తరప్రదేశ్)
హనుమాన్‌గఢ్ (రాజస్థాన్)
నోయిడా (ఉత్తరప్రదేశ్)

ఈ రిపోర్ట్‌లో కాలుష్య స్థాయిలను ఖఓ2.5 (పార్టిక్యులేట్ మ్యాటర్ 2.5) ఆధారంగా కొలుస్తారు. ఖఓ2.5 అనేది 2.5 మైక్రోమీటర్ల కంటే చిన్న కణాలను సూచిస్తుంది, ఇవి ఊపిరితిత్తుల్లోకి, రక్తప్రవాహంలోకి చొచ్చుకుపోయి శ్వాసకోశ వ్యాధులు, గుండె జబ్బులు, క్యాన్సర్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి. భారత్‌లో సగటు ఖఓ2.5 స్థాయి 2024లో 50.6 మైక్రోగ్రామ్స్ పర్ క్యూబిక్ మీటర్‌గా నమోదైంది, ఇది 2023లో 54.4తో పోలిస్తే 7% తగ్గినప్పటికీ, ప్రపంచ ఆరోగ్య సంస్థ సిఫార్సు చేసిన సురక్షిత స్థాయి (5 మైక్రోగ్రామ్స్) కంటే ఇంకా 10 రెట్లు ఎక్కువగా ఉంది. ఢిల్లీలో సగటు ఖఓ2.5 స్థాయి 91.6 మైక్రోగ్రామ్స్‌గా ఉంది. ఇది చిఊబా సురక్షిత పరిమితి కంటే దాదాపు 18 రెట్లు ఎక్కువ.

**కాలుష్యానికి కారణాలు..**

భారత్‌లో కాలుష్యం పెరగడానికి ప్రధాన కారణాలు:
వాహన ఉద్గారాలు: ఢిల్లీ, నోయిడా, గురుగ్రామ్ వంటి నగరాల్లో ట్రాఫిక్ సాంద్రత వల్ల ఎక్కువ కాలుష్యం.
పారిశ్రామిక కాలుష్యం: ఫరీదాబాద్, భివాడీ వంటి ప్రాంతాల్లో పరిశ్రమల నుండి వెలువడే ఉద్గారాలు.
పంటల అవశేషాల దహనం: పంజాబ్, హర్యానా వంటి రాష్ట్రాల్లో స్టబుల్ బర్నింగ్ వల్ల ఉత్తర భారతదేశంలో కాలుష్యం పెరుగుతోంది.
నిర్మాణ ధూళి: వేగంగా అభివద్ధి చెందుతున్న నగరాల్లో నిర్మాణ కార్యకలాపాలు.
వాతావరణం: శీతాకాలంలో ఉష్ణోగ్రత తలక్రిందులు కావడం వల్ల కాలుష్య కణాలు గాలిలో చిక్కుకుంటాయి.

ఆరోగ్య ప్రభావం

భారత్‌లో వాయు కాలుష్యం ఒక తీవ్రమైన ఆరోగ్య సంక్షోభంగా మారింది. ఇది సగటు జీవిత కాలాన్ని 5.2 సంవత్సరాలు తగ్గిస్తుందని అంచనా. లాన్సెట్ ప్లానెటరీ హెల్త్ అధ్యయనం ప్రకారం, 2009?2019 మధ్య ఏటా సుమారు 15 లక్షల మరణాలు ఖఓ2.5 కాలుష్యంతో సంబంధం కలిగి ఉన్నాయి.ప్రపంచంలోని టాప్ 20 కాలుష్య నగరాల్లో 13 భారత్‌లో ఉండటం ఆందోళనకరం. ఢిల్లీ వంటి రాజధాని నగరం కాలుష్యంతో కొట్టుమిట్టాడుతుంటే, బైర్నీహట్ వంటి చిన్న పట్టణాలు కూడా ఈ జాబితాలో చేరడం వాయు కాలుష్య సమస్య విస్తృతిని చూపిస్తోంది. ప్రభుత్వం 'నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రామ్' వంటి చర్యలు చేపడుతున్నప్పటికీ, కఠిన నియంత్రణలు, ప్రజల సహకారం లేకుండా ఈ సమస్యను అధిగమించడం కష్టం. వాయు కాలుష్యాన్ని తగ్గించడం కోసం అందరూ కలిసి పనిచేయాల్సిన అవసరం ఉంది.

# ఆర్టిఫిషియల్ హార్ట్‌తో 100 రోజులు




**న్యూఢిల్లీ :** వైద్య చరిత్రలో మరో అద్భుతం చోటు చేసుకుంది. కృత్రిమ గుండెతో ఓ వ్యక్తి ఏకంగా వంద రోజులు జీవించి అందరినీ ఆశ్చర్యపరిచాడు. గుండె దాత కోసం ఎదురు చూస్తున్న ఆస్ట్రేలియాకి చెందిన 40 ఏళ్ల రోగికి వైద్యులు కృత్రిమ టైటానియం గుండెను అమర్చారు. అయితే అతడు 100 రోజులు జీవించాడు. ఈ సాంకేతికతతో ఇప్పటివరకు ఎక్కువ కాలం జీవించిన వ్యక్తి అతడే. గత ఏడాది నవంబర్‌లో సిడ్నీలోని సెయింట్ విన్సెంట్ హాస్పిటల్‌లో సదరు రోగికి కృత్రిమ టైటానియం గుండెను వైద్యులు ఇంప్లాంట్ చేశారు. అయితే ఈ నెల ప్రారంభంలో గుండె దాత దొరకడంతో అప్పటి వరకు ఆ రోగి కృత్రిమ గుండెతో బతికేలా వైద్యులు చికిత్స అందించారు.తీవ్రమైన గుండె వైఫల్యంతో బాధపడుతున్న ఆ వ్యక్తి ప్రస్తుతం వేగంగా కోలుకుంటున్నాడని సెయింట్ విన్సెంట్ హాస్పిటల్, మోనాష్ విశ్వవిద్యాలయం, ఈ పరికరం వెనుక ఉన్న యుఎస్-ఆస్ట్రేలియన్ కంపెనీ బివాకర్ మీడియాకు తెలిపారు. గుండె వైఫల్యంతో బాధపడుతున్న వ్యక్తులకు కృత్రిమ హృదయం దీర్ఘకాలిక ఎంపికను అందించగలదనే సంకేతంగా ఈ పరికరం అతని ప్రాణం ఇంత కాలం నిలబెట్టగలిగింది. అయితే ఈ పరికరం ఇంకా ట్రయల్ దశలో ఉంది. సాధారణ ఉపయోగం కోసం ఇంకా ఆమోదించబడ లేదని వైద్యులు తెలిపారు. ఃతిఎంఅూఖీ (ఆర్టిఫిషియల్ గుండె) వ్యవస్థాపకుడు, ఆస్ట్రేలియన్ బయో ఇంజనీర్ డేనియల్ టిమ్స్.. తన తండ్రి గుండె జబ్బుతో మరణించిన తర్వాత ఈ పరికరాన్ని కనిపెట్టాడు. తాజాగా ఓ రోగి దీని ఆధారంగా 100 రోజులు బ్రతకం చూసి దశాబ్దాల తన కృషి ఫలించడం చూడటం చాలా ఆనందంగా ఉందని అన్నారు. మా ఆర్టిఫిషియల్ హార్ట్ పై నమ్మకం ఉంచినందుకు రోగికి, అతని కుటుంబానికి ఃతిఎంఅూఖీ బృందం కృతజ్ఞతలు తెలుపుతోందని ఆయన ఆ ప్రకటనలో తెలిపారు. వారి ధైర్యం లెక్కలేనన్ని రోగుల ఈ ప్రాణాలను రక్షించే సాంకేతికతను పొందడానికి మార్గం సుగమం చేస్తుందని అన్నారు ఆర్టిఫిషియల్ గుండె అనేది టోటల్ ఆర్టిఫిషియల్ హార్ట్. ఇందులో ఒకే కదిలే భాగం ఉంటుంది. ఇది అయస్కాంతాల ద్వారా ఉంచబడే లెవిటేటెడ్ రోటర్. దీని పేరు మాదిరిగి ఇది టైటానియంతో నిర్మించబడింది. ఇది శరీరానికి, ఊపిరితిత్తులకు రక్తాన్ని పంప్ చేస్తుంది. గుండె రెండు జఠరికల పనిని ఇది చేస్తుంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రకారం ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం 18 మిలియన్ల మంది హృదయ సంబంధ వ్యాధులతో మరణిస్తున్నారు.

దాతల కోసం వెయిటింగ్ లిస్టులో కొట్టుమిట్టాడుతున్న ఎక్కువ మందిని కాపాడటానికి ఈ పరికరాన్ని ఉపయోగించాలనేది లక్ష్యంగా పెట్టుకున్నారు. అమెరికా ఆరోగ్య శాఖ ప్రకారం 2024 లో దాదాపు 3,500 మందికి గుండె మార్పిడి జరిగింది. అదే సంవత్సరం దాదాపు 4,400 మంది వెయిటింగ్ లిస్టులో చేరారు. ఆర్టిఫిషియల్ గుండె.. గుండె మార్పిడికి పూర్తిగా కొత్త ఆశలకు నాంది పలికిందని అన్నారు. రాబోయే దశాబ్దంలో దాత గుండె కోసం వేచి ఉండలేని రోగులకు లేదా దాత గుండె అందుబాటులో లేనప్పుడు కృత్రిమ గుండె ప్రత్యామ్నాయంగా మారడాన్ని మనం చూస్తాం' అని ఆస్ట్రేలియన్ రోగి కోలుకోవడాన్ని పర్యవేక్షిస్తున్న క్లినికల్ ట్రయల్స్ కోసం పరికరాన్ని సిద్ధం చేయడంలో పాల్గొన్న వైద్యుడు హేవార్డ్ అన్నారు. ఈ పరికరాన్ని ఇప్పటికే యునైటెడ్ స్టేట్స్‌లో ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్ ప్రారంభ సాధ్యాసాధ్య అధ్యయనంలో పరీక్షించారు. దీనిలో భాగంగా ఐదుగురు రోగులు ఈ పరికరాన్ని విజయవంతంగా అమర్చారు. మొదటిది గత జూలైలో, టెక్సాస్ మెడికల్ సెంటర్‌లో శస్త్రచికిత్స సమయంలో ఎండ్-స్టేజ్ గుండె వైఫల్యంతో బాధపడుతున్న 58 ఏళ్ల వ్యక్తికి ఇంప్లాంట్ చేశారు. దాత అందుబాటులోకి వచ్చే వరకు అది అతన్ని ఎనిమిది రోజులు సజీవంగా ఉంచింది. ఇలా ఈ అధ్యయనంలో మరో నలుగురు రోగులకు అమర్చారు. ఈ ట్రయల్ 15 మంది రోగులకు అమర్చాలని వైద్యులు భావిస్తున్నారు.

# చంద్రయాన్-4కి మార్గం సుగమం!

హెూలీ పండుగకు ముందు ఇస్రో దేశ ప్రజలకు శుభవార్త చెప్పింది. స్పాడెక్స్ ఉపగ్రహాన్ని విజయవంతంగా అన్‌డాక్ చేసినట్లు ప్రకటించింది. దాంతో చంద్రయాన్-4 మార్గం సుగమం అయ్యింది. అంతరిక్షంలో ఉపగ్రహాలను కలిపే ప్రక్రియను డాకింగ్‌గా పిలుస్తారు. వాటిని మళ్లీ వేరే చేసే ప్రక్రియనే అన్‌డాకింగ్ అంటారు. ఇస్రో గతేడాది డిసెంబర్ 30న శ్రీహరికోటలోని సతీశ్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ (స్పాడెక్స్) మిషన్‌ను ప్రారంభించింది. ఈ మిషన్ విజయవంతం కావడంతో స్పేస్‌స్టేషన్, చంద్రయాన్-4 తదితర మానవ అంతరిక్ష కార్యకలాపాలకు మార్గం సుగమం కానున్నది. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ ఇస్రోను అభినందించారు. ఇది ప్రతి భారతీయుడికి సంతోషకరమైన విషయమన్నారు. స్పాడెక్స్ ఉపగ్రహాలు అద్భుతంగా డీ డాకింగ్ జరిగాయన్నారు. ఇది భారత్ స్పేస్‌స్టేషన్, చంద్రయాన్-4, గగన్‌యాన్ సహా భవిష్యత్‌లో ప్రతిష్టాత్మకమైన మిషన్‌లకు ఎంతో సహాయపడుతుందన్నారు. ఈ మిషన్లు ముందుకు సాగేందుకు మార్గం సుగమం చేస్తుందన్నారు. ఇదిలా ఉండగా.. జనవరి 16న భాతర్ తొలిసారిగా స్పాడెక్స్ మిషన్‌ను విజయవంతంగా నిర్వహించింది. తొలిసారిగా స్పేస్ డాకింగ్ ఎక్స్‌పెరిమెంట్ చేపట్టింది. ఇందులో ఇస్రో ఉపగ్రహాలను విజయవంతంగా డాక్ చేసింది. డాకింగ్ టెక్నాలజీ కలిగి ఉన్న నాలుగో దేశంగా భారత్ నిలిచింది. అమెరికా, రష్యా, చైనా తర్వాత ఈ ఘనత సాధించిన దేశంగా భారత్ ఘనత సాధించింది. ఇస్రో త్వరలోనే భారీ ప్రయోగాలను చేపట్టబోతున్నది. ఈ ప్రయోగాల కోసం తప్పినసరిగా డాకింగ్ టెక్నాలజీ అవసరం. ఈ క్రమంలోనే ఇస్రో గతేడాది డిసెంబర్ 30న రెండు ఉపగ్రహాలను పీఎస్ఎల్వీ-సీ 60 రాకెట్ సహాయంతో ఇస్రో నింగిలోకి పంపింది. ఈ ఏడాది జనవరిలో స్పాడెక్స్ ఉపగ్రహాలు చేజర్, టార్గెట్ రెండు ఒక్కదానికొకటి దగ్గరగా తీసుకువచ్చి.. ఆ తర్వాత డాకింగ్ ప్రక్రియను ఇస్రో పూర్తి విజయవంతంగా పూర్తి చేసింది.




## 144 కోట్లు దాటిన భారత జనాభా



**న్యూఢిల్లీ :** పంచంలో అత్యధిక జనాభా ఉన్న దేశంగా గుర్తింపు ఉన్న భారత్‌లో జనాభా రోజు రోజుకూ పెరుగుతూనే ఉంది. 150 కోట్లవైపు వేగంగా దూసుకెళ్తోంది. మరో 77 ఏళ్లలో భారత జనాభా 2011 లెక్కల ప్రకారం రెట్టింపు అవుతుందని ఐక్యరాజ్యసమితి జనాభా నిధి అంచనా వేసింది. ఈమేరకు తాజాగా విడుదల చేసిన నివేదికలో ఈమేరకు పేర్కొంది. ఈ నివేదికలో ఇంకా చాలా ఆసక్తికర విషయాలను వెల్లడించింది. పదేళ్లుగా ఇండియాలో శిశు మరణాలు బాగా తగ్గాయని తెలిపింది. 2011లో జరిపిన జనాభా లెక్కల ప్రకారం భారత జనాభా 121 కోట్లు. ఇప్పుడు అది 144.17 కోట్లకు చేరిందని ఐక్యరాజ్య సమితి జనాభా నిధి అంచనా వేసింది. 13 ఏళ్లలో 23 కోట్ల మంది పెరిగినట్లు తెలిపింది. ఇక చైనా 142.5 కోట్ల జనాభాతో ప్రపంచంలో రెండో స్థానంలో ఉన్నట్లు నివేదిక వెల్లడించింది.ఇక ఐక్యరాజ్యసమితి నివేదిక ప్రకారం భారత్‌లో యువ జనాభా పెరిగింది. జనాభాలో 14 ఏళ్లలోపు వారు 24 శాతం మంది ఉన్నారు. 10 నుంచి 19 ఏళ్ల మధ్య ఉన్న టీనేజర్లు 17 శాతం ఉండగా, 10 నుంచి 24 ఏళ్ల మధ్య యువత 68 శాతం ఉంది. ఇక 65 ఏళ్లు దాటిన వారి జనాభా కేవలం 7 శాతంగా ఉంది. ఇండియాలో యువ జనాభా ఎక్కువగా ఉండడం దేశ అభివృద్ధికి అనుకూల అంశం.ఇక భారత్‌లో ప్రజల జీవన ప్రమాణాలు కూడా పెరిగాయని ఐక్యరాజ్య సమితి తెలిపింది. అందుకే ప్రజలు ఎక్కువ కాలం జీవిస్తున్నట్లు వెల్లడించింది. దేశంలో పురుషుల సగటు ఆయుష్షు 71 ఏళ్లు ఉండగా, మహిళల ఆయుష్షు 74 ఏళ్లుగా ఉందని వివరించింది.మొత్తంగా ఐక్యరాజ్య సమితి నివేదిక ప్రకారం భారత్‌లో జనాభా పెరుగుతున్నా.. దేశంలో ఆర్థిక, సామాజిక పరిస్థితులు కూడా మెరుగవుతున్నాయి. ఆరోగ్య రంగం మెరుగుపడుతోంది. ఆయుష్షు పెరుగుతోంది. శిశు మరణాలూ తగ్గుతున్నాయి. ఇవన్నీ శుభసూచకమే అని భారతీయులు అభిప్రాయపడుతున్నారు. భారత జనాభా 150 కోట్లకు చేరిన తర్వాత.. తగ్గుతుందని అంచనా వేస్తున్నారు.

## మావోయిస్టుల లొంగుబాటు



**ఛత్తీస్‌గఢ్:** బీజాపూర్ జిల్లాలో 17 మంది మావోయిస్టులు పోలీసులు ఎదుట లొంగిపోయారు. గంగుళూరు ఏరియా కమిటీ ఆధ్వర్యంలో భారీ ఎత్తున లొంగిపోయారు. లొంగిపోయిన 17 మంది మావోయిస్టుల్లో 9 మందిపై 24 లక్షల రివార్డ్ ఉందని ఎస్పీ జితేంద్ర కుమార్ తెలిపారు. గంగుళూరు ఏరియా కమిటీ డీవీసీఎం దినేష్ మొడియం దంపతులు లొంగిపోయారు. 2025లో ఇప్పటి వరకూ 65 మంది మావోయిస్టులు లొంగిపోయారని..137 మందిని అరెస్టు చేశాం. 56 మంది వేర్వేరు చోట్ల జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందినట్లు ఎస్పీ తెలిపారు. లొంగిపోయిన వారికి పునరావాస పథకం కింద ఒక్కొక్కరికి రూ. 25 వేల రూపాయల నగదు ప్రోత్సాహక బహుమతి అందజేశారు.

## పర్యావరణ సదస్సు కోసం పచ్చటి చెట్లను నరికేస్తున్న బ్రెజిల్

**అతిథుల రాకపోకల కోసం చెట్లను కొట్టేసి రోడ్డు నిర్మాణం**
**అమెజాన్ అటవీ ప్రాంతంలో సమిట్ కోసం బ్రెజిల్ ఏర్పాట్లు**
**సదస్సు ఉద్దేశానికి విరుద్ధంగా ప్రవర్తించడంపై వెల్లువెత్తుతున్న విమర్శలు**



పర్యావరణాన్ని కాపాడుకునేందుకు ఉద్దేశించిన సదస్సు కోసం బ్రెజిల్ ప్రభుత్వం పచ్చటి చెట్లను నరికిస్తోంది.. పచ్చదనం పెంచుకోవాల్సిన ఆవశ్యకతను చాటిచెప్పే సదస్సు కోసం ఏర్పాట్లు చేస్తూ అదే పచ్చదనాన్ని తొలగిస్తోంది. విరివిగా మొక్కలు నాటాలని ప్రపంచానికి సందేశం ఇచ్చే సదస్సు కోసం ఇలా అడవులను నాశనం చేస్తూ ఏం చెప్పాలనుకుంటోందని బ్రెజిల్ పై సోషల్ మీడియాలో విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అమెజాన్ అడవులు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందాయి.. వాతావరణంలోని కర్బన ఉద్గారాలను గ్రహించి భూమి వేడెక్కకుండా చూడటంలో, జీవవైవిధ్యంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణలో కీలకమైన అమెజాన్ అడవులను ధ్వంసం చేయడంపై నెటిజన్లు తీవ్రంగా మండిపడుతున్నారు. ఈ ఏడాది నవంబర్ 30న బ్రెజిల్ లో క్లైమేట్ సమిట్ జరగనుంది. ప్రపంచం నలుమూలల నుంచి సుమారు 50 వేల మంది ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరవుతారని అధికారుల అంచనా. భూమి మీద నానాటికీ పెరిగిపోతున్న ఉద్గారాలు, కాలుష్యంపై ఈ సదస్సులో చర్చించనున్నారు. పచ్చదనాన్ని పెంచడం ద్వారా పర్యావరణాన్ని కాపాడుకోవాలని ప్రపంచానికి చాటి చెప్పడమే దీని ఉద్దేశం. ఈ సదస్సు నిర్వహణ కోసం బ్రెజిల్ ఇప్పటికే ఏర్పాట్లు మొదలుపెట్టింది. ప్రతినిధుల బస, రాకపోకలు, సమిట్ వేదిక కోసం అమెజాన్ అటవీ ప్రాంతాన్ని ఎంపిక చేసిన ప్రభుత్వం.. అక్కడ ప్రతినిధుల కోసం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఇందులో భాగంగా ప్రతినిధుల రాకపోకలు సాఫీగా సాగేందుకు, ట్రాఫిక్ చిక్కుల నుంచి తప్పించుకోవడానికి కొత్తగా ఓ రోడ్డును నిర్మిస్తోంది. ఇంతవరకూ బాగానే ఉన్నా.. రోడ్డు నిర్మాణం కోసం వందలాది పచ్చని చెట్లను నేలమట్టం చేయడంపై ఇంటా బయటా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ కొత్త రోడ్లు తమ జీవనాధారాన్ని దెబ్బతీస్తున్నాయని స్థానికులు గగ్గోలు పెడుతున్నారు. వన్యప్రాణులకు ప్రమాదకరంగా మారవచ్చని పర్యావరణవేత్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బ్రెజిల్ తీరు వాతావరణ సదస్సు అసలు ఉద్దేశానికి విరుద్ధంగా ఉందని మండిపడుతున్నారు. 'పర్యావరణ సదస్సును అమెజాన్ అడవుల్లో నిర్వహిస్తున్నాం నిజమే కానీ, అమెజాన్ అడవుల కోసం కాదు కదా" అంటూ ఆ దేశ అధ్యక్షుడు సమర్థించుకున్నారు.

# ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఈ పార్కులు

-మొదటిపేజీ తరువాయి

175 నియోజవకర్గాల్లో ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. ఇందలో భాగంగా మొదట జిల్లాకు ఒకటి చొప్పున 26 జిల్లాల్లో తక్షణం 26 ఎంఎస్ఎంఈ పార్కులు నెలకొల్పేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇప్పటికే ప్రతిపాదించిన రతన్ టాటా ఇన్నోవేషన్ కేంద్రాలను నెలరోజుల్లోగా రాష్ట్రంలోని 5 ప్రాంతాల్లో 5 సెంటర్లు నెలకొల్పాలని చెప్పారు. పెట్టుబడులు గ్రౌండ్ అయ్యే వరకు ఆయా సంస్థల వెనుకపడాలని.... నిరంతరం ఫాలోఅప్ చేయాలని సిఎం సూచించారు. ఒప్పందాలు చేసుకున్న సంస్థలకు వేగంగా అనుమతులు ఇవ్వడంతో పాటు... క్షేత్ర స్థాయిలో ఆయా ప్రాజెక్టులు పనులు మొదలుపెట్టేలా చూడాలన్నారు. ఈ విషయంలో అటు మంత్రులు, ఇటు అధికారులు మరింత వేగంగా పనిచేయాలని సిఎం సూచించారు. అప్పుడే ప్రతి ఏడాది ప్రగతి, ఫలితం కనిపిస్తుందని సిఎం అభిప్రాయపడ్డారు.



**4వ ఎస్ఐపీబీ ఆమోదం తెలిపిన సంస్థల వివరాలు ఇలా..**

ప్రీమియర్ ఎనర్జీస్ లిమిటెడ్ : నాయుడుపేట %-% రూ.1,742 కోట్ల పెట్టుబడులు, 2,000 ఉద్యోగాలు. దాల్మియా సిమెంట్ : కడప జిల్లా %-% రూ.2,883 కోట్ల పెట్టుబడులు, 354 ఉద్యోగాలు. లులూ గ్లోబల్ ఇంటర్నేషనల్ : విశాఖపట్నం %-% రూ. 1,500 కోట్ల పెట్టుబడులు. సత్యవీడు రిజర్వ్ ఇన్ఫ్రాసిటీ ప్రైవేట్ లిమిటెడ్ : శ్రీసిటీ %-% రూ. 25,000 కోట్ల పెట్టుబడులు, 50,000 ఉద్యోగాలు. ఇండోసాల్ సోలార్ ప్రైవేట్ లిమిటెడ్ : రూ.58,469 కోట్ల పెట్టుబడులు, 13,050 ఉద్యోగాలు. బాలాజీ యాక్షన్ బిల్డ్‌వెల్ ప్రైవేట్ లిమిటెడ్ : రూ.1,175 కోట్లు, 1,500 ఉద్యోగాలు. ఏపీ ఎన్జీఈఎల్ హరిత్ అమ్రిత్ లిమిటెడ్ : అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాలు %-% రూ.22,000 కోట్ల పెట్టుబడులు, 8,300 ఉద్యోగాలు. ఆస్తా గ్రీన్ ఎనర్జీ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ : అన్నమయ్య, కడప జిల్లాలు %-% రూ.8,240 కోట్లు, 4,000 ఉద్యోగాలు. మేఫెయిర్ బీచ్ రిసార్ట్స్, కన్వెన్షన్ : రూ. 400 కోట్ల పెట్టుబడులు, 750 ఉద్యోగాలు. ఒబేరాయ్ విలాస్ రిసార్ట్ : రూ. 250 కోట్ల పెట్టుబడులు, 150 ఉద్యోగాలు రానున్నాయని సీఎం వెల్లడించారు.

# విద్యుత్ సంస్కరణలు తీసుకొచ్చింది టీడీపీనే

-మొదటిపేజీ తరువాయి

తెలిపారు. విద్యుత్ సంస్కరణలు అమలు చేసేందుకు ప్రయత్నిస్తే ప్రపంచ బ్యాంకు జీతగాడని అవహేళన చేశారన్నారు. అప్పుడే డిస్కమ్‌లు, నియంత్రణ మండలి, ఎనర్జీ ఆడిటింగ్ అనేది మొదలు పెట్టామన్నారు. గతంలో ట్రాన్స్ మిషన్ నష్టాలు 23 శాతం అని దేశంలో తొలిసారి నిర్ధారించింది కూడా ఏపీనే అని అన్నారు. విభజన తర్వాత కరెంటు కోతలు లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దామని తెలిపారు. టీడీపీ హయాంలో చేసిన విద్యుత్ సంస్కరణలు వాడుకుని అప్పట్లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని అన్నారు.



**రాష్ట్ర విభజన సమయంలో..**

ఎన్టీపీఎస్ లాంటి ప్రభుత్వ రంగ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్‌ను 83 శాతం పీఎల్ఎఫ్‌తో నడిపించామన్నారు. చాలా ప్రైవేటు సంస్థలకూ అది సాధ్యం కాదని.. ఈ పరిపాలనా మార్పులు ప్రజలు గుర్తించాలన్నదే తమ అభిప్రాయమన్నారు. గత 30 ఏళ్ల పాలనా సమయాన్ని బేరీజు వేసుకుంటే వాస్తవాలు వెలుగు చూస్తాయని తెలిపారు. విద్యుత్ మిగులు రాష్ట్రంగా ఉన్న ఏపీని లోటు పరిస్థితికి తీసుకెళ్లింది వైసీపీ ప్రభుత్వం అంటూ మండిపడ్డారు. పరిశ్రమలు కరెంటు వాడితే సర్చార్జి విధించిన పరిస్థితి గత ప్రభుత్వానిదన్నారు. 22.5 మిలియన్ యూనిట్ల విద్యుత్ కొరత రాష్ట్ర విభజన సమయంలో ఉందన్నారు.

**ఓ వ్యక్తి ఈగోకు..**

2018 నాటికి మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దామని తెలిపారు. ఏపీలో తలసరి విద్యుత్ వినియోగం 23 శాతం మేర పెరిగిందన్నారు. సౌర, పవన విద్యుత్‌ను 7700 మెగావాట్లు మేర ఉత్పత్తి చేసిన మొదటి రాష్ట్రం ఏపీనే అని చెప్పుకొచ్చారు. అయితే 2019-24లో అసమర్థ పాలన వల్ల రాష్ట్రంలో మళ్లీ చీకటి రోజులు వచ్చాయన్నారు. ఆలోచన లేకుండా వైసీపీ పీపీఏలను రద్దు చేసేసిందన్నారు. పీపీఏల రద్దు విషయం అంతర్జాతీయ అంశంగా మారిపోయిందన్నారు. దావోస్ లాంటి చోట కూడా పీపీఏలను రద్దు చేయటంపై చర్చ జరిగిందని తెలిపారు. ఒక వ్యక్తి ఈగో కారణంగా రాష్ట్ర ఖజానా నుంచి రూ.9 వేల కోట్లు పీపీఏలకు చెల్లించాల్సి వచ్చిందన్నారు. పోలవరం ప్రాజెక్టు ఆలస్యం వల్ల అందులో జల విద్యుత్ కేంద్రం ఆగిపోయి 960 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి రాలేదన్నారు. వైసీపీ హయాంలో 9 సార్లు విద్యుత్ ఛార్జీల పెంచి ప్రజలపై రూ.32 వేల కోట్ల భారం వేశారని మండిపడ్డారు.

**విద్యుత్ వ్యవస్థపై వైసీపీ వేసిన భారం..**

టారిఫ్ అడ్జస్ట్‌మెంట్, ఫ్యూయల్ సర్చార్జ్ , ట్రూ అప్ ఛార్జెస్, ఎలక్ట్రిసిటీ డ్యూటీ అని చెప్పి రూ. 32,166 కోట్లు ప్రజలపై భారం మోపారన్నారు. గత ప్రభుత్వంలో విద్యుత్ వినియోగం కూడా 4.6 శాతం మేర తగ్గిపోయిందని చెప్పారు. వినియోగదారులు, విద్యుత్ వ్యవస్థపైనా గత ప్రభుత్వం వేసిన భారం రూ.1 లక్ష కోట్లు అని తెలిపారు. విద్యుత్ రంగంలో వారసత్వంగా కొన్ని సమస్యలు కూటమి ప్రభుత్వానికి వచ్చాయన్నారు. సెకీ ద్వారా చేసుకున్న పవర్ సప్లై అగ్రిమెంటు రాష్ట్రానికి భారంగా మార్చేశారన్నారు. ఒకసారి సంతకాలు చేసిన తర్వాత ప్రభుత్వంగా దాన్ని వెనక్కు తీసుకోలేమన్నారు. ఇలాంటి ఇబ్బందులు ఉన్నా వాటిని సరిచేసేందుకు ప్రయత్నాలు కూటమి ప్రభుత్వం చేస్తోందని వెల్లడించారు. భూతాపం వల్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి కోసం ప్రయత్నాలు ముమ్మరం అయ్యాయన్నారు. సౌర, పవన, పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ, బయోఫ్యూయెల్ ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్‌ను స్మార్ట్ గ్రిడ్ ద్వారా సరఫరా చేయాలని ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

**ప్రతీ ఇంటిపై సోలార్ ఫలకాలు...**

విద్యుత్ రంగం విస్తృతంగా పెరిగినందున వ్యయం అనేది గణనీయంగా తగ్గాలన్నారు. గత ఐదేళ్లలో రూ. 5.16 పైసలు ప్రతీ యూనిట్ సగటు విద్యుత్ కొనుగోలు వ్యయం చేశారన్నారు. 2025 ఏప్రిల్ 1 నుంచి యూనిట్ కొనుగోలు వ్యయం రూ4.80కు తగ్గిస్తామన్నారు. వచ్చే విద్యుత్‌ను పొరుగు రాష్ట్రాలకు ఎగుమతి కోసం వినియోగిస్తామన్నారు. దేశం 500 గిగావాట్ల గ్రీన్ ఎనర్జీ ఉత్పత్తి చేస్తే ఏపీ ఒక్కటే 160 గిగావాట్లను ఉత్పత్తి చేస్తుందని ప్రకటించామన్నారు. పీఎం సూర్యఘర్ కింద ప్రతీ ఇంటిలోనూ విద్యుత్ ఉంటుందన్నారు. డెమాక్రాటైజేషన్ ఆఫ్ ఎనర్జీ అన్నది ఇప్పుడు ఓ కీలక విధానమని తెలిపారు. అలాగే ప్రోస్యూమర్ అన్నది ఇప్పుడు ఓ కొత్త పదమని, ప్రొడ్యూసర్ కమ్ కంజ్యూమర్‌గా ప్రతీ ఇల్లూ మారాలని ఆకాంక్షించారు. 2 కిలోవాట్ల సామర్థ్యంతో సౌర ఫలకాలను ప్రతీ ఇంటిపైనా ఏర్పాటు చేసుకోవాల్సి ఉందన్నారు. వందశాతం మేర సోలార్ రూఫ్ టాప్ విద్యుత్ ఉత్పత్తి రాష్ట్రంగా ఏపీ మారాలన్నారు. ప్రతీ నియోజకవర్గంలో కనీసం 10 వేల ఇళ్లపై సోలార్ రూఫ్ టాప్ రావాలని తెలిపారు. ప్రతీ ఇంటికీ 240 యూనిట్ల మేర విద్యుత్ ఉత్పత్తి అవుతుందని.. ప్రస్తుతం రాష్ట్రంలో సగటు వినియోగం 100 యూనిట్ల మేర ఉంటోందన్నారు. మిగతా విద్యుత్ అంతా డిస్కమ్‌లు కొనుగోలు చేసి డబ్బులు చెల్లిస్తాయని చెప్పారు.

**ఇదే లక్ష్యం...**

20 ఏళ్ల పాటు ఉచితంగా విద్యుత్ వచ్చే పరిస్థితి ఉంటుందన్నారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాలు, దేవాలయాల్లోనూ సౌర విద్యుత్ ఫలకాలు ఏర్పాటు చేసుకోవాలని కోరుతున్నామన్నారు. ఈ ఏడాది 20 లక్షల ఇళ్లపై ఈ తరహా రూఫ్ టాప్ సోలార్ కనెక్షన్లు పెట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నామని చెప్పారు. తద్వారా 1440 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి అయ్యే అవకాశం ఉంటుందన్నారు. అటు సోలార్ పంప్ సెట్ల వద్ద కూడా సౌర విద్యుత్ ఉత్పత్తికి అవకాశం ఉందన్నారు. రైతులు కూడా ఈ సౌర విద్యుత్ ఫలకాలను ఏర్పాటు చేసుకోవాలని సీఎం పిలుపునిచ్చారు. సబ్ స్టేషన్లను కూడా పెద్ద ఎత్తున ఏర్పాటు చేయడం ద్వారా పంపిణీ నష్టాలను అరికట్టేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రస్తుతం విద్యుత్ సరఫరా, పంపిణీ నష్టాలు 9 శాతంగా ఉన్నాయన్నారు. మిగులు విద్యుత్‌ను గ్రిడ్‌కు అనుసంధానం చేసి ఇతర ప్రాంతాలకు సరఫరా చేస్తామని తెలిపారు. 960 మెగావాట్ల జల విద్యుత్ కూడా పోలవరం ప్రాజెక్టు ద్వారా అందుబాటులోకి వస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

# అన్నిదార్లు పిఠాపురం వైపే

-మొదటిపేజీ తరువాయి

పరిశీలించారు. ఆసాంతం పరిశీలించి తగు సూచనలు అందించారు. సభా ప్రాంగణం మొత్తం కలియ తిరిగి ఏ ఏ ప్రాంతాల్లో ఎలాంటి ఏర్పాట్లు ఉన్నాయో అడిగి తెలుసుకున్నారు. ఏ కమిటీ ఎలా పని చేయాలి? ఎక్కడ పని చేయాలి అన్న వివరాలను సైతం అడిగి తెలుసుకున్నారు. కమిటీల సభ్యులకు తగు సూచనలు అందించారు. అనంతరం సభా ప్రాంగణంలోనే నాదెండ్ల మనోహర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ గతంలో ఆవిర్భావ సభ జరిపినప్పుడు బందోబస్తు కోసం కోరితే పోలీస్ శాఖ పై నుంచి వచ్చిన ఆదేశాల మేరకు అంతంత మాత్రమే స్పందించేది. ఇప్పుడు ఆవిర్భావ సభ కోసం ఏకంగా 1600 మంది పోలీసులు బందోబస్తు కోసం రావడం శుభ సూచకం. కేవలం పిఠాపురం నుంచే కాకుండా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా నుంచి, రాష్ట్రంలోని నలువైపుల నుంచి, ఇతర రాష్ట్రాల నుంచి కూడా భారీగా జన సైనికులు, వీర మహిళలు తరలివచ్చే అవకాశం ఉంది. వారికి తగినంతగా మనం ఏర్పాట్లు చేయాల్సిన అవసరం ఉంది. దీనికి పార్టీ తరపున నియమించిన కమిటీలు ఎప్పటికి అప్పుడు సమన్వయంతో పని చేయాల్సిన అవసరం ఉంది.

**మనమంతా నాయకుడికి నిండు మనసుతో కృతజ్ఞత చెప్పుకోవాలి**

జనసేన పార్టీ ప్రస్థానంలో పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ ఎదుర్కొన్న అవమానాలు, అవరోధాలు దాటి ఇప్పుడు ఇంత ఘనమైన పండుగ నిర్వహించుకుంటున్నామంటే మనమంతా నాయకుడికి కృతజ్ఞులై ఉండాలి. ఆయన మనకు సమాజంలో తీసుకొచ్చిన గౌరవం, పార్టీ ద్వారా ఆయన ఆశయాలకు తోడు నిలవడం మనకు ఓ మధురానుభూతి. దీనికి మనం ఎల్లవేళలా పవన్ కళ్యాణ్ కి ధన్యవాదాలు తెలుపుతూనే ఉండాలి. అధికారం లేనప్పుడు ప్రజల కోసం ఎలా పోరాటాలు చేశారో అధికారంలో ఉన్నప్పుడు కూడా పవన్ కళ్యాణ్ ప్రజల కోసం అంతే తపిస్తున్నారు. తన పరిధిలో ఉన్న శాఖల ద్వారా విశేషంగా ప్రజలకు సేవలు అందించాలని పాలన సాగిస్తున్నారు. ఓ గొప్ప పోరాటం తాలూకా ఫలితం తర్వాత వచ్చిన గొప్ప సమయం ఇది. దీన్ని మనమంతా ఉత్సవంలా జరుపుకుందాం. మచిలీపట్నం తర్వాత నిర్వహించిన అతి పెద్ద సభగా ఇది నిలుస్తుంది. దేశంలో ఇప్పటి వరకు ఏ పార్టీ కూడా నిర్వహించనంత ఘనంగా జయ కేతనం సభ ఉండబోతోంది. ఇది మనమంతా గర్వించదగ్గ సమయం.

**ఎండ పెరుగుతోంది జాగ్రత్త**

జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్, ఎస్పీ బిందు మాధవ్ ఇప్పుడే మారుతున్న వాతావరణం తాలూకా హెచ్చరికలు తెలిపారు. ఎండలు బాగా పెరుగుతున్న దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. దీనికి మనం కూడా సిద్ధంగా ఉండాలి. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలి. ప్రత్యేకంగా మెడికల్ కమిటీ ఏర్పాటు చేశాం. దీంతోపాటు మెడికల్ సిబ్బంది కూడా సభా స్థలంలో సిద్ధంగా ఉండాలి. మొత్తం 12 అంబులెన్సులను సిద్ధంగా ఉంచాం. అలాగే చుట్టుపక్కల ఆసుపత్రిల సిబ్బంది నిరంతరం అందుబాటులో ఉండేలా సూచనలు చేశాం. దీంతోపాటు సభకు వచ్చేవారికి మంచినీళ్ల ప్యాకెట్లు, మజ్జిగ ప్యాకెట్లు, పుచ్చకాయలు కూడా ఇచ్చే ఏర్పాటు చేస్తున్నాం. లక్షల్లో బిస్కెట్ ప్యాకెట్లు సిద్ధంగా ఉన్నాయి. అలాగే భోజన ఏర్పాట్లను నాయకులు విరివిగా చేయడం అభినందనీయం. సభకు వచ్చిన వారెవరు ఆకలి లేదా దాహంతో వెళ్లకుండా తగిన ఏర్పాట్లు చేయడం అభినందనీయం. దీనిని సభ రోజు కచ్చితంగా అమలు అయ్యేలా చూసుకోవాలి. ఏ కమిటీకి ఇచ్చిన బాధ్యత ఆ కమిటీ కచ్చితంగా నిర్వహించాలి.

**పార్కింగ్ స్థలాలు, గ్యాలరీలు ప్రత్యేకంగా**

ఎటువైపు నుంచి సభకు వచ్చే వారికి అటు వైపుగా ప్రత్యేకంగా పార్కింగ్ స్థలాలను కేటాయించాం. అలాగే ప్రత్యేకంగా గ్యాలరీలు ఉన్నాయి. మహిళలకు ప్రత్యేకంగా గ్యాలరీలు, సౌకర్యాలు కల్పించాం. సభా ప్రాంగణంలో పార్టీ తరపు నుంచి 75 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశాం. ఎక్కడా ఎలాంటి అవాంతరం లేకుండా సభ జరిగేలా ప్రతి ఒక్కరూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. మధ్యాహ్నం 3.30 గంటలకు సభ ప్రారంభమవుతుంది. వివిధ రకాల సంస్కృతులను ప్రతిబింబించేలా కల్చరల్ ప్రోగ్రామ్స్, ఒకరి తర్వాత ఒకరు నాయకుల ప్రసంగాలు, మధ్యలో ప్రత్యేకంగా తొమ్మిది ఆడియో, వీడియో పార్టీ ప్రస్థాన కథనాలు ఉంటాయి. అనంతరం పవన్ కళ్యాణ్ ప్రత్యేక ప్రసంగం ఉంటుంది. రోడ్డుకు నలువైపులా ఎల్ఈ డి స్క్రీన్లు, నాలుగు కిలోమీటర్ల మేర ఆడియో వినిపించేలా ప్రత్యేకంగా బాక్సులు ఏర్పాటు చేసాం. అలాగే ఈసారి ప్రత్యేకంగా బాణసంచా ఏర్పాట్లు కన్నుల విందుగా ఉండబోతున్నాయి. ఈ సభ ఇప్పటివరకు ఎవరూ జరపని అతిపెద్ద సభ. ప్రతి ఒక్కరు దీని విజయవంతం చేయడానికి పాటుపడదాం.

**వాలంటీర్ల సేవలు కీలకం**

పార్టీకి మొదటి నుంచి వాలంటీర్ల సేవలు చాలా కీలకం. ఇప్పుడు కూడా వారి సేవలు ఎంతగానో ఉపయోగపడతాయి. పోరాట యాత్ర దగ్గర నుంచి వారాహి యాత్ర, తర్వాత జరిగిన ఆవిర్భావ సభల్లో పార్టీ వాలంటీర్లు చేసిన సేవలు విశేషమైనవి. ఇప్పుడు కూడా వాలంటీర్లు పోలీసులకు సహకరిస్తూ తగువిధంగా పనిచేయాలి.

## రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా కూటమి పాలన..



-మొదటిపేజీ తరువాయి

పాలుపోసినట్లేనంటూ చేసిన తీవ్ర వ్యాఖ్యలను గవర్నర్ దృష్టికి తీసుకువచ్చామని తెలిపారు. ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసే సందర్భంలో ఎటువంటి వివక్ష లేకుండా ప్రజలందరికీ సమదృష్టితో పాలనను అందిస్తానంటూ రాజ్యాంగంపై ప్రమాణం చేసిన చంద్రబాబు, దానికి విరుద్ధంగా చేసిన వ్యాఖ్యలపై తక్షణం గవర్నర్ చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి ప్రజాస్వామిక స్ఫూర్తికి వ్యతిరేకంగా పాలన సాగిస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వంలో సంక్షేమాన్ని అందుకునే లబ్ధిదారులకు పార్టీలు, వర్గాలు ఉండవని అన్నారు. ప్రభుత్వం నిర్ధేశించిన ప్రమాణాలతో అర్హతను బట్టి పథకాలను వర్తింపచేస్తారని, కానీ చంద్రబాబు మాత్రం ఒక వర్గానికి మాత్రమే మేలు చేయాలని, కొందరి పట్ల వివక్ష చూపించాలంటూ చేసిన వ్యాఖ్యలు దారుణమని అన్నారు. స్వాతంత్రం వచ్చిన తరువాత ఇప్పటి వరకు ఏ రాజకీయ నాయకుడు చంద్రబాబులా మాట్లాడలేదన్నారు. రాష్ట్రంలోని ఏ రాజకీయపార్టీ అయినా వారి సిద్ధాంతాలు, విధానాల ప్రకారం పనిచేస్తుందని, రాష్ట్రంలోని మొత్తం ప్రజలకు మేలు చేసేలా పనిచేయాలన్నదే వారి లక్ష్యంగా పెట్టుకుంటారని అన్నారు. ఏ పార్టీ అయినా వ్యక్తిగత ఏజెండాతో పనిచేయవని, కానీ ముఖ్యమంత్రి పదవిలో ఉన్న చంద్రబాబు దానికి భిన్నంగా చేసిన వ్యాఖ్యలు, ఆయన అనుసరిస్తున్న విధానాలపై తక్షణం స్పందించాలని గవర్నర్‌ను కోరామని తెలిపారు. సామాన్యుల అవసరాలకు కూడా రాజకీయ పార్టీ రంగు పులమడం దారుణమన్నారు. ప్రతిపక్ష పార్టీగా ప్రజల ప్రయోజనాల కోసమే వైఎస్సార్‌సీపీ.. ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తూనే ఉంటుందని స్పష్టం చేశారు. ఈ ప్రభుత్వ మెడలు వంచి ప్రజలకు ప్రయోజనాలు కలిగించేలా వ్యవహరిస్తామని తెలిపారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, సోషల్ మీడియా యాక్టివిస్టులు, చివరికి జర్నలిస్ట్‌లపైన కూడా తప్పుడు కేసులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని కూడా గవర్నర్ దృష్టికి తీసుకువచ్చామని బొత్స సత్యనారాయణ తెలిపారు. గవర్నర్‌ను కలిసిన వారిలో మాజీ మంత్రులు వెల్లంపల్లి శ్రీనివాసరావు, మేరుగు నాగార్జున, విడదల రజనీ, కారుమూరు వెంకట నాగేశ్వరరావు, విజయవాడ మేయర్ రాయన భాగ్యలక్ష్మి, గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడు వున్నారు.

## విశాఖ ఉక్కు పరిశ్రమను సెయిల్‌లో విలీనం చేయాలి

-మొదటిపేజీ తరువాయి

ఆయన పిలుపునిచ్చారు. కేంద్రం అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం పబ్లిక్‌రంగ పరిశ్రమలను నిర్వీర్యం చేసి, కార్పొరేట్‌లకు అప్పగిస్తూ, వారి ఆస్తులను పెంచుకునేందుకు ఉపయోగపడుతోంది. విశాఖ ఉక్కు%-%ఆంధ్రుల హక్కు అనే నినాదంతో 32 మంది ప్రాణ త్యాగాలతో పోరాడి సాధించుకున్న విశాఖ స్టీల్ ప్లాంట్‌ను ప్రైవేట్‌పరం చేసేందుకు కేంద్రం కుటిలయత్నాలు చేస్తోంది. కేంద్రం ప్యాకేజీ పేరుతో మోసం చేస్తోంది. ఉద్యోగులకు జీతాలు సక్రమంగా చెల్లించడం లేదు. పైగా వీఆర్ఎస్ పేరుతో ఉద్యోగులను ఇళ్లకు పంపుతున్నారని ధ్వజమెత్తారు.

## విజయసాయి అప్రూవర్‌గా మారుతున్నారా...

**విజయవాడ :** వైసిపి అధినేత జగన్మోహన్ రెడ్డి మనసులో తాను లేనన్న విషయం తెలియగానే మనసు విరిగిపోయిందని వైసీపీలో తను ఒక్కొక్క మెట్టు దిగుతున్న కొద్ది కొంతమంది ఒక్కొక్క మెట్టు ఎదుగుతూ జగన్ చుట్టూ ఒక కోటరీ లా తయారయ్యారని " వైసిపి మాజీ ఎంపీ విజయసాయి రెడ్డి అన్నారు. పార్టీ నుంచి బయటికి వెళ్లిపోతున్న టైంలో అధినాయకత్వంపై ఎలాంటి విమర్శలు చేయని సాయి రెడ్డి విజయవాడలో సిఐడి ముందు విచారణకు హాజరైన సమయంలో మీడియా ముందు తన వేదనంతా బయట పెట్టేశారు. కాకినాడ పోర్టులో వాటాలను విజయసాయిరెడ్డి, అల్లుడి సోదరుడు శరత్ చంద్రరెడ్డి,వైవీ సుబ్బారెడ్డి తనయుడు విక్రాంత్‌రెడ్డి బలవంతంగా లాగేసుకున్నారని పోర్టు యజమాని ఐఎ రావు సిఐడికి ఫిర్యాదు చేశారు. దీంతో కేసు పెట్టి సీఐడీ నోటీసులు అందజేసింది. మొదట్లో చంద్రబాబు నాయుడిపై విజయ సాయిరెడ్డి నిప్పులు చెరిగారు. అది గతం ఇప్పుడు ఆయన వైసీపీ మాజీ నేత. అందుకే కానీ బుధవారం విచారణకు హాజరైన తర్వాత ఆయన శైలి మారిపోయింది. ప్రధానంగా వైసిపి హైకమాండ్‌ని టార్గెట్ చేస్తూ సంచలన కామెంట్స్ చేశారు.కాకినాడ పోర్టు వివాదంలో తన పాత్ర లేదని చేసిందంతా వైవి సుబ్బారెడ్డి కుమారుడు విక్రాంత్ రెడ్డి అని చెప్పారు. వాళ్లు అమెరికా వెళ్ళినప్పుడు కేసు వేసిన కె.వి రావు ఇంట్లోనే ఉండేవారిని ఆరోపించారు విజయసాయిరెడ్డి. అలాగే ఈ కేసుకు సంబంధం లేని మద్యం స్కాంపై కూడా మాట్లాడుతూ అప్పటి జగన్ ప్రభుత్వం అడ్వైజర్ కసిరెడ్డి రాజశేఖర్ రెడ్డి కనుసన్నల్లోనే వ్యవహారం నడిచిందని బాంబు పేల్చారు. ఆ కేసులో కూడా విజయసాయిరెడ్డి సహా వైసీపీకి చెందిన చాలా ముఖ్యమైన వాళ్ళ పేర్లు ఉన్నాయి. దీనిపై సిట్ వేశారు ప్రస్తుతం విచారణ సాగుతోంది. త్వరలోనే కొన్ని పెద్ద తలకాయల అరెస్టులు తప్పవని అంటున్నారు.వైసీపీ నుంచి ఎవరైనా తనపై విమర్శలు చేస్తే చాలా విషయాలు మాట్లాడతా అంటూ విజయసాయిరెడ్డి వార్నింగ్ పంపించారు. దీనితో విజయసాయిరెడ్డి త్వరలో అప్రూవర్‌గా మారతారా అంటూ ఏపీ రాజకీయాల్లో కొత్త చర్చ మొదలైంది. విచిత్రంగా సాయి రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేసినా పార్టీ నుంచి పెద్ద లీడర్లు ఎవరూ ఇంతవరకూ స్పందించలేదు. దాంతో విజయసాయి రెడ్డి దగ్గర పార్టీకి చెందిన చాలా రహస్యాలు ఉన్నాయన్న చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. పార్టీ వదిలి తాను వెళ్తాను అన్నప్పుడు "తనకు విశ్వసనీయత లేదని, భయపడ్డానని, ప్రలోభాలకు లొంగి పోయానని " జగన్ అన్నారు. కానీ తనకు అలాంటివేవీ లేవని.. సిబిఐ,ఈడీ కేసులు ఉన్నా భయపడలేదని చెప్పుకొచ్చారు విజయసాయి రెడ్డి. జగన్ చుట్టూ ఏర్పడిన కోటరీ ఆయనకు వాస్తవాలు తెలియకుండా చేస్తుందని ఆరోపించారు. నాయకుడు చెప్పుడు మాటలు వినడం మొదలుపెడితే పార్టీకి ప్రజలకు తీవ్ర నష్టమని హెచ్చరించారు. గత మూడున్నర ఏళ్లుగా అవమానాలు ఎదుర్కొంటూ వచ్చానని సాయిరెడ్డి అన్నారు. సజ్జల రామకృష్ణ రెడ్డి, వైవీ సుబ్బారెడ్డి ఒకోను ఉద్దేశించి విజయ సాయిరెడ్డి ఈ కామెంట్స్ చేశారని సోషల్ మీడియాలో తీవ్ర స్థాయిలో చర్చ జరుగుతోంది. విజయ సాయి రెడ్డిని ఉత్తరాంధ్ర ఇంచార్జ్ బాధ్యతల నుంచి తప్పించి వైవి సుబ్బారెడ్డిని పంపించారు. ఢిల్లీలోనూ వైవి సుబ్బారెడ్డికి ప్రాధాన్యత పెంచారు. సీఎం క్యాంపు కార్యాలయంలో మొత్తం సజ్జలదే హవా కావడం తనను దూరం పెట్టారనేది విజయసాయి రెడ్డి అభిప్రాయం. అధినాయకుడు జగన్ దగ్గరే తనకు విలువ లేదని తెలిసి మనసు విరిగిపోయిందని ఆయన మొదటిసారిగా మీడియా ముందు బాధ వెళ్లబుచ్చారు. ఈ పరిణామాలన్నీ చూస్తుంటే త్వరలోనే విజయ సాయి రెడ్డి తనపై నమోదైన కేసుల్లో అప్రూవర్‌గా మారే అవకాశం లేకపోలేదని అంటున్నారు. అదే గనుక జరిగితే వైసీపీలో పెద్ద తలకాయలకు చాలా ఇబ్బందులు తప్పవని అప్పుడే రాజకీయ వర్గాల్లో చర్చలు ఊపందుకున్నాయి.

## పవన్ కళ్యాణ్ శాఖలో లోకేష్ చొరవ

**విజయవాడ :** నారా లోకేష్ క్షమాపణ చెప్పారు. నల్లమల లోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం కాశీనాయన సత్రాన్ని అటవీ అధికారులు కూల్చేశారు. నిరంతర అన్నదానం జరిగే కట్టడాలు కూడా ఇందులో ఉన్నాయి. టైగర్ జోన్ ఏర్పాటు, అటవీ శాఖ నిబంధనల వల్ల ఫారెస్ట్ అధికారులు నల్లమల అటవీ ప్రాంతంలోని కాశీనాయన ఆశ్రమాన్ని కూల్చేశారు. దీనిపైనే నారా లోకేష్ క్షమాపణ చెబుతూ ప్రజల మనోభావాల్ని విజ్ఞప్తులను అధికారులు దృష్టిలో పెట్టుకుని ఉంటే బాగుండేదని.. ఈ ఘటన కు కారణమైన అధికారులపై చర్యలు తీసుకుంటామని ప్రకటించారు. అలాగే కూల్చేసిన కట్టడాలని తిరిగి తాను నిర్మిస్తానని భక్తులకు హామీకు ఇచ్చారు.నారా లోకేష్ ప్రకటన భక్తులకు ఊరట కలిగించిన మాట వాస్తవమే కానీ ఆ శాఖ ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి చెందింది కావడం విశేషం.

## సంపాదకీయం

# సుంకాలపై రణమా.. శరణమా?

డొనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్షుడుగా రెండోసారి ఎన్నికైన నాటినుండీ దూకుడుగా వ్యవహరిస్తూ వాణిజ్య భాగస్వామ్య దేశాలు దిగుమతి సుంకాలు భారీగా తగ్గించకపోతే అమెరికా కూడా దీటుగా ప్రతీకార సుంకాలు విధిస్తుందని బెదిరించడం అనేక దేశాలకు కలవరం కలిగిస్తోంది. అమెరికాను మళ్ళీ గొప్పదేశంగా, ప్రబల ఆర్థికశక్తిగా రూపొందిస్తామని ట్రంప్ చెప్పడం శ్వేత జాతీయులకు, ఎలాన్‌మస్క్ వంటి ఆయన మద్దతుదారులకు శ్రవణ పేయంగా ఉన్నా సుంకాలపోరు వాణిజ్య యుద్ధాలకు దారి తీస్తుందేమోనని పలు దేశాలు ఆందోళన చెందుతున్నాయి. ఇప్పటికే ట్రిలియన్ డాలర్ల ద్రవ్యలోటులో ఉన్న అమెరికా పారిశ్రామిక రంగం కూడా సమస్యలతో సతమతమవుతున్నది. అమెరికాలో ఆదాయపు పన్ను శాఖను అంతర్గత రెవెన్యూ శాఖగా వ్యవహరిస్తారు. ఇప్పుడు విదేశీ రెవెన్యూ శాఖను ఏర్పరచి విదేశీ కంపెనీలు, వాణిజ్య సంస్థలనుండి సుంకాల పెంపుద్వారా అధిక ఆదాయాన్ని ఆర్జించి అమెరికా ఆర్థిక శక్తిని పెంచుతామని ట్రంప్ అంటున్నారు. ఎగుమతులు చేస్తున్న అన్ని దేశాలకు అమెరికా అతిపెద్ద వినియోగదారుల మార్కెట్‌గా వుంది. అయితే ఇలా ఎగుమతులు చేస్తున్న దేశాలు అమెరికా నుండి వచ్చే వస్తువులపై భారీగా దిగుమతి సుంకాలు విధిస్తూ ఆదాయం పొందుతూ, లాభపడుతూ సొంత పరిశ్రమలను కాపాడుకుంటూ అమెరికాకు ఆర్థిక నష్టం కలిగిస్తున్నాయని, అమెరికా ఎగుమతిదార్ల ప్రయోజనాలను దెబ్బ తీస్తున్నాయని ట్రంప్ ధ్వజమెత్తుతున్నారు. వివిధ దేశాల నుండి వచ్చే వివిధ రకాల వస్తువులపై వేర్వేరు సుంకాలు విధించడం ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధమే అయినా ట్రంప్ ఖాతరు చేయడం లేదు. దిగుమతి సుంకాలు పెంచడం వల్ల వస్తువుల ధరలు, ద్రవ్యోల్బణం పెరిగినా ట్రంప్ పట్టించుకోవడం లేదు. భారత్ వంటి అభివృద్ధి చెందుతున్న దేశాలు సంపన్న దేశాల ఉత్పత్తులపై అధిక దిగుమతి సుంకాలు విధించడం ద్వారా తమ సొంత పరిశ్రమలను రక్షించుకునే వెసులుబాటు ఉండేది. ఆదిలో ధనికదేశాలు వీటిని అంతగా పట్టించుకోలేదు. వర్ధమాన దేశాలలో విద్యుత్ చార్జీలు అధికంగా ఉండటం, మౌలిక వసతుల కల్పనకు ఎక్కువ ఖర్చు చేయాల్సి రావడం, రుణసౌకర్యాలలేమి, వడ్డీరేట్లు అధికంగా ఉండటం, కార్మికుల ఉత్పాదక సామర్థ్యం తక్కువగా ఉండటం వల్ల వస్తూత్పత్తి వ్యయం ఎక్కువగా ఉండి సంపన్న దేశాలతో పోటీపడలేవు. అందుకే గతంలో గాట్, ప్రపంచ వాణిజ్య సంస్థ చర్చల్లో బడుగు దేశాలకు అధిక దిగుమతి సుంకాలు విధించుకునే వెసులుబాటు కల్పించాయి. యాంత్రీకరణ, అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించడం వల్ల సంపన్న దేశాల వస్తూత్పత్తి వ్యయం తక్కువ గనుక ధనిక దేశాలతో పేదదేశాలు పోటీపడలేకున్నాయి. వ్యవసాయేతర వస్తువులపై దిగుమతి సుంకాలు భారీగా తగ్గించాలని, లేదంటే ఆయా దేశాలపై దీటుగా సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరిస్తున్నారు. ద్వైపాక్షిక వాణిజ్యంలో భారత్‌కే మిగులు ఉన్నందున మన దేశం అమెరికాకు అవసరమైన మరిన్ని వస్తువులను ఎగుమతి చేయడం ద్వారా ఆ లోటును భర్తీ చేయవలసి వుంది. ఎగుమతులు పెరగాలంటే అమెరికా సుంకాలు సముచితంగా ఉండాలి. భారత్ దిగుమతి సుంకాలు ఎక్కువగా విధిస్తున్నందున దానికి దీటుగా సుంకాలు పెంచుతామని ట్రంప్ హెచ్చరిస్తున్నారు. అందువల్ల ఇప్పుడు ఎగుమతి దిగుమతులలో ఉభయతారకమైన రీతిలో సంస్కరణలు చేపట్టి ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం చేసుకోవలసిన అవసరం ఏర్పడింది. 2015 నుండి నాలుగైదు శాతం, వ్యవసాయేతర ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు 15% పెరిగాయి. అమెరికా అతిపెద్ద వాణిజ్య భాగస్వాములు. వర్తమాన ఆర్థిక సంవత్సరంలో 5.6 శాతం వాణిజ్యం పెరిగింది. ఏప్రిల్, డిసెంబర్‌లో 45 బిలియన్ల వాణిజ్యం జరిగింది. భారత్‌కు 60 బిలియన్ డాలర్ల వాణిజ్య మిగులుంది. సమాచార సాంకేతిక విజ్ఞానం, ఐటి సేవల ఎగుమతులు పెరిగాయి. భారత్ 17 శాతం దిగుమతి సుంకాలు విధిస్తుండగా, అమెరికా విధిస్తున్నది 3.3 శాతం. 60 బిలియన్ డాలర్ల వాణిజ్యంలో అమెరికా తదితర దేశాలకు 30 బిలియన్ స్మార్ట్ ఫోన్‌లే ఎక్కువగా ఎగుమతి అవుతున్నాయి. అమెరికా గనుక భారత ఉత్పత్తులపై దిగుమతి సుంకాలు పెంచితే మందులు, ఔషధాలు, ఎలక్ట్రానిక్, ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తుల ధరలు పెరిగి పోటీకి నిలవలేకపోవడం, దేశీయంగా ఉత్పత్తి తగ్గించవలసి రావడం, లే ఆఫ్‌లు, పాక్షిక నిరుద్యోగానికి దారితీయవచ్చు. సానబట్టిన వజ్రాలు, శుద్ధిచేసిన చమురు ఉత్పత్తులు, వాటిలో వాడేందుకు దిగుమతులు ఎక్కువ గనుక పెద్దగా ప్రభావం ఉండకపోవచ్చు. అమెరికా నుండి మరింత ముడిచమురు కొనుగోలుపై చర్చలు జరుగుతున్నాయి. ఖరీదైన హార్లీ దేవిడ్సన్ మోటార్ సైకిళ్ళు, బోర్బన్ విస్కీ దిగుమతులపై ప్రధాని మోడీ పర్యటనకు ముందే మన దేశం సుంకాలు తగ్గించి అమెరికాను ప్రసన్నం చేసుకుంది. అమెరికాకు భారత్ సాఫ్ట్‌వేర్ ఎగుమతులు ఎక్కువ గనుక వాటిపై దిగుమతి సుంకాలు పెంచితే భారత్‌కు నష్టం. అమెరికా పెద్ద సాఫ్ట్‌వేర్ కంపెనీలైన ఇవై, ఆక్సెంచర్, ఐబిఎం, గూగుల్, మైక్రోసాఫ్ట్, జైన్ ప్యాక్ట్ తదితర కంపెనీలలో వేలాది మంది భారతీయులు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై, పుణె నగరాల్లో, అమెరికాలోని వివిధ నగరాలలో పని చేస్తున్నారు. భారత్ ఐటి ఇంజనీర్ల సామర్థ్యంపై అమెరికా కంపెనీలకు కొండంత నమ్మకముంది. న్యూయార్క్, న్యూజెర్సీ, టెక్సాస్, వర్జీనియా సహా పలు రాష్ట్రాలు, నగరాలలో వేలాది మంది భారతీయులు పని చేస్తూ అమెరికా ఆర్థిక వ్యవస్థ మెరుగుదలకు ఎంతో దోహదపడుతున్నారు. ట్రంప్‌కు అత్యంత సన్నిహితుడు, సూపర్ అధ్యక్షుడిగా పేరొందిన అమెరికా పారిశ్రామిక దిగ్గజం ఎలాన్ మస్క్ భారత్‌లో వాణిజ్య విస్తరణకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రపంచంలో ఎక్కువ వస్తువులను దిగుమతి చేసుకునే దేశాలలో 3.3 ట్రిలియన్లతో అమెరికా అగ్రస్థానంలో ఉంది. చైనా 2.6 ట్రిలియన్లు, జర్మనీ 1.5 ట్రిలియన్ల వస్తువులు దిగుమతి చేసుకుంటున్నాయి. నెదర్లాండ్స్, బ్రిటన్, ఫ్రాన్స్, జపాన్, భారత్, హాంకాంగ్, దక్షిణ కొరియాలది ఆ తర్వాత స్థానం. వాటికి కస్టమ్స్ సుంకాలను పెంచే శక్తి వుంది. అమెరికా 180 దేశాల నుండి వివిధ వస్తువులను దిగుమతి చేసుకుంటోంది. అందువల్ల దిగుమతి సుంకాలు పెంచుతామని ట్రంప్ చేసే హెచ్చరికల అమలు సాధ్యం కాకపోవచ్చు. ఈలోగా బెదిరింపుల ద్వారా కొంతైనా ఫలితం సాధించాలని ట్రంప్ ఎత్తుగడ. సేవల ఎగుమతులపై ట్రంప్‌కు అంత పట్టింపులేదంటున్నారు. మన దేశం నుండి మందులు ఔషధాలు, టెలికాం, ఎలక్ట్రానిక్, జౌళి వస్త్రాలు, రెడీమేడ్ దుస్తులు, కంప్యూటర్లు, ఆటో విడిభాగాలు, జౌళి వస్త్రాల తయారీ యంత్రాల ఎగుమతులు ఎక్కువ. ఉక్కు, అల్యూమినియం ఉత్పత్తి అమెరికాలో లేనందున వాటి దిగుమతులు తప్పవు. పూర్తిగా తయారైన వాహనాలపై ప్రస్తుతం భారత్ విధిస్తున్న 125 శాతం సుంకాన్ని 20 శాతానికి తగ్గించాలని అమెరికా డిమాండ్. అలా చేస్తే ఎలాన్ మస్క్ ఎలక్ట్రిక్ వాహనాల ఎగుమతులకు మేలు. ట్రంప్ ప్రారంభించిన సుంకాల పోరు, వాణిజ్య యుద్ధాలకు సదా సంసిద్ధమని, వెనక్కు తగ్గేది లేదని చైనా ఇప్పటికే స్పష్టం చేసింది. మెక్సికో, కెనడా, చైనా తదితర దేశాలు కూడా ప్రతీకార సుంకాలు విధించాయి. భారత్ కూడా భారీగా సుంకాలు విధిస్తున్నందున దీటుగా చర్యలుంటాయని, మినహాయింపు లేదని ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో మన వాణిజ్యమంత్రి పీయూష్ గోయల్ హుటాహుటిన అమెరికా వెళ్లి వాణిజ్య మంత్రితో, అధికారులతో వారం రోజులపాటు చర్చలు జరిపి వచ్చారు. ప్రస్తుతం భారత పారిశ్రామిక ప్రతినిధులతో చర్చిస్తున్నారు. ప్రధాని మోడీ అమెరికా పర్యటన సందర్భంగా ద్వైపాక్షిక వాణిజ్యాన్ని, సహకారాన్ని పెంపొందించుకోవాలని సంయుక్త ప్రకటనలో ఆకాంక్షించారు. గ్రీన్‌లాండ్‌ను, గాజాను కొంటాం, పనామా కాలువను స్వాధీనం చేసుకుంటాం, కెనడాను అమెరికా 51వ రాష్ట్రంగా చేసుకుంటాం అని ట్రంప్ బెదిరిస్తూ, చైనాను కట్టడి చేసేందుకు యత్నిస్తూ భారత్ పై అప్పుడప్పుడూ ఉరుముతున్నారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని, గాజా సంఘర్షణలను ఆపాలనే ఆకాంక్ష, ప్రయత్నాలు మంచివే. చైనా, రష్యాలు ఇప్పుడు ప్రబల శక్తులు. 143 కోట్ల జనాభా గల భారత్ అమెరికాకు అతిపెద్ద మార్కెట్. అలాంటి కీలకమైన భారత్ పై అమెరికా ఆచితూచి వ్యవహరిస్తేనే ఉభయతారకం. మునుపటి అధ్యక్ష ఎన్నికలలో 'అబ్ కీ బార్.. ట్రంప్ సర్కార్' అని ఊదరగొట్టినా డెమొక్రాటిక్ పార్టీ అభ్యర్థి బైడెన్ గెలిచారు. ప్రస్తుత పరిస్థితులలో సమస్యలపై రణమా? శరణమా? లేక రాజీమార్గమా అనే విషయంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం మల్లగుల్లాలు పడుతోంది.

# రుతు సంబంధమైన పర్వం 'హెూళి'


పండగల ప్రాదుర్భావానికి మూడు ముఖ్య కారణాలుగా కనిపిస్తాయి. ఒకటి మహాపురుషుల జన్మదినాలు. రెండవది గొప్ప సంఘటనలకు స్మృతి చిహ్నాలుగా జరుపుకునేవి. మూడవది రుతువులను బట్టి నిర్వర్తించుకునేవి. హెూళి రుతు సంబంధ పర్వం. ప్రత్యేకించి వసంత రుతువుకు సంబంధించిన పండగ. మాఘమాసపు కృష్ణపక్ష పంచమి అంటే వసంత పంచమి దినాలకే, వసంత రుతువు లక్షణాలు పొడసూపుతాయి. కాగా ఫాల్గుణ పూర్ణిమ నాటికి అవి మరింత ప్రస్ఫుటమవుతాయి. రాగి రంగుతో చిగుళ్ళు, ఆకుపచ్చ రంగుతో పత్రాలు పలు రంగులతో పూలు దర్శనమిచ్చే సమయం. తొలకరి పంటలన్నీ ఇంటికి చేరి, పునాస పంటలన్నీ పంట ముఖాల పసిమితో ఉండే కాలమిది. ఇలా వర్ణోన్మీలనం ఈనాటి రంగులీలలకు ప్రాతిపదికగా మారింది. హెూళి పండగను హిందూ దేశంలో వివిధ ప్రాంతాలలో, వివిధ రకాలుగా జరుపుకోవడం కద్దు. హెూలీ పండుగను భారత దేశంలోనే కాకుండా నేపాల్, బంగ్లాదేశ్ తదితర దేశాల్లో కూడా వైభవంగా జరుపు కుంటారు. వసంత కాలంలో వచ్చే పండుగ కాబట్టి పూర్వం ఈ పండుగను 'వసంతోత్సవం' పేరిట జరుపుకునేవారు. దీపావళి తర్వాత దేశంలో అత్యంత వేడుకగా జరుపుకునే పండుగల్లో ఇదీ ఒకటి. బృందా వనంలో శ్రీకృష్ణుడు గొల్లపడుచు లతో వినోదించిన పూజకు, ఈ పండగకు కొన్ని చోట్ల సంబంధం ఉంది. బాలకృష్ణుని ఊయలలో పరుండచేసి, బుక్కా, గులాల్, ఎర్రపాడి చల్లి పూవులు వేసి, పూజ చేస్తారు. దీనిని డోల జాతరగా పిలుస్తారు. 'డోల' అంటే 'ఊయల', ఫాల్గుణ పూర్ణిమ వసంత సంబంధం. కొందరు ఔత్తరాహికులకు ఫాల్గుణ పౌర్ణమి కడచిన మరుసటి దినం సంవత్సరాది. దక్షిణాపథ వాసులైన కర్నాటక, మహారాష్ట్ర తెలుగు జాతీయులకు మరోపక్షంలో చైత్ర మాసాది ఉగాది. సూర్యుడు మేష రాశిలో ప్రవేశించే దినం తమిళుల వత్సరాది. ఇవన్నీ వసంతరుతు ప్రారంభం లోనే కావడం గమనార్హం. ఫాల్గుణ పౌర్ణమి దినమంతా ఉత్సవ దినమే. రంగులు కలిపిన నీళ్ళు ఒకరిపై ఒకరు చల్లు కుంటారు. ఇలా నీళ్ళు చల్లుకునే క్రీడనే వసంతోత్సవం అంటారు. వసంత కాలంలో వాతావరణం మెలమెల్లగా మారతూ, వైరల్ జ్వరం, జలుబు లాంటి వ్యాధులు ప్రబలడం కారణంగా, వాటి నివారణ,.



ఉపశమనానికి కొన్ని ఔషధ మొక్కల నుంచి తయారు చేసిన సహజమైన రంగులు కలిపిన, నీటిని చల్లుకోవడం వల్ల ఈ వ్యాధుల వ్యాప్తి తగ్గుతుందని పెద్దలు చెప్పేవారు. పూర్వకాలంలో మోదుగు పువ్వులు తెచ్చి రోట్లో పోసి దంచి, నీళ్ళతో కలిపి చల్లుకునే వారని జానపద పాటల ద్వారా గ్రహింప వీలగు తున్నది. మోదుగు పువ్వును దంచి శీతల కషాయం చేసి, చల్లు కోవడం వైద్య ప్రక్రియలో భాగమై, ఆరోగ్య వర్ధక మవుతుంది. మోదుగను సంస్కృతంలో 'పలాశ' అంటారు. బ్రహ్మచర్య వ్రత దీక్షితుడైన ఉపవీతుడైన వటునకు దండధారణ, పలాశ వృక్ష ఛాయలో ఉపనయన కార్యకలాపం, పలాశ పత్రాలతో కుట్టిన విస్తట్లో భోజనం ఆచరణగా ఉంది. వసంత కాలంలో ఎటువంటి వారికైనా కామోద్దీపనం కలగడం సహజం. కామాన్ని అదుపులో ఉంచుకొనుటకు మోదుగ ఆమోఘ సాధనం. ఉద్రేకాన్ని అణిచే ఉచిత వైద్య ప్రకియ ఇది. ఏప్రిల్ 1వ తేదీ క్రైస్తవుల "ఆల్ ఫూల్స్ డే"కు భారత దేశ హెూలీ వేడుకలకు పోలిక లున్నాయి. ఇది వసంతోత్సవం, గ్రామీణ క్రీడలు, ప్రేమ కలాపాలకు సంబంధించింది. యూరోపియన్ల అల్లరి చిల్లరి చేష్టలకు, హిందువుల బుక్కా, గులాల్, రంగునీళ్ళు చల్లుకోవడం, చిమ్ముకోవడం, వేళాకోళాలు చేసు కోవడాలకు దగ్గరి పోలికలు ఉన్నాయి. వేళాకోళాలు, ఆనందంలో మునిగి తేలడాలు అతిశయంగా ప్రదర్శితం అవుతూ, యువత ఇంటింటికీ తిరిగి పండగ ఖర్చులకు మామూళ్ళు దండుకునే కార్యక్రమం ఎక్కడా చూసినా దర్శనమిస్తున్నది.

# సంగీత సామ్రాజ్య రారాజు త్యాగరాజు

అసంఖ్యాక కీర్తనలకు ప్రాణం పోసి, కర్ణాటక సంగీతంలోని నియమా లను సోదాహరణంగా నిరూపించి, కర్ణాటక సంగీతానికి మూల స్తంభమై, త్రైమూర్త్య వాగ్గేయ కారులలో ఒకరై, నాదోపాసన ద్వారా, భగవంతుని తెలుసుకో వచ్చునని నిరూపించి, ఆరాధనీ యులు అయినారు... త్యాగయ్య, త్యాగబ్రహ్మగా వినుతికెక్కిన వాగ్గేయ కారుడు కాకర్ల త్యాగరాజు. త్యాగయ్య కీర్తనలు, శ్రీరామునిపై ఆయనకుగల విశేష భక్తిని, వేదాల పై, ఉపనిషత్తులపై ఆయన కున్న జ్ఞానాన్ని తెలియ పరుస్తాయి. ఉపనయనం తరువాత తండ్రిగారి బోధలు, 18వ ఏట రామకృష్ణానంద పరబ్రహ్మం ఉపదేశం చేసిన రామ షడక్షరీ మంత్ర ప్రభావం, తల్లి అలవర్చిన భక్తిసంగీతాలు బాల్యంలోనే బీజాంకురాలై త్యాగ రాజస్వామి వారిలో మూర్తీభవించాయి. నేటి ఆంధ్ర ప్రదేశ్ లోని ప్రకాశం జిల్లా కంభం మండలం కాకర్ల గ్రామంలో, 1767 లో మే 4న, తెలుగు వైదిక కుటుంబీకులైన కాకర్ల రామబ్రహ్మం, సీతమ్మ పుణ్యదంపతులకు త్యాగరాజు మూడవ సంతానంగా జన్మిం చారు. అయన జన్మనామం కాకర్ల త్యాగ బ్రహ్మం. ములకనాడు తెలు గు బ్రాహ్మణులు. త్రిలింగ వైదీకులు. అయన పూర్వీకులు ప్రస్తుత ప్రకాశం జిల్లా కంభం మండలంలో కాకర్ల అను గ్రామం నుండి తమిళ దేశానికి వలస వెళ్లారు. తండ్రి తంజావూరు ప్రభువు శరభోజి వద్ద ఉండే వారు. తాత గిరిరాజ కవి. త్యాగ బ్రహ్మం విద్యకోసం, తిరువా రూర్ నుండి తిరువయ్యూరు వెళ్లారు. అక్కడ సంస్కృతం, వేద వేదాంగములు ఆమూలాగ్రంగా పఠించి, శొంఠి వెంకట రమణయ్య వద్ద, భక్తిశ్రద్ధలతో సంగీతంలో ప్రావీణ్యం సంపాదించు కున్నారు. తండ్రి పిన్న వయసు నందే స్వర్గ ప్రాప్తి నొందగా, అన్నదమ్ముల మధ్య భాగ పరిష్కారంలో, తమ వంతు వచ్చిన, శ్రీరామ లక్ష్మణ కుల విగ్రహా లను పూజిస్తూ, ,"ఉంఛ" వృత్తి స్వీకరించి, ఇష్ట దైవమైన శ్రీ రాము నిపై కృతుల రచనలో అధికభాగం గడిపారు. త్యాగయ్య 96 కోట్ల శ్రీరామ నామ జపం ఆచరించి భగవద్దర్శనం, ఆశీర్వచనం పొందారని చెబుతారు. 18 ఏళ్ల వయసులో, పార్వతి అనే యువ తిని వివాహ మాడారు. పార్వతి చిరు ప్రాయ మరణంతో, ఆమె సోదరి కమలను పరిణయ మాడా రు. సీతా లక్ష్మి అనే కూతురు కలిగింది, ఆమె ద్వారా మనమడు కూడా కలిగాడు. కానీ, మనమడు చిన్నతనంలోనే మృతి చెందడంతో, ఆయనకు వారసులు లేకుండా పోయారు. శొంఠి వెంకట రమణ య్య శిష్యరికంలో 13వ ఏటనే "నమో నమో రాఘవా" అనే కీర్తనను "దేశిక తోడి రాగం"లో స్వరపరిచారు. త్యాగరాజు మంచి వైణికులు కూడా. గురువుగారి గృహములో చేసిన కచేరీలో, త్యాగరాజ పంచరత్న కృతులలో ఐదవది అయిన, "ఎందరో మహానుభావులు" కీర్తన స్వరపరచి గానం చేశారు. త్యాగయ్య గొప్ప తనాన్ని గుర్తించిన గురువు, తంజా వూరు రాజుకు చెప్పగా, ఆ రాజు ధన, కనక, వస్తు, వాహనాలతో సభకు ఆహ్వానించాడు. కానీ తనకు "నిధి కన్నా రాముని సన్నిధి సేవే సుఖమ"ని భావించి, త్యాగ య్య అన్నింటిని తిరస్కరించారు. సంగీతంలో తన ప్రావీణ్యాన్ని ప్రదర్శించడం కన్నా, భగవదా రాధనకు ఒక సాధనంగానే చూశారాయన. తంజావూరు రాజు కానుకల తిరస్కార ఫలితంగా, సోదరుడు జపేశుడు, త్యాగయ్యచే నిత్య పూజలందుకునే, శ్రీరామ పట్టాభిషేకం విగ్రహాలను, కావేరీ నదిలో విసిరి వేయగా, శ్రీరామ వియోగాన్ని భరించలేక... దక్షిణ దేశ యాత్రలు చేసి, ఎన్నో ఆలయా లు, తీర్థ క్షేత్రాలను దర్శించారు. ఈ క్రమంలో అత్యద్భుత కీర్తనలను రచించారు. "రామేతి మధురం వాచం" అన్నట్లు 96 కోట్ల సార్లు రామ నామాన్ని జపించి, స్వీయానుభవ భావనలే కృతి రూపంలో మలచి గాంధర్వ గాన



మధురానుభూతిగా లోకానికి అందించారు. భూలోక నారదుడైన త్యాగరాజ స్వామికి, దేవ ఋషి అయిన "నారదుడే" స్వయంగా సంగీతంలోని రహస్యాలను చెప్పి, "స్వరార్ణవము" ఇచ్చినట్లు, ఆ సందర్భంలోనే "సాధించెనే మనసా" అనే పంచ రత్న మాలిక లోని మూడవ కృతి చేసినట్లు ప్రాచుర్యంలో ఉన్నది. నారద అనుగ్రహ ఫలితంగానే అనేక విషయాలు గ్రహించి, 24వేల రచనలు, 800కీర్తనలు గావించాడు. మంత్రోపదేశం తో "స్వర్ణార్ణవం, నారదీయం" అనే రెండు సంగీత రహ స్యార్థ శాస్త్ర గ్రంథ రచనలు గావించారు. త్యాగయ్య కృతులను ప్రాపంచికం, తాత్వికం, కీర్తనం, నిత్యానుష్టానం, అని నాలుగు విధాలుగా గుర్తిం చారు. చాలావరకు తెలుగులో రచనలు చేసినా, అవి తెలుగు నాట కన్నా, తమిళ నాట ఎక్కువ ప్రాచుర్యం పొందాయి. జగదానంద కారకా అనే కీర్తన శ్రీరాముని 109 నామాలను ఉటంకిస్తుంది. "జగదానంద కారకా (నాట), దుడుకు గల (గౌళ), సాధించినే (అరభి), ఎందరో మహాను భావులు (శ్రీ), కన కన రుచిరా (వరాళీ,)", అనేవి పంచ రత్న మాలికగా, "త్యాగరాజ ఆరాధనోత్సవాలలో" ప్రారంభం కీర్తనలుగా గానం చేయ బడతాయి. త్యాగరాజ స్వామి పరమపదించిన దినమైన, పుష్య కృష్ణ పక్ష పంచమి నాడు, శ్రీ త్యాగరాజ ఆరాధనోత్సవాలు కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రధానంగా తమిళనాడు లోని తంజావూరు జిల్లా తిరువయ్యూరు లోని, త్యాగయ్య సమాధి ప్రాంగణా న, ఉత్సవాలు ఏటా జరుగుతాయి. త్యాగయ్య 1847 జనవరి 6న తన 79వ ఏట మరణించగా, ఆయన మరణానికి ముందు సన్యాసిగా మారగా, ఆయన భౌతిక కాయాన్ని కావేరీ తీరాన ఖననం చేసి, అక్కడ స్మారక చిహ్నాల నిర్మాణం గావించా రు. ఆయన శిష్యగణం అక్కడే సంస్మరణ కార్యక్రమాలు జరుపగా, 1903 తర్వాత పట్టించుకునే స్థితిలో, ప్రముఖ సంగీత విద్వాంసులైన, ఉమయాల్పురం కృష్ణ భాగవతార్, సుందర భాగవతార్లు తమ గురువు సమాధి దయనీయ స్థితికి చలించి, పునరు ద్ధరణ గావించారు. 1905లో త్యాగయ్య వర్ధంతి దినాన తిరువ య్యూరులో, అన్నదానం, సంప్రదాయ పూజలు ఘనంగా నిర్వహించారు. నాటినుండి దేశంలో పలుచోట్ల ఆరాధ నోత్సవాలు నిర్వహిస్తుండడం ఆనవాయితీగా వస్తున్నది. ఈ క్రమంలోనే సకల కళా నిలయమైన ధర్మపురి క్షేత్రంలో దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఏటా త్యాగరాజ ఆరాధనోత్సవాలు నిర్వహించే సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నారు. దేవస్థాన ఆస్థాన సంగీత విద్వాంసులు రాష్ట్ర ప్రభుత్వ సన్మానితులు సంగీత రత్న, కొరిడే నరహరి శర్మ ఆధ్వర్యంలో, మార్చి 14న ప్రారంభించ బడి, 16 వరకు రాష్ట్రంలోని లబ్ధ ప్రతిష్టులు అయిన కళాకారులచే వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

# మానసిక వ్యాధితో బాధపడుతున్న యువకులను ఆదుకున్న విశ్వ మానవ వేదిక.



మనోబంధు ఫౌండేషన్ సహకారంతో చికిత్స.

**పాలకొల్లు. మార్చి.13. ప్రజా జ్యోతి. (కొట్టి రామం)** పాలకొల్లులోని రామారావు పేటకు చెందిన అంబళ్ల నాగ వెంకటేష్(26).. అంబళ్ల జగదీష్(24). అన్నదమ్ములు కాగా ఏడాది క్రితం ఇద్దరు అన్నదమ్ములు ఒకేసారి మానసిక వ్యాధికి గురయ్యారు. చిరిగిన దుస్తులతో పెరిగిన గెడ్డంతో రోడ్లు వెంబడి తిరిగే వారు.ఏమీ తెలియని స్థితిలో ఉండి అటుగా వెళ్లే జనాలను భయభ్రాంతులకు గురిచేసేవా రు. విశ్వమానవవేదిక అధ్యక్షుడు మల్లుల సురేష్ దృష్టికి వారి విషయం రావడంతో ఆయన స్పందించి భీమవరంలోని మనోబంధు ఫౌండేషన్ భూపతిరాజు రామకృష్ణంరాజు దృష్టికి తీసుకెళ్లడంతో ఏడాది క్రితం వారిద్దరిలో ఒకర్ని విశాఖపట్నం, మరొకరిని తమిళనాడుకు ప్రత్యేక అంబులెన్స్ ద్వారా పంపించి చికిత్స చెయ్యించారు. చికిత్స పొందుతున్న సమయంలో రామారావు పేట యువకులు ఎప్పటికప్పుడు వారి పరిస్థితి తెలుసుకుంటూ సహకారం అందించారు. వారిద్దరూ చికిత్స తీసుకుని ఇప్పుడు సాధారణ స్థితికి వచ్చారు. వారిద్దరూ కొన్నాళ్లపాటు వైద్య సహాయం తీసుకోవలసి ఉంది. ఈ నేపథ్యంలో వారిద్దరికి పూర్తిగా నయం అయ్యేవరకు ఇద్దరికీ విశ్వమానవవేదిక నిత్యాన్నదానం ద్వారా భోజనం అందించడానికి విశ్వమానవవేదిక అధ్యక్షుడు మల్లుల సురేష్ ముందుకువచ్చారు. గురువారం పి బుద్ధరాజు , నడపన జగపతిల చేతుల మీదుగా వారిద్దరికి భోజనం ప్యాకెట్ లు అందించారు. పాలకొల్లు ప్రాంతంలో మానసిక వ్యాధితో బాధపడుతూ ఏ ఆధారంలేని మానసిక వికలాంగులు ఉంటే 9652256999, 9346625099 ఫోన్ నంబర్లని సంప్రదిస్తే విశ్వమానవవేదిక నిత్యాన్నదానం కింద వారు నివసిస్తున్న ప్రదేశానికే భోజనం పంపించే ఏర్పాటు చేస్తామని విశ్వమానవవేదిక అధ్యక్షుడు మల్లుల సురేష్ ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో గమిడి హేమంత్, కొప్పినీడి కళ్యాణ్‌కుమార్, మల్లేడి దేవిరాజ్, విశ్వ మానవ వేదిక సభ్యులు డాక్టర్ మల్లుల జానేశ్వరి, గుంపుల రవి, మల్లుల గిరీష్, కుక్కల గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్






**పొందూరు ,ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు మండలం 29 పంచాయితీలలో జరిగిన ఉపాధి హామీ పనులపై మండల పరిషత్ కార్యాలయంలో 16వ సామాజిక తనిఖీ ప్రజా వేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపిడిఓ మన్మథ రావు , ఏ .పి. ఓ పైల శ్రీనివాస రావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రిసైడింగ్ అధికారిగా జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథక డైరెక్టర్ (డుమా పీడి) డి సుధాకర్ వ్యవహరించారు. ఈ సందర్భంగా 2023-24 ఆర్థిక సంవత్సరంలో జరిగిన ఉపాధి హామీ పనులలో వేతనాలు , ఖర్చుల వివరాలను చదివి వినిపించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎన్.ఆర్.జి.ఈ.ఎస్ నిధులతో జరిగిన పనులపై 20 రోజుల పాటు గ్రామస్థాయిలో సామాజిక తనిఖీ నిర్వహించి నివేదికలు తయారు చేయడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా వేతనాలు 13.31 కోట్లు , భవన నిర్మాణ మెటీరియల్స్ కొరకు 3.24 కోట్లు మొత్తంగా 16.55 కోట్లు ఖర్చు జరిగిందని తెలిపారు ఎటువంటి అవాంచనీయ సంఘటనలు జరగకుండా స్థానిక ఎస్. ఐ సత్యన్నారాయణ తన సిబ్బందితో పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో హిరమండలం క్లస్టర్ ఎపిడి పి రాధ , డుమా విజిలెన్స్ అధికారిస్వరూపా ,అకౌంటబిలిటీ అధికారి శ్రావణ్ కుమార్,తెలుగు దేశం మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్ ,తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యదర్శి సీపాన శ్రీరంగ నాయకులు ,ఎంపీపీ కిల్లి ఉషారాణి ,టి.ఎన్.టి.యు.సి జిల్లా అధ్యక్షులు గాడు నారాయణ రావు , ఏ.ఎం.సి మాజీ ఛైర్మెన్ అన్నెపు రాము , పొందూరు పట్టణ పార్టీ అధ్యక్షులు అనకాపల్లి చిన రంగ,చింతాడ వాసుదేవ రావు , బొడ్డేపల్లి సత్యం , పప్పల వేణుగోపాలం ,మండల అధికారులు , సర్పంచులు పాల్గొన్నారు.

# సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ళ..

650 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు..

నిఘా కోసం 70 సీసీ కెమెరాలు 2 డ్రోన్ లు ఏర్పాటు..



**బాపట్ల జిల్లా మార్చి 13 (ప్రజా జ్యోతి స్టాఫ్ రిపోర్టర్)** ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రణాళికాబద్ధమైన ఏర్పాట్లు చేశామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ తెలిపారు. జిల్లా ఎస్పీ గురువారం సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి తిరునాళ్ళ బందోబస్తు ఏర్పాట్లను పరిశీలించారు. వాహనాలను దారి మళ్లించే ప్రదేశాలను, పార్కింగ్ ప్రదేశాలను, భక్తులు దర్శనానికి వెళ్లడానికి ప్రవేశ ద్వారం నుండి ఏర్పాటు చేసిన క్యూలైన్ లను, పోలీస్ కంట్రోల్ రూమ్ ను, పోలీస్ అవుట్ పోస్ట్ లను పరిశీలించారు. ట్రాఫిక్ విధుల్లో వున్న సిబ్బంది అప్రమత్తంగా విధులు నిర్వహించాలన్నారు. ఏమాత్రం ఆ జాగ్రత్తగా ఉన్న ట్రాఫిక్ కు అంతరాయం ఏర్పడే అవకాశం ఉంటుందని హెచ్చరించారు. దేవాలయ ప్రవేశ ద్వారాల వద్ద క్యూలైన్ లలో విధులు నిర్వహించే పోలీస్ సిబ్బంది తోపులాటలు జరగకుండా చూసుకోవాలన్నారు. విద్యుత్ ప్రభల వద్ద ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకోవాలని పోలీస్ అధికారులకు సూచించారు. శుక్రవారం తిరునాళ్ళకు సుమారు 2.5 లక్షల నుండి 3 లక్షల వరకు భక్తులు వచ్చే అవకాశం ఉందన్నారు. దానికి అనుగుణంగా మొత్తం సుమారు 650 మంది పోలీసులతో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. వీరిలో 4 గురు డిఎస్పీలు 13 మంది సీఐలు 46 మంది ఎస్ఐలు ఉన్నారన్నారు. దొంగతనాలు ఇతర అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా దేవాలయం దాని పరిసర ప్రాంతాలలో మొత్తం 70 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. వాటిని పోలీస్ కంట్రోల్ రూమ్ కు అనుసంధానం చేసి పర్యవేక్షిస్తున్నామన్నారు. బహిరంగ ప్రదేశాలలో, పార్కింగ్ ప్రదేశాలలో నిఘా కోసం 2 డ్రోన్లను వినియోగించనున్నామన్నారు. భక్తులు రద్దీ ఎక్కువగా వుండే ప్రదేశాలలో దొంగతనాలకు పాల్పడే వారిని గుర్తించి అదుపులోకి తీసుకునేందుకు సాధారణ దుస్తులలో పోలీసులను నియమిస్తామన్నారు. ప్రజలకు వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రణాళిక బద్ధంగా తగిన ముందస్తు చర్యలు తీసుకున్నామన్నారు. ప్రజలకు సహాయం అందించేందుకు దేవాలయ ప్రాంగణంలో పోలీస్ కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే విధంగా వ్యవహరిస్తే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో చీరాల డిఎస్పి మోయిన్, ఏస్.బి సీఐ నారాయణ, అద్దంకి పట్టణ సీఐ సుబ్బరాజు, అద్దంకి రూరల్ సిఐ మల్లికార్జున, ఇంకొల్లు సీఐ రమణయ్య ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

## ప్రశాంత వాతావరణంలో రంగోలి జరుపుకోవాలి..

మతవిద్వేషాలు రెచ్చగొడితే కఠిన చర్యలు తీసుకుంటాం..

**బాపట్ల జిల్లా మార్చి 13 (ప్రజా జ్యోతి స్టాంప్ రిపోర్టర్)** సోషల్ మీడియా పై నిఘా ఉంచామని అసంబద్ధ వదంతులను వ్యాపింపచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తుషార్ డూడి ఐపీఎస్ హెచ్చరించారు. బాపట్ల ఎస్పీ గురువారం జిల్లా ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. హోలీ పండుగ సందర్భంగా జిల్లా వ్యాప్తంగా పటిష్ట పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. ఏటువంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా డ్రోన్ లను వినియోగించి పరిసరాలను పరిశీలిస్తున్నామన్నారు. ముఖ్యమైన ప్రదేశాలు దేవాలయాలు మసీదుల వద్ద పోలీస్ పికెట్ లను ఏర్పాటు చేశామని తెలిపారు. ఇతరులను రెచ్చగొట్టే విధంగా, మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యాఖ్యలు చేసిన, అవాంఛనీయ ఘటనలను ప్రేరేపించే విధంగా వ్యవహరించిన చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సోషల్ మీడియా పై నిఘా ఉంచామన్నారు. సోషల్ మీడియా వేదికగా అసంబద్ధ వదంతులను వ్యాపింప చేస్తే వారిని గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. హోలీ సందర్భంగా రంగులను చల్లుకునే సమయంలో ఇతరులకు బాటసారులకు, వాహన దారులకు ఇబ్బందులు కలగకుండా వారిపై రంగులు పడకుండా వ్యవహరించాలన్నారు. ప్రతి ఒక్కరూ మత సామరస్యాన్ని పాటిస్తూ ప్రశాంత వాతావరణంలో హోలీ పండుగ జరుపుకోవాలని జిల్లా ప్రజలకు ఎస్పీ సూచించారు.




## కాశీనాయన ఆలయ అంశంపై కేంద్ర మంత్రి భూపేంద్ర యాదవ్‌ని కలిసిన టీడీపీ నాయకులు రితేష్ రెడ్డి

**బద్వేల్ మార్చి 13 (ప్రజా జ్యోతి న్యూస్)** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మంత్రివర్యులు నారా లోకేష్ గారి సూచనలతో టీడీపీ బద్వేల్ సమన్వయకర్త రితేష్ రెడ్డి గారు ఢిల్లీలో కేంద్ర అటవీ శాఖ మంత్రివర్యులు శ్రీ భూపేంద్ర యాదవ్ గారిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఇటీవల జరిగిన కాశీనాయన ఆలయ నిర్మాణాల కూల్చివేత ఘటన గురించి రితేష్ రెడ్డి గారు కేంద్ర మంత్రి గారికి వివరించి భక్తుల మనోభావాలను దృష్టిలో ఉంచుకుని ఫారెస్ట్ క్లియరెన్స్ అనుమతులు ఇచ్చి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. కేంద్ర మంత్రి శ్రీ భూపేంద్ర యాదవ్ గారు ఆలయ సమస్య తీవ్రతను అర్థం చేసుకుని సానుకూలంగా స్పందించి త్వరలోనే దీనికి శాశ్వత పరిష్కారం చూపిస్తామని టిడిపి బద్వేల్ సమన్వయకర్త రితేష్ రెడ్డి గారికి తెలిపారు. సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి గారు, జమ్మలమడుగు ఎమ్మెల్యే ఆదినారాయణ రెడ్డి, జమ్మలమడుగు నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త భూపేష్ రెడ్డి , శశిభూషణ్ రెడ్డి , సింగారెడ్డి. మరియు %=హా . ఎహ% పెద్దలు పాల్గొన్నారు.



## పొందూరులో డైలీ మార్కెట్ వేలం పాట



**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** మండల కేంద్రంలో మహారాజా మార్కెట్ ఆవరణంలో ఉన్న దుకాణాలకు పంచాయతీ ఆవరణంలో ఈ. ఓ మోహన్ బాబు ఆధ్వర్యంలో డివిజనల్ పంచాయతీ అధికారి ఐ.వి రమణ సమక్షంలో గురువారం నాడు వేలం నిర్వహించారు. ఈ వేలంలో మార్కెట్ అశీలు గతంలో 2023-24 లో 8,69,100 ఉండగా 2024-25 సంవత్సరానికి గాను 11,10,000 కు అనకాపల్లి రమేష్ అనే వ్యక్తి వేలం లో సొంతం చేసుకున్నారు. దీంతో గత సంవత్సరం కంటే సుమారు 240900 అధికంగా వేలం జరిగింది. వీటితో పాటు వేలంలో కార్టు స్తాండ్ , బస్ స్టాల్ రూ.23000 కు గత సంవత్సరంలో వేలం అవ్వగా 23,500 కొన్న సత్తిబాబు సొంతం చేసుకున్నారు. గత సంవత్సరంలో కామేలా 46000 రూపాయలకు వేలం పాడగా 2025-26 సంవత్సరానికి గాను 55500 మద్దిల రాధాకృష్ణ వేలం పాట లో దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఈ. ఓ .పి.ఆర్.డి పొందూరు సింహాచలం ,పంచాయతీ ఈ. ఓ మోహన్ బాబు, మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగిడి లక్ష్మీ , టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్, పట్టణ పార్టీ అధ్యక్షులు అనకాపల్లి చిన రంగ , ఉప సర్పంచ్ అనకాపల్లి గోవింద్ ,పాటదారులు పాల్గొన్నారు.

## స్వర్గీయ పర్వత చిట్టిబాబు లేకపోవడం అందరికి తీరని లోటు-వెన్నా శివ,కీర్తి సుభాష్




**శంఖవరం మండలం ప్రజా జ్యోతి రిపోర్టర్.. బి ఎస్ వి ప్రసాద్** దివంగత నేత,ప్రత్తిపాడు మాజీ ఎమ్మెల్యే,ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా టిడిపి మాజీ అధ్యక్షులు పర్వత చిట్టిబాబు మన మధ్య లేకపోవడం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులకు తీరని లోటని టిడిపి సీనియర్ నేత,రాష్ట్ర టిఎన్టియుసి ఉపాధ్యక్షులు వెన్నా ఈశ్వరుడు (శివ),నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు కీర్తి సుభాష్ అన్నారు.పర్వత చిట్టిబాబు 9వ వర్ధంతిని పురస్కరించుకొని గురువారం శంఖవరం మండలం కత్తిపూడి సీతారామ కాలేజీలో ఉన్న పర్వత చిట్టిబాబు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వెన్నా శివ మాట్లాడుతూ పర్వత చిట్టిబాబు ఎమ్మెల్యేగా కొనసాగిన సమయంలో ఆయన ఆశయాలు, ఆలోచనలు,సిద్ధాంతాలు చాలా గొప్పవని,ఆయన సిద్ధాంతాలకు అనుగుణంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు నడుచుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో చిట్టిబాబు కుమార్తె దుర్గాదేవి,మాజీ ఎంపీటీసీ సాదనాల లక్ష్మీబాబు, కీర్తి కుమార్,రౌతు శివ,అధిక సంఖ్యలో అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జువ్వల వారి వివాహ వేడుకలో పాల్గొన్న మురళిరాజు




**ప్రత్తిపాడు ప్రజా జ్యోతి రిపోర్టర్. వీరబాబు** ప్రత్తిపాడు మండలం అన్నవరంలో జరుగుతున్న ధర్మవరం గ్రామానికి చెందిన జువ్వల శ్రీను గారి కుమార్తె వివాహ వేడుకకు హాజరై వధూవరులను ఆశీర్వదించిన ఎం.ఎం.ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ %ఃఽ% ప్రత్తిపాడు నియోజకవర్గ వైయస్సార్ సిపి నాయకులు ముదునూరి మురళీకృష్ణం రాజు ఈ కార్యక్రమానికి ముదునూరి సీతారామరాజు , కోలా తాత బాబు , చేకూరి ప్రసాద్ రాజు , జువ్వల దొరబాబు , దాడి పుత్రయ్య తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలో ఫుడ్ కమీషన్ సభ్యులు జక్కంపూడి కిరణ్ పర్యటన..

**కొవ్వూరు, మార్చి 13 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** తూర్పు గోదావరి జిల్లాలో ఆహార కమిషన్ సభ్యులు జక్కంపూడి కిరణ్ గురువారం పర్యటించారు.కొవ్వూరు లో పలు స్కూల్ లు రేషన్ షాపు లు, సందర్శించారు.అనపర్తి గాంధినగర్ , సునందపేట , ఇందిరా నగర్ , షారోనుపురం టీటీడీ కళ్యణ్ మండపంలో అంగన్వాడీ సెంటర్ సందర్శించారు. స్టాక్ రికార్డు లు సరిగ్గా నిర్వహించక పోవడం పై సీడీపీఓ మరియు సూపర్ వైజర్ లకు మెమో ఇవ్వమని ఐసీడీఎస్ పీడీ కే. విజయ కుమారి నీ ఆదేశించారు. లక్ష్మి నర్సాపురంలో డా బి ర్ అంబేద్కర్ గురుకులం హాస్టల్ ను , అనపర్తి లోని జెడ్పీ హై స్కూల్ ను సందర్శించి రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించిన విధంగా మెనూ ప్రకారం ఆహారంపెట్టాలనీ ఆదేశించారు. విద్యార్థులు తో కలిసి భోజనం చేసి ఆహార లోటుపాట్లను అడిగి తెలుసుకున్నారు. అనపర్తి ఏరియా హాస్పిటల్ లో పి ఎం ఎం వి వై పథకం గురించి అక్కడ రోగులకు, వారి సహాయకులకు అవగాహనా కల్పించారు. హాస్పిటల్లో ఇచ్చే ఆహారంను తనిఖీ చేసి లోపాలను సరిచేయమని ఆసుపత్రి సూపరింటెండెంట్ కు సూచనలు చేశారు.కార్యక్రమంలో జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె. విజయ కుమారి, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ టి. రాధిక , గిరిజన సంక్షేమ జిల్లా అధికారి కే ఎన్ జ్యోతి , సాంఘిక సంక్షేమ అధికారులు, బిసి వసతి గృహాల అధికారులు , తూనికలు కొలతలు, జిల్లా ఆహార భద్రత అధికారులు పాల్గొన్నారు.



# రొయ్యల రైతులను ఆదుకోవాలి..

**రొయ్యల కు గిట్టుబాటు ధర కల్పించాలి..**

**ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం..**

**ఏలూరు, మార్చి 12 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించి రొయ్యల రైతులను ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఏలూరు అన్నే భవనంలో రొయ్యల రైతుల సమస్యలపై ఆయన మాట్లాడారు. రొయ్యల కొనుగోలు కంపెనీలు సిండికేట్ గా మారి కొనుగోలు ధరలు తగ్గించడం వల్ల రొయ్యల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఒకవైపు ఉత్పత్తి ఖర్చులు విపరీతంగా పెరిగిపోయాయని, తగిన దిగుబడులు కూడా రావడం లేదని చెప్పారు. గతంలో వనామి రొయ్యల ఫీడ్ ధర టన్ను 45 వేలు ఉంటే ప్రస్తుతం లక్ష 5వేల రూపాయలకు పెరిగిపోయిందన్నారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులు కనుగుణంగా రొయ్యలకు గిట్టుబాటు ధరలు పెరగలేదన్నారు. 100 కౌంట్ రొయ్య ధర 260 నుండి 230, రూపాయలు, 50 కౌంట్ 380 నుండి 350,40 కౌంట్ 420 నుండి 360 రూపాయి లకు ధరలు పడిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన ఖర్చులకు అనుగుణంగా రొయ్యలకు గిట్టుబాటు ధర కల్పించి రొయ్యల రైతులను ఆదుకోవాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే జోక్యం చేసుకోవాలన్నారు. పెరిగిన ఫీడ్ ధరలు తగ్గించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. నాణ్యమైన సీడ్ అందించాలన్నారు. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్ 1.50 సబ్సిడీ పథకాన్ని రైతులందరికీ వర్తింపజేయాలని కోరారు.రొయ్యలు రైతులు చేస్తున్న ఆందోళనకు ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కమిటీ తరపున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఇప్పటికైనా రొయ్యల రైతుల సమస్యలపై ప్రభుత్వం స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు గుండపనేని సురేష్ పాల్గొన్నారు.





# మార్చి 15 నుంచి గృహా లబ్ధిదారులకు అవగాహాన..

**జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి..**

**జిల్లాలో ఏడు నియోజక వర్గాలలో 27,441 మంది లబ్ధిదారులు గుర్తింపు..**

**పిఎంఏవై గ్రామీణ, అర్బన్ 1.0 పథకం కింద కాకుండా రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేస్తున్న ప్రత్యేక గ్రాంట్..**

**గృహ నిర్మాణ పురోగతి మేరకు 4 దశల్లో ఆర్థిక సహాయం విడుదల..**



**రాజమహేంద్రవరం, మార్చి 13 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** జిల్లాలో ఏడు నియోజక వర్గాలలో అసంపూర్తిగా నిర్మాణ దశలో ఉన్న ఎస్ సి, బి సి, ఎస్ టి గృహ లబ్దిదారులు ఇండ్ల నిర్మాణం పూర్తి చెయ్యడం కోసం రాష్ట్ర ప్రభుత్వం గ్రాంట్ రూపంలో మూడు దశల్లో ఆర్థిక సహాయం అందించేయ్యనున్నట్లు జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి తెలిపారు. గురువారం సాయంత్రం జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా, డివిజన్, మండల క్షేత్ర స్థాయి, మండల ప్రత్యేక అధికారులతో గృహ నిర్మాణాల అదనపు ఆర్థిక సహాయం విడుదల చెయడం పై దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీఎం ఎవై గ్రామీణ, పట్టణ 1.0 పథకం కు అదనంగా గ్రాంట్ రూపంలో ఎస్ సి, బిసి లకు 50 వేలు చొప్పున, ఎస్ టి లకి 75 వేల రూపాయలు, పిజిటీ గ్రూప్ లకి లక్ష చొప్పున ఆర్థిక సహాయం అందజేస్తున్నట్లు తెలిపారు. ఇంటి నిర్మాణ పనులకు సంబంధించి నాలుగు దశల్లో ఆర్థిక సహాయం విడుదల చెయ్యాలని పేర్కొన్నారు. తొలి, రెండవ దశల్లో 15 వేలు చొప్పున, మూడు నాలుగు దశల్లో 10 వేలు చొప్పున నిధులను లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమ చేయాలని ఆదేశించారు. లబ్దిదారులలో అవగాహన కల్పించే చర్యలలో స్థానిక ప్రజా ప్రతినిధుల సమక్షంలో ప్రజలతో మమేకం అవ్వాలని కలెక్టర్ పి ప్రశాంతి స్పష్టం చేశారు. లబ్దిదారులు గుర్తింపు విధానంలో కుల ధృవీకరణ తప్పనిసరి అని పేర్కొన్నారు. తాజా కుల ధృవీకరణ పత్రం ను నిర్ధారణ చేసుకుని మాత్రమే లబ్దిదారులు గుర్తింపు ఉండాలని ఇందుకు , డిజిటల్ సర్టిఫికెట్ ను ఆన్లైన్ లో అప్లోడ్ చెయ్యడం ముఖ్యం అన్నారు. ఈ దశలో నిర్మాణాలు చేపట్టే వారి కోసం కొత్త మాడ్యూల్ అనుసరించి డేటా ఎంట్రీ చెయ్యాల్సి ఉంటుందనీ జిల్లా కలెక్టర్ పి ప్రశాంతి పేర్కొన్నారు. సచివాలయ ఇంజనీరింగ్ సహాయకులు , హౌసింగ్ ఏ ఈ , డి ఈ , ఈ ఈ లు నిర్మాణ దశల పురోగతిని అప్లోడ్ చెయ్యాలని ఆదేశించారు. జిల్లా గృహ నిర్మాణ అధికారి ప్రాజెక్ట్ డైరెక్టర్ పర్యవేక్షణా చెయ్యడం జరుగుతుందని పేర్కొన్నారు. స్టేజ్ కన్వర్షన్ కు అనుగుణంగా క్షేత్ర స్థాయిలో పరిశీలన చేసి మాత్రమే నిర్ధారణ చేయాలన్నారు. ఇండ్ల సందర్శన, కుల ధృవీకరణ, ప్రజా ప్రతినిధులతో సమన్వయం చేసుకోవడం పై ప్రత్యేక అధికారులు దృష్టికేంద్రీకరించాలని ఆదేశించారు. గృహ నిర్మాణం లో టాయిలెట్స్, సోప్ పిట్స్ నిర్మాణం చేపట్టడం ముఖ్యం అన్నారు. ఫీల్డ్ విజిట్ సందర్భంలో తప్పనిసరిగా ఫోటో క్యాప్చర్ చేయాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్ లో హౌసింగ్ పిడి ఎస్. భాస్కర్ రెడ్డి, డ్వామా పిడి ఎ. నాగమల్లేశ్వర్, ఆర్డబ్ల్యుఎస్ ఎస్ ఈ బివి గిరి, జిల్లా పశు సంవార్ధక అధికారి కే. శ్రీనివాస రావు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్షేత్ర స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## మునశీబు రామాలయం వద్ద ఏకాహం మహెూత్సవాలు

**ప్రత్తిపాడు ప్రజా జ్యోతి రిపోర్టర్ వీరబాబు** ప్రత్తిపాడు మునశీబు పెద్ద రామాలయం వద్ద శ్రీరామ విగ్రహ ప్రతిష్ట సందర్భంగా ఏకాహం మహెూత్సవ ఘనంగా నిర్వహించారు. రామాలయ నిర్వహణ అధ్యక్షులు మదినే శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు గోడే ఏసుబాబు ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు ఏకాహం కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా శ్రీరామ విగ్రహ ప్రతిష్ట సందర్భంగా మొదలుపెట్టిన ఏకాహ మహెూత్సవ కార్యక్రమాలు నిర్విరామంగా కొనసాగుతున్నాయని అప్పుడు మొదలుపెట్టిన కార్యక్రమాలు ఏ సంవత్సరం కూడా ఆగకుండా ఆ శ్రీరాముని దయవల్ల నిరంతరం కొనసాగుతున్నాయని అన్నారు. ఈ ఏకాహం మహెూత్సవ కార్యక్రమాలు 24 గంటల పాటు ఏకధాటిగా శ్రీరామ భక్తి గీతాలు భజన కార్యక్రమాలు ఆలపించడం జరుగుతుందని ఈ భజన గీత కార్యక్రమాలు మహిళలు, పురుషులు బృందాలుగా ఏర్పడి నిరంతరాయంగా స్వామి కీర్తనలు ఆలపించడం జరుగుతుందని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ఏకాహ మహెూత్సవ కార్యక్రమంలో గ్రామ పెద్దలు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ఆ స్వామివారి ఆశీస్సులు పొందుతారని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.




## పంచాయతీ ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటు




**పొందూరు , ప్రజా జ్యోతి న్యూస్ :** పొందూరు మండల కేంద్రంలో స్థానిక పోలీస్ స్టేషన్ కు అతి సమీపంలో మేజర్ పంచాయతీ చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రాన్ని సర్పంచ్ రేగిడి లక్ష్మీ , టిడిపి మండల పార్టీ అధ్యక్షులు చిగిలపల్లి రామ్మోహన్ ప్రారంభించారు. వేసవిలో ఎండల తీవ్రత తో ప్రజల దాహర్తిని తీర్చేందుకు ఉపయోగపడుతుందని తెలిపారు. నిత్యం ప్రజలు ప్రయాణించే ఈ ప్రాంతంలో వేసవికాలం పూర్తి అయ్యేవరకు ఈ చలికేంద్రం ద్వారా స్వచ్ఛమైన త్రాగునీటిని అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ పార్టీ అధ్యక్షులు అనకాపల్లి చిన రంగ , వార్డు మెంబర్లు పాల్గొన్నారు

## మొల్ల రామాయణం సరళమైనది.. మొల్ల జయంతి వేడుకలలో జెసి..




**రాజమహేంద్రవరం, మార్చి 13 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** తొలి తెలుగు కవితా రచయిత్రి మొల్ల జయంతి వేడుకలు కలెక్టరేట్లో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు ,కవయిత్రి మొల్ల చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ ఎస్ చిన్న రాముడు మాట్లాడుతూ, సామాన్యులకు అర్థమయ్యే రీతిలో రామాయణాన్ని రచించినట్లు చెప్పారు. ఈమె రచించిన రామాయణం మొల్ల రామాయణంగా ప్రసిద్ధి చెందిందన్నారు. మొల్ల రామాయణం ఆరు కాండాలలో 871 పద్యాలతో రచించినట్లు తెలిపారు. ఈ కావ్యాన్ని మొల్ల కేవలం ఐదు రోజులలో రాసిందని ప్రతీతి గా పేర్కొన్నారు.మొల్ల రచన ఆనాటి పద్ధతికి విరుద్ధంగా వాడుక భాషకు దగ్గరగా తెలుగులో వ్రాయబడిన అనేక రామాయణాలలో మొల్ల రామాయణం చాలా సరళమైనదని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీ ఆర్ వో టి సీతారామ మూర్తి, జిల్లా బిసి సంక్షేమ అధికారి బి శశాంక, కలక్టరేట్, ఇతర శాఖల అధికారుల,ఉద్యోగులు పాల్గొన్నారు.

## యస్.సి. యస్.టి. అభ్యర్థులకు ఉచితంగా డి.యస్.సి. కోచింగ్..

**ఉప సంచాలకులు యం.యస్. శోభారాణి..**



**రాజమహేంద్రవరం, మార్చి 13 (ప్రజా జ్యోతి ప్రతినిధి) :** సాంఘిక సంక్షేమ శాఖ, తూర్పు గోదావరి జిల్లా ద్వారా యస్.సి. యస్.టి. అభ్యర్థులకు ఉచితంగా డి.యస్.సి. కోచింగ్ ఇవ్వనున్నట్లు జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు శ్రీమతి ఎమ్ ఎస్ శోభారాణి గురువారం ప్రకటనలో తెలిపారు.దరఖాస్తు చేసుకునేందుకు మార్చి 15 వ తేదీ వరకు గడువు ఉందని ఆమె పేర్కొన్నారు.ఉచిత డి.యస్.సి కోచింగ్ సంభందించి జ్ఞానభూమి పోర్టల్‌లో https://mdfc.apcfss.in వెబ్ పోర్టల్లో ఉచిత డి ఎస్ సి కోచింగ్ కోసం షార్ట్ లిస్ట్ చేయబడిన ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు జాబితా మరియు "వెబ్ ఆప్షన్స్" ఇచ్చినట్లు చెప్పారు. దరఖాస్తు చేసుకునేందుకు వెబ్ ఆప్షన్ కోసం మార్చి 15 వ తేదీ వరకు మాత్రమే స్వీకరించనున్నట్లు తెలిపారు. తూర్పు గోదావరి జిల్లాలో శిక్షణాకార్యక్రమం అందజేసేందుకు రాజమహేంద్రవరం "స్వయం కృషి గురుకృపా ఎడ్యుకేషన్ సొసైటి ని ఎంపిక చేసినట్లు తెలిపారు.

## తొలి తెలుగు కవిత్రి ఆత్మకూరి కి ఘన నివాళి..



**కాకినాడ, మార్చి 13 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** తొలి తెలుగు కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ చిత్ర పటానికి కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందుమాధవ్ నివాళులర్పించారు. కవయిత్రి ఆతుకూరి మొల్లమాంబ జయంతి సందర్భంగా జిల్లా పోలీస్ కార్యాలయం లో ఆమె చిత్రపటాన్ని పుష్ప మాలాంకృతం చేసి, ఎస్పీ అంజలి ఘటించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పి పరిపాలన ఎం జె వి భాస్కరరావు, అదనపు ఎస్పీ ఏ ఆర్ శ్రీనివాసరావు, ఎస్ డి పి ఓ కాకినాడ ఏ ఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, ఎస్ డి పి ఓ పెద్దాపురం శ్రీహరి రాజు, డీఎస్పీ ఏఆర్ శ్రీహరి రావు మరియు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# నిరుద్యోగ సదస్సు ను జయప్రదం చేయండి.

బద్వేల్ మార్చి 13 (ప్రజా జ్యోతి న్యూస్) ఈనెల 14 న కడప లోని యూటీఎఫ్ భవన్ నందు సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిరుద్యోగ సదస్సు నిర్వహిస్తున్నట్లు ఈ సదస్సు కి జిల్లా లోని నిరుద్యోగ యువత పాల్గొని జయప్రదం చేయాలని డివైఎఫ్ఐ బద్వేల్ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు. ఎస్కే మస్తాన్ షరీఫ్. ఎస్ కే ఆదిల్. పిలుపునిచ్చారు. గురువారం స్థానిక బద్వేల్ పట్టణంలోని కార్యాలయంలో వారు మాట్లాడుతూ..... ఎన్నికల సందర్భంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగులకు అనేక రకాల హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చారని అన్నారు. కానీ గడిచిన ఇన్ని నెలలు అవుతున్న నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఏది అమలుకు నోచుకోలేదన్నారు. అది మెగా డీఎస్సీ గాని,కడప ఉక్కు పరిశ్రమ గాని, ప్రభుత్వ రంగ సంస్థలో ఖాళీలు భర్తీ గాని, వాలంటీర్లకు ఇచ్చిన వాగ్దానం గాని,నిరుద్యోగ భృతి గాని ఏవి అమలకు శ్రీకారం చుట్టలేదన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ అధికారంలోకి వస్తే దేశంలో ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు కల్పన చేస్తానని హామీ ఇచ్చి ఆ హామీ నేటికీ అమలు కాలేదన్నారు. మేకిన్ ఇండియా,మేడిన్ ఇండియా పేరుతో ప్రచారం తప్ప ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లు కంపెనులు అయిన అదానీ,అంబానీలకు తాకట్టు పెడుతూ ఉన్న ఉద్యోగాలను తొలగిస్తున్నారన్నారు.అలాగే విభజన హామీ అయిన కడప ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కు కూడా కేంద్రం నిర్లక్ష్యం వహిస్తూ ఉక్కు పరిశ్రమ ఏర్పాటు కు ముందుకు అడుగులు వేయడం లేదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం కూడా ఎన్నికలలో హామీలు ఇచ్చి కడప ఉక్కును విస్మరించిందని అన్నారు.అందుకు నిదర్శనమే కేంద్ర,రాష్ట్ర బడ్జెట్ లలో కడప ఉక్కు కు నిధులు కేటాయించలేదు అన్నారు.అలాగే నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి కల్పిస్తానని హామీ ఇచ్చిందని రాష్ట్ర ప్రభుత్వం వాటి అమలుకు శ్రీకారం చుట్టలేదన్నారు. రాష్ట్రంలో డిఎస్సీ పై ప్రభుత్వం మొదటి సంతకం చేసింది గాని ఇంతవరకు పరీక్షకు తేదీలు ప్రకటించలేదన్నారు. కానిస్టేబుల్ మెయిన్స్ కూడా నిర్వహించడంలో తాత్సారం చేస్తున్నారని అన్నారు.రాష్ట్రంలో ప్రభుత్వ రంగ సంస్థలో ఖాళీగా వున్న 2 లక్షల 30 వేల పోస్టులు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారని అది అమలు కాలేదన్నారు. వీటి సమస్యల పై నిరుద్యోగులు ఈనెల 14న కడపలో యుటిఎఫ్ భవన్ నందు సదస్సు నిర్వహించడం జరుగుతుందని నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో పట్టణ ఉపాధ్యక్షుడు నరసింహా తదితరులు పాల్గొన్నారు.




# హెూటల్ యజమానిని సన్మానించిన మునిసిపల్ కమిషనర్

**బద్వేల్ మార్చి 13 (ప్రజా జ్యోతి న్యూస్)** ఈరోజు ప్రజారోగ్య సిబ్బంది తో కలిసి పలు హెూటల్ లు తనిఖీ చేయగా ఆ హెూటళ్ళ నందు విస్తరాకులు మరియు అరటాకులు వాడటం తో పాటు పరిశుభ్రత ను కూడా పాటిస్తున్నారని కమీషనర్ తెలిపారు. రాధాకృష్ణ హెూటల్ నందు అరిటాకులు, విస్తరాకులు వాడటం తో పాటు హైజినిక్ పాటిస్తూ ప్లాస్టిక్ నియంత్రణ లో భాగమవడంతో కమిషనర్ మరియు మునిసిపల్ సిబ్బంది టిఫిన్ చేసి హెూటల్ యజమానినీ మరియు హెూటల్ సిబ్బందిని మునిసిపల్ కమీషనర్ నరసింహారెడ్డి అభినందిస్తూ సన్మానించడం జరిగింది. గతంలో ప్లాస్టిక్ కవర్ ల కంటే అరటాకులే తక్కువ ధరలో వస్తున్నాయని తెలియక ప్లాస్టిక్ కవర్ వాడేవాళ్ళమని హెూటల్ యజమానులు కమీషనర్ కు తెలిపారు. పరిశుభ్రత పాటించడం మరియు అరిటాకులు వాడటంవలన కస్టమర్ ల సంఖ్య పెరగడంతో పాటు హెూటల్ నందు గూగుల్ రేటింగ్ కూడా పెరిగిందని హెూటల్ యజమానులు మునిసిపల్ కమీషనర్ మరియు మునిసిపల్ సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. అరిటాకులు, విస్తరాకులు వాడుతూ పరిశుభ్రత పాటించడం ప్లాస్టిక్ నియంత్రణ లో భాగమైనందున హెూటల్ యజమానులను మరియు హెూటల్ సిబ్బందిని మునిసిపల్ కమీషనర్ అభినందించారు. అదే విధంగా అన్ని హెూటళ్ళ నందు కూడా ప్లాస్టిక్ వాడకుండా ఈ విధానాన్ని అనుసరించాలని ఆయన కోరారు. ప్లాస్టిక్ నిషేధంలో ప్రతి ఒక్కరూ సహకరించాలని ప్లేట్ల నందు మరియు పార్సిల్ చేయడానికి వంటి వాటికి ప్లాస్టిక్ కవర్స్ ఎట్టి పరిస్థితుల్లో వాడరాదన్నారు. కవర్స్ బదులు అందరూ తప్పకుండా విస్తరాకులు గానీ ,అరటి ఆకులు గాని వాడాలన్నారు. శానిటేషన్ సెక్రెటరీ లు మధ్యాహ్నం మరియు రాత్రి పూట తమ పరిధిలోని హెూటళ్ళు తరచుగా తనిఖీలు చేస్తూ ప్లాస్టిక్ వాడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రజలు కూడా హెూటళ్లలో ప్లాస్టిక్ వాడితే దగ్గర లోనీ సచివాలయం నందు పిర్యాదు చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ తో పాటు ప్రజారోగ్య సిబ్బంది. తదితరులు పాల్గొన్నారు.




# పన్నులు వసూళ్లలో అలసత్వం వద్దు ..

**పురపాలక శాఖ ఆర్ డి..**

**బాపట్ల, మార్చి 13 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** బాపట్ల పురపాలక సంఘ కార్యాలయంలో పుర పరిపాలన శాఖ గుంటూరు రీజియన్ ప్రాంతీయ సంచాలకులు యస్.హరికృష్ణ మునిసిపల్ కమిషనర్ జి. రఘునాథ రెడ్డి సంయుక్తంగా సమీక్ష నిర్వహించారు. కమిషనర్ ఛాంబర్ లో ఆస్తి పన్నులు, ఖాళీ స్థలం పన్నులు మరియు నీటి కుళాయి చార్జీల వసూళ్లపై గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో పురపాలక సంఘ సిబ్బంది సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్ డి మాట్లాడుతూ ఆర్థిక సంవత్సరం ముగుస్తున్న నేపథ్యంలో పన్నుల వసూళ్లపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలన్నారు. ఇప్పటివరకు వసూళ్లు చేసిన పురోగతిపై సమీక్ష నిర్వహించారు. ఇంకా వసూళ్లు కావలసిన బకాయిలపై ప్రత్యేక శ్రద్ధ పెట్టి, ప్రత్యేకంగా డ్రైవ్ నిర్వహించాలన్నారు.పన్నుల వసూళ్లలో అలసత్వం వహించిన సిబ్బందిపై చర్యలకు తీసుకుంటామని హెచ్చరించారు. ఆర్థిక సంవత్సరం మార్చి ముగిసేలోపు 100 శాతం పన్నులు వసూలు చేయాలన్నారు. రెవెన్యూ అధికారి, రెవెన్యూ ఇన్స్పెక్టర్లు, పన్నుల వసూళ్ల సిబ్బందితో సమన్వయం చేసుకొని రోజువారి సమీక్ష నిర్వహించి బకాయి దారులు నుండి పన్నులను వసూలు చేసే విధంగా కృషి చేయాలి అన్నారు. బాపట్ల పట్టణ ప్రజలు పన్నులు చెల్లించి పురపాలక సంఘ అభివృద్ధికి తోడ్పాటు అందించాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో రెవెన్యూ అధికారి అబ్దుల్ జబ్బార్, రెవిన్యూ ఇన్స్పెక్టర్లు డి.శివరామకృష్ణ,శ్రీ షేక్ ఇమామ్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఫైలేరియా, నిర్మూలన కార్యక్రమం.

డాక్టర్ ఫణింద్ర బాబు ఆధ్వర్యంలో

( **ప్రజాజ్యోతి న్యూస్**) **టి.నరసాపురం** ఏలూరు జిల్లా టి. నరసాపురం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో గల మండలంలో నాలుగు సచివాలయంలో ఐదు ఫైలేరియా కేసులకు ప్రభుత్వం అందించినటువంటి వాటర్ టబ్, టవల్, సబ్బు ,మరియు ఆయింట్మెంట్, ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఫణీంద్ర బాబు మాట్లాడుతూ ఫైలేరియా బోదకాలు వ్యాధి అనేది క్యూలెక్స్ దోమ కుట్టడం వలన వస్తుంది మురికినీటిలో నివాసం ఉంటుంది. మరియు ఇది రాత్రివేళలో మనిషి నిద్రపోయిన తర్వాత కుట్టడం జరుగుతుంది.

1 మాటిమాటికి జ్వరం రావడం, మొదలైన లక్షణాలు ఉండును లక్షణాలు బయటపడిన వెంటనే సమీప ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ గారిని సంప్రదించాలని ఆయన సూచించారు. బోదకాలు వ్యాధి అనేది కాలుకి గాని చెయ్యకు గాని మొదలైన భాగాలలో వచ్చును అని ఆయన అన్నారు. వ్యాధి తీవ్రత పెరగకుండా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఆయన అన్నారు. ప్రభుత్వం వారు ఇచ్చినటువంటి %ఞ.జు.ఙ%. మాత్రలు 6 నెలలకు ఒకసారి 12 రోజుల కోర్సు రోజుకి మూడు మాత్రల చొప్పున వేసుకోవాలి అని ఆయన అన్నారు.

ఈ మాత్రలతో పాటు ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాలి అని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో చింతలపూడి సబ్ యూనిట్ ఆఫీసర్ ప్రసాద్, మరియు హెల్త్ సూపర్వైజర్లు,%జు%, మావుళ్ళమ్మ, %వీణ:%ూా% బొగ్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



## ఉపాధి పనులకు ఊతం

పనికి తగ్గ వేతనం కల్పించే దిశగా చర్యలు

డుమా పీడీ డి సుధాకర్



**పొందూరు ,(ప్రజా జ్యోతి న్యూస్) :** కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పనుల ద్వారా వేతనదారులు మరింత అవకాశాలు మెరుగు పెరిగేలా చర్యలు చేపడుతున్నారని జిల్లా నీటి యాజమాన్య సంస్థ పథకం డైరెక్టర్ ( డుమా పీడీ ) డి సుధాకర్ అన్నారు. పొందూరు మండల కేంద్రంలో మీడియా సమావేశం లో ఆయన మాట్లాడారు. పనికి తగ్గ వేతనం కల్పిస్తూ ఉపాధిహామీ పనులలో పారదర్శకత వచ్చేలా ప్రత్యేక ప్రణాళికలతో ఉపాధి పనులను రూపొందిస్తున్నట్లు తెలిపారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో ఏర్పాటు చేస్తున్న పల్లె పండుగ పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. జిల్లా కలెక్టర్ ఎప్పటికప్పుడు ఉపాధి హామీ ఉన్నత అధికారులతో ఎప్పటికప్పుడు రివ్యూ సమావేశం ఏర్పాటు చేసి పనుల యొక్క పురోగతిని తెలుసుకుంటున్నారని తెలిపారు. జిల్లాలో ఎక్కడా పనులకు కొరత లేదని , పనులను శరవేగంగా పూర్తి చేయడమే కాకుండా పెండింగ్ లో ఉన్న పేమెంట్స్ క్లియర్ చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రాష్ట్రంలోనే శ్రీకాకుళం జిల్లాలో అధికంగా ఎన్.ఆర్.జి.ఈ.ఎస్ నిధులతో పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. ఉపాధి హామీ వేతనదారుడికి పనికి తగ్గ వేతనం దక్కేలా గరిష్ఠంగా రూ.300 కల్పించేందుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఉపాధి హామీ పనులలో సిబ్బంది రోజువారీ చేసే పనిని ఏ రోజు ఎంత మేర పని చేయాలో కొలతలతో ఇస్తారని ఆవిధంగా పనిచేయగలిగితే గరిష్ఠంగా వేతనం పొందవచ్చునని సూచించారు. ఇందుకోసం వేతన దారులకు అవగాహన కల్పించేందుకు ప్రతీ శుక్రవారం ప్రతీ గ్రామాలలో రోజ్ ఘర్ దివాస్ ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

## ఘనంగా కవియత్రి మొల్లమాంబ జయంతి





**శ్రీకాకుళం ,(ప్రజా జ్యోతి న్యూస్ :** తొలి తెలుగు మహిళా కవియత్రి మొల్లమాంబ జయంతి శ్రీకాకుళం కలెక్టర్ ఆఫీసులో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దిన్ కర్ పుండ్కర్,బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ , సిబ్బంది , కుమ్మరి శాలివాహన సంఘం అధ్యక్షులు కాదుర్ల వీరాస్వామి , సంఘ సభ్యులు రాయల మల్లేష్ ఎన్ సత్యం వి గోవిందరావు వి ఈశ్వరరావు వి సత్యరావు ఎం రామారావు లక్ష్మీనారాయణ , సిహెచ్ సింహాచలం టీచర్ శాలివాహన సంఘ సభ్యులు పాల్గొని కవయిత్రి మొల్ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు . రామాయణాన్ని సరళంగా రచించి శ్రీకృష్ణదేవరాయలు మన్ననలు పొందిన కవయిత్రి మొల్ల జీవితం అందరికీ ఆదర్శమన్నారు. ఈ సందర్భంగా మొల్ల మాంబ జీవిత చరిత్రను చక్కగా అందరికీ తెలియజేశారు.

## ప్రత్తిపాడు లో ముద్రగడ పర్యటన



**ప్రత్తిపాడు మండలం ప్రజా జ్యోతి రిపోర్టర్ వీరబాబు** పెదశంఖర్లపూడి గ్రామానికి చెందిన సీనియర్ వైసీపీ నాయకులు దళే చిట్టిబాబు ను వైసీపీ కో ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. చిట్టిబాబుత్వరగా కోలుకోవాలని పార్టీకి సేవలందించాలన్నారు. గ్రామం లో వైసీపీ నాయకులు కార్యకర్తలు అభిమానులు ను మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.

## జ్యోతి క్షేత్రంలో కూల్చివేతలను పరిశీలించిన కడప ఎంపీ అవినాష్ రెడ్డి



బద్వేల్ మార్చి 13 (ప్రజా జ్యోతి న్యూస్) బద్వేల్ నియోజకవర్గం కాశినాయన మండలం జ్యోతి క్షేత్రంలో కూల్చివేసిన భవనాలను ఈరోజు ఎంపీ అవినాష్ రెడ్డి. ఎమ్మెల్సీ డిసి గోవిందరెడ్డి. ఎమ్మెల్యే డాక్టర్ సుధా. మాజీ ఎమ్మెల్యే మైదుకూరు రఘురామిరెడ్డి. బద్వేల్ నియోజకవర్గం యువ నాయకులు దేవసాని ఆదిత్య రెడ్డి పరిశీలించారు. ఇటీవల జ్యోతి క్షేత్రంలో మహిళల స్నానపుగదులు. క్షురశాల. గోశాల. విశ్రాంతి గదులను అటవీ శాఖ అధికారులు కూల్చివేసిన ప్రదేశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవధూత కాశిరెడ్డి నాయన పరమపదించిన స్థలం ఇదన్నారు. ఇక్కడ పురాతన లక్ష్మీ నరసింహా దేవాలయం ఉందన్నారు. అటవీ శాఖ అధికారులు ఉన్నట్టుండి దీన్ని కూల్చివేశారు. ఇది టైగర్ జోన్ అని రిజర్వు ఫారెస్ట్ కిందకు వస్తాయని ఆశ్రమం లోని కొన్ని కట్టడాలను కూల్చివేయడం దారుణమన్నారు. పేదల ఆకలి తీర్చడానికి దేవాలయాల వద్ద నిత్యాన్నదానాలు సత్రాలు ఏర్పాటు చేసి కాశి నాయన అన్నదానం కొనసాగించారని అన్నారు. ఫారెస్ట్ అధికారులు ఇలాంటివి కూల్చడం బాధాకరమన్నారు. కలెక్టర్ ఆదేశాలతో అటవీ శాఖ. రెవెన్యూ. పోలీస్ అధికారులు కూల్చివేస్తుంటే ప్రభుత్వానికి తెలియదు అనడం అలా విడ్డూరంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేల్ నియోజకవర్గం లోని నాయకులు కార్యకర్తలు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# గృహ నిర్మాణాలలో లక్ష్యాలను చేరుకోవాలి..

**అధికారుల ఆదేశించిన కలెక్టర్..**

**బాపట్ల, మార్చి 13 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** పక్కా గృహాల నిర్మాణాలలో ప్రభుత్వం లక్ష్యాలను చేరుకోడానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. గృహ నిర్మాణాలపై సంబంధిత శాఖ అధికారులతో గురువారం ఆయన స్థానిక కలెక్టరేట్ లో సమీక్ష నిర్వహించారు. పక్కా గృహాల నిర్మాణ లక్ష్యాలలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.2019 నుండి 2024 మధ్యకాలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు గృహాలు మంజూరై వివిధ దశలో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న వారికి ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందజేస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. గృహాల నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న 1.80 లక్షలు సరిపోక, వారి వద్ద వెసులుబాటు లేక ఆగిపోయిన గృహాలు జిల్లాలో సుమారు 16 వేల 85 ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం మంచి ఉద్దేశంతో బీసీ, ఎస్సీ వర్గాలకు 50 వేలు చొప్పున, ఎస్టి వర్గాలకు 75 వేలు చొప్పున అదనపు ఆర్థిక సహాయం అందజేస్తుందని ఆయన తెలిపారు. ఎస్సీ,బీసీ వర్గాలకు మొత్తంగా 2.30 లక్షలు, ఎస్టి వర్గాలకు 2.55 లక్షలు మంజూరు చేయబడుతుందని ఆయన తెలిపారు. ఎవరికైతే ఇళ్ళు మంజూరు చేయబడ్డాయో ప్రతి మహిళకు సెర్ప్ నుండి లక్ష రూపాయలు రుణం ఇవ్వబడుతుందని అన్నారు. మొత్తంగా ఎస్సీ, బీసీ వర్గాలకు 3.30 లక్షలు, ఎస్టి వర్గాలకు 3.55 లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించే విధంగా మీడియా ద్వారా తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసుకొని వారి సహాయంతో వారి వద్దకు వచ్చే ప్రజలకు అవగాహన కల్పించే అవకాశం ఉంటుందన్నారు. ఎం. ఎస్. ఓలు, సి ఎస్ ఓ లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు సచివాలయ సిబ్బందితో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. మండల స్థాయిలో రాజకీయ నాయకులను సంప్రదించి సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది జి ఎస్ డబ్ల్యూ ఎస్ వారీగా 16 వేల 85 మంది లబ్ధిదారుల గృహాలకు వెళ్లి వారితో సంప్రదించి వారి గృహాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అదనపు ఆర్థిక సహాయం గురించి వారికి తెలిపి వారిలో చైతన్యం తీసుకు వచ్చి, గృహాల నిర్మాణం పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. పీఎం ఏవై 1.0 పథకం కింద గృహాల నిర్మాణానికి ఎంపికై అసంపూర్ణ నిర్మాణంలో ఉన్న ఎస్సీ,ఎస్టీ, బిసి వర్గాల లబ్ధిదారుల వివరాలను జి ఎస్ డబ్ల్యూ ఎస్ వారి డేటా ఆధారంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్ల పోర్టల్ లో పెట్టడం జరిగిందన్నారు. జి ఎస్ డబ్ల్యూ ఎస్ డేటాలో లేని కొన్ని పేర్లను ప్రత్యేకంగా లబ్ధిదారులను కలిసి వారి కుల ధ్రువీకరణ ఆధారంగా అప్లోడ్ చేయాలన్నారు. అప్లోడ్ చేసినట్లయితే జి ఎస్ డబ్ల్యూ డేటాలో వారి వివరాలను సర్దుబాటు చేయడం జరుగుతుందన్నారు. దీనికోసం ప్రభుత్వం ఒక యాప్ ను ఏర్పాటు చేయడమైనదని ఆయన అన్నారు. ప్రతి సచివాలయ సిబ్బంది ఆయా లబ్ధిదారుని ఇంటి వద్దకు వెళ్లి వారిని ఫోటో తీయాలన్నారు. ఆ లబ్ధిదారులతో రెండు ప్రశ్నలకు సమాధానాలు అడగాలని అన్నారు. ప్రభుత్వం అందించే అదనపు ఆర్థిక సహాయం తో గృహాలు కట్టుకుంటారా లేదా అని అడగాలన్నారు. అందుకు లబ్ధిదారులు అవును అంటే వారికి అదనపు నిధులు మంజూరు అవుతాయని అన్నారు. లేదు అంటే వారికి అదరపు నిధులు మంజూరు కావని తెలిపారు. ఇందులో సవరణ ఎంపిక కూడా ఉందని తెలిపారు. ఈ సర్వే ఈనెల 15వ తేదీ నుండి చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతి ఇంజనీరింగ్ అసిస్టెంట్ గాని సచివాలయ సిబ్బంది గాని యాప్ ద్వారా ఫోటోలు తీయాలన్నారు. గృహాల నిర్మాణంలో పునాది, లెంటల్, రూఫ్, స్లాబ్ లెవెల్, ప్రతి లెవెల్ లో ఒక్కొక్క అధికారికి బాధ్యతలు అప్పగించబడ్డాయని ఆయన అన్నారు. మొత్తంగా, పిడి హౌసింగ్ ను పర్యవేక్షణ అధికారిగా నియమించారని ఆయన అన్నారు. లబ్ధిదారులు అదనపు నిధుల మంజూరులో ఎంపిక అయినట్లయితే ఆ లబ్ధిదారుని ఇంటి పురోగతి ఆయా అధికారుల పై ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి ఆ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. 10 డిసెంబర్ 24న పూర్తయిన గృహాలకు నగదు చెల్లింపు చేసినట్లు చెప్పారు. పూర్తయిన గృహాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. ఆ గృహాలకు లోపల బయట ప్లాస్టింగ్, ఫ్లోరింగ్, కిటికీలు, తలుపులు ఉన్నట్లయితే వారిని కూడా ఫోటోలు తీసి యాప్ లో అప్లోడ్ చేయాలన్నారు. వారికి కూడా ప్రభుత్వ అదనపు ఆర్థిక సహాయం మంజూరు చేస్తున్నట్లు చెప్పారు.ప్రభుత్వం మే 2025 నాటికి 8 వేల 299 ఇళ్ళను పూర్తి చేసేందుకు జిల్లాకు లక్ష్యంగా ఇచ్చారని జిల్లా కలెక్టర్ తెలిపారు. ఈ లక్ష్యాలను గడువు నాటికి పూర్తి చేసేందుకు ఎం.ఎస్.ఓ లు, ఎంపీడీవోలు, ఏఈలు, డి ఇ లు, ప్రత్యక్షత శ్రద్ధ వహించి కెపిఐ లో వృద్ధి సాధించాలని అన్నారు. పీఎం ఏ వై 2.0 కింద బాపట్ల జిల్లా యు డి ఎ లో ఉన్నందున కొత్తగా నిర్మించుకునే ఇండ్లకు 2.50 లక్షలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆయన అన్నారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని ప్రజలకు టామ్ టామ్ ల ద్వారా, సమావేశాల ద్వారా ప్రచారం చేసి వారు ఇండ్ల కొరకు దరఖాస్తు చేసుకునే విధంగా కృషి చేయాలని ఎంపీడీవోలకు ఆయన సూచించారు.జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గృహ నిర్మాణాలలో పని దినాలు కల్పించాలన్నారు. నిర్దేశించిన మాదిరిగా 90 పని దినాలు చూపి లబ్ధిదారులకు కూలి సొమ్ము చెల్లించాలన్నారు. గృహ నిర్మాణాల పర్యవేక్షణ పై నోడల్ అధికారిగా జిల్లా సంయుక్త కలెక్టర్ ను నియమించినట్లు కలెక్టర్ తెలిపారు. ఎమ్. ఎస్ ఓ లు, ఎంపీడీవోలు, పిడి హౌసింగ్ అందరూ క్షేత్రస్థాయిలో వెళ్లి పర్యవేక్షించాలన్నారు. వారంలో ఒకరోజు సంయుక్త కలెక్టర్ సమీక్ష నిర్వహిస్తారని అయన అన్నారు. సంయుక్త కలెక్టర్ పర్యవేక్షణలో ఎవరైనా లక్ష్యాలను పూర్తి చేయుటలో అలసత్వం వహించిన వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని అధికారులను ఆయన హెచ్చరించారు.

సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ ప్రఖర్ జైన్, జిల్లా గృహ నిర్మాణ శాఖ అధికారి వెంకటేశ్వర్లు, ఈఇలు, డిఈలు, ఏఈ లు తదితరులు పాల్గొన్నారు

# గృహ నిర్మాణాలలో లక్ష్యాలను చేరుకోవాలి..

**అధికారుల ఆదేశించిన కలెక్టర్..**

**బాపట్ల, మార్చి 13 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** పక్కా గృహాల నిర్మాణాలలో ప్రభుత్వం లక్ష్యాలను చేరుకోడానికి అధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జె.వెంకట మురళి తెలిపారు. గృహ నిర్మాణాలపై సంబంధిత శాఖ అధికారులతో గురువారం ఆయన స్థానిక కలెక్టరేట్ లో సమీక్ష నిర్వహించారు. పక్కా గృహాల నిర్మాణ లక్ష్యాలలో పెండింగ్ పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు.2019 నుండి 2024 మధ్యకాలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు గృహాలు మంజూరై వివిధ దశలో అసంపూర్తిగా నిర్మాణంలో ఉన్న వారికి ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందజేస్తుందని జిల్లా కలెక్టర్ తెలిపారు. గృహాల నిర్మాణానికి ప్రభుత్వం అందిస్తున్న 1.80 లక్షలు సరిపోక, వారి వద్ద వెసులుబాటు లేక ఆగిపోయిన గృహాలు జిల్లాలో సుమారు 16 వేల 85 ఉన్నాయని ఆయన తెలిపారు. ప్రభుత్వం మంచి ఉద్దేశంతో బీసీ, ఎస్సీ వర్గాలకు 50 వేలు చొప్పున, ఎస్టి వర్గాలకు 75 వేలు చొప్పున అదనపు ఆర్థిక సహాయం అందజేస్తుందని ఆయన తెలిపారు. ఎస్సీ,బీసీ వర్గాలకు మొత్తంగా 2.30 లక్షలు, ఎస్టి వర్గాలకు 2.55 లక్షలు మంజూరు చేయబడుతుందని ఆయన తెలిపారు. ఎవరికైతే ఇళ్ళు మంజూరు చేయబడ్డాయో ప్రతి మహిళకు సెర్ప్ నుండి లక్ష రూపాయలు రుణం ఇవ్వబడుతుందని అన్నారు. మొత్తంగా ఎస్సీ, బీసీ వర్గాలకు 3.30 లక్షలు, ఎస్టి వర్గాలకు 3.55 లక్షలు మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి ఒక్కరికి అవగాహన కల్పించే విధంగా మీడియా ద్వారా తెలియజేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులతో సమావేశాలు ఏర్పాటు చేసుకొని వారి సహాయంతో వారి వద్దకు వచ్చే ప్రజలకు అవగాహన కల్పించే అవకాశం ఉంటుందన్నారు. ఎం. ఎస్. ఓలు, సి ఎస్ ఓ లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు సచివాలయ సిబ్బందితో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. మండల స్థాయిలో రాజకీయ నాయకులను సంప్రదించి సమావేశాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. సచివాలయ సిబ్బంది జి ఎస్ డబ్ల్యూ ఎస్ వారీగా 16 వేల 85 మంది లబ్ధిదారుల గృహాలకు వెళ్లి వారితో సంప్రదించి వారి గృహాలు ఏ స్థాయిలో ఉన్నాయో తెలుసుకోవాలన్నారు. ప్రభుత్వం అందిస్తున్న అదనపు ఆర్థిక సహాయం గురించి వారికి తెలిపి వారిలో చైతన్యం తీసుకు వచ్చి, గృహాల నిర్మాణం పూర్తయ్యే విధంగా చూడాలన్నారు. పీఎం ఏవై 1.0 పథకం కింద గృహాల నిర్మాణానికి ఎంపికై



అసంపూర్ణ నిర్మాణంలో ఉన్న ఎస్సీ,ఎస్టీ, బిసి వర్గాల లబ్ధిదారుల వివరాలను జి ఎస్ డబ్ల్యూ ఎస్ వారి డేటా ఆధారంగా ఇంజనీరింగ్ అసిస్టెంట్ల పోర్టల్ లో పెట్టడం జరిగిందన్నారు. జి ఎస్ డబ్ల్యూ ఎస్ డేటాలో లేని కొన్ని పేర్లను ప్రత్యేకంగా లబ్ధిదారులను కలిసి వారి కుల ధ్రువీకరణ ఆధారంగా అప్లోడ్ చేయాలన్నారు. అప్లోడ్ చేసినట్లయితే జి ఎస్ డబ్ల్యూ డేటాలో వారి వివరాలను సర్దుబాటు చేయడం జరుగుతుందన్నారు. దీనికోసం ప్రభుత్వం ఒక యాప్ ను ఏర్పాటు చేయడమైనదని ఆయన అన్నారు. ప్రతి సచివాలయ సిబ్బంది ఆయా లబ్ధిదారుని ఇంటి వద్దకు వెళ్లి వారిని ఫోటో తీయాలన్నారు. ఆ లబ్ధిదారులతో రెండు ప్రశ్నలకు సమాధానాలు అడగాలని అన్నారు. ప్రభుత్వం అందించే అదనపు ఆర్థిక సహాయం తో గృహాలు కట్టుకుంటారా లేదా అని అడగాలన్నారు. అందుకు లబ్ధిదారులు అవును అంటే వారికి అదనపు నిధులు మంజూరు అవుతాయని అన్నారు. లేదు అంటే వారికి అదరపు నిధులు మంజూరు కావని తెలిపారు. ఇందులో సవరణ ఎంపిక కూడా ఉందని తెలిపారు. ఈ సర్వే ఈనెల 15వ తేదీ నుండి చేపట్టడం జరుగుతుందన్నారు. ప్రతి ఇంజనీరింగ్ అసిస్టెంట్ గాని సచివాలయ సిబ్బంది గాని యాప్ ద్వారా ఫోటోలు తీయాలన్నారు. గృహాల నిర్మాణంలో పునాది, లెంటల్, రూఫ్, స్లాబ్ లెవెల్, ప్రతి లెవెల్ లో ఒక్కొక్క అధికారికి బాధ్యతలు అప్పగించబడ్డాయని ఆయన అన్నారు. మొత్తంగా, పిడి హౌసింగ్ ను పర్యవేక్షణ అధికారిగా నియమించారని ఆయన అన్నారు. లబ్ధిదారులు అదనపు నిధుల మంజూరులో ఎంపిక అయినట్లయితే ఆ లబ్ధిదారుని ఇంటి పురోగతి ఆయా అధికారుల పై ఉంటుందన్నారు. క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి ఆ లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. 10 డిసెంబర్ 24న పూర్తయిన గృహాలకు నగదు చెల్లింపు చేసినట్లు చెప్పారు. పూర్తయిన గృహాలను క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలన్నారు. ఆ గృహాలకు లోపల బయట ప్లాస్టింగ్, ఫ్లోరింగ్, కిటికీలు, తలుపులు ఉన్నట్లయితే వారిని కూడా ఫోటోలు తీసి యాప్ లో అప్లోడ్ చేయాలన్నారు. వారికి కూడా ప్రభుత్వ అదనపు ఆర్థిక సహాయం మంజూరు చేస్తున్నట్లు చెప్పారు.ప్రభుత్వం మే 2025 నాటికి 8 వేల 299 ఇళ్ళను పూర్తి చేసేందుకు జిల్లాకు లక్ష్యంగా ఇచ్చారని జిల్లా కలెక్టర్ తెలిపారు.

## కనిపించకుండా పెరిగిన లిక్కర్ ధరలు

**నెల్లూరు :** ఏపీలో మద్యం ధరల్లో మతలబు జనాలకు తెలిసొచ్చింది. కొద్ది రోజుల క్రితం మద్యం విక్రయాల్లో కమిషన్ చెల్లింపు కోసం బాటిల్‌పై రూ.10 అదనంగా వసూలు చేసేందుకు ఎక్సైజ్ శాఖ అనుమతించింది. మద్యం ధరల పెంపుపై విమర్శలు రావడంతో ప్రభుత్వం కూడా స్పందించింది. మద్యం బాటిళ్ల గరిష్ట ధరలపై అప్పట్లో ఎక్సైజ్ కమిషనర్ నిశాంత్‌కుమార్ ప్రకటన కూడా చేశారు. కేవలం రూ.10 మాత్రమే పెరిగినట్టు చెప్పారు. ప్రస్తుతం మద్యం దుకాణాల్లో మాత్రం బాటిల్ పరిమాణం బట్టి అదనపు ధరలు వసూలు చేస్తున్నారు.మద్యం ధరల పెంపుపై ఎక్సైజ్ కమిషనర్ ధర పెరుగుదల కేవలం రూ.10 మాత్రమేనని వివరణ కూడా ఇచ్చారు. బ్రాండ్ లేదా పరిమాణంతో సంబంధం లేదని చెప్పారు. మద్యం క్వార్టర్/హాఫ్/ఫుల్ బాటిల్ అనేదానితో సంబంధం లేకుండా, అన్ని బాటిళ్లపై రూ.10 మాత్రమే పెరిగిందని చెప్పారు.మద్యం ధర రూ. 15, రూ 20 పెరిగిందనేది అవాస్తవమని, అపోహలకు గురి కావొద్దని అప్పట్లో విజ్ఞప్తి చేశారు. మద్యం ధరల వివరాలను అన్ని షాపుల్లో ప్రదర్శించాలని దుకాణదారులకు ఆదేశాలు జారీ చేయనున్నట్లు ప్రకటించారు.కమిషనర్ ప్రకటనకు ప్రస్తుతం వసూలు చేస్తున్న మద్యం ధరలకు పొంతన లేదని క్లారిటీ వచ్చేసింది. ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాది అక్టోబర్ 16 నుంచి ప్రైవేట్ మద్యం దుకాణాలు మొదలయ్యాయి. అదే సమయంలో రెండు పాపులర్ బ్రాండ్ల మద్యం ధరల్ని రూ.40 వరకు తగ్గించారు. ప్రముఖ సినీ నటుడు బ్రాండింగ్ చేస్తున్న బ్రాందీతో పాటు మరో రెండు రకాల విస్కీ ధరల్ని గణనీయంగా తగ్గించారు. రూ.220 క్వార్టర్ బ్రాందీ ధరను రూ. 180కు తగ్గించారు. మరో ప్రముఖ బ్రాండ్ విస్కీ ధరను కూడా తగ్గించారు. గత ఐదేళ్లలో పాపులర్ బ్రాండ్ల మద్యం కొరత ఏపీలో తీవ్రంగా ఉండేది. ఈ క్రమంలో ప్రైవేట్ మద్యం దుకాణాల్లో అన్ని బ్రాండ్లను అందుబాటులోకి తెస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది.ఏపీలో మద్యం ధరల్ని తగ్గిస్తామని, నాణ్యమైన మద్యాన్ని అందుబాటులోకి తెస్తామని ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు విస్తృతంగా ప్రచారం చేశాయి. రాష్ట్రంలో నాసిరకం మద్యం విక్రయిస్తున్నారని, ధరల్ని అదుపు చేస్తామని విస్తృత ప్రచారం చేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత రెండు మూడు పాపులర్ బ్రాండ్ల ధరలు మాత్రమే కాస్త తగ్గాయి. 2019 మే నాటికి ఉన్న ధరలతో పోలిస్తే ప్రస్తుతం మద్యం ధరలు దాదాపుగా రెట్టింపు అయ్యాయి. దాదాపు రూ.30వేల కోట్ల ఆదాయం ప్రభుత్వానికి మద్యం ద్వారా లభిస్తోంది. ఈ క్రమంలో మద్యం ద్వారా వచ్చే ఆదాయాన్ని కోల్పోతామనే ఉద్దేశంతో ధరలు తగ్గించడానికి ప్రభుత్వం సాహసించలేదు.గత ఐదేళ్లలో మద్యం వ్యాపారం నేరుగా ప్రభుత్వమే నిర్వహించింది. దీంతో కమిషన్లు చెల్లించాల్సిన అవసరం లేకుండా పోయింది. కూటమి ప్రభుత్వం మద్యం విక్రయాలను ప్రైవేట్ వ్యాపారులకు అప్పగించడంతో వారికి కమిషన్ చెల్లించాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ప్రభుత్వం ఇస్తానన్న కమిషన్‌కు చెల్లిస్తున్న దానికి పొంతన లేక పోవడంతో వ్యాపారులు ఆందోళన బాట పట్టారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా మద్యం ధరల్ని పెంచారు.క్వార్టర్ బాటిల్ ధర రూ.10 పెంచినట్టు చెప్పినా, ప్రస్తుతం ప్రతి క్వార్టర్‌కు అదనంగా రూ.10వసూలు చేస్తున్నారు. హాఫ్ బాటిల్‌కు రూ.20, ఫుల్ బాటిల్ ధరపై రూ.40 చొప్పున కొత్త ధరల్ని ముద్రించి విక్రయిస్తున్నారు. ప్రస్తుతం ఏపీలో బీరు, రూ 99 మద్యం సీసాలపై ఎటువంటి పెంచలేదు2023-24లో దాదాపు రూ.36వేల కోట్ల రుపాయలు ప్రభుత్వానికి ఆదాయంగా లభించింది

## సీసీ కెమెరాలు వితరణ..



**కాకినాడ, మార్చి 13 (ప్రజా జ్యోతి ప్రతినిధి)** ప్రముఖ పారిశ్రామికవేత్త నారాయణం మురళి 1,20,000 విలువైన సీసీ కెమెరా లను కాకినాడ జిల్లా పోలీస్ శాఖకు అందజేసిన సందర్భంగా కాకినాడ జిల్లా ఎస్పీ జి.బిందు మాధవ్ కృతజ్ఞతలు తెలిపారు. సర్పవరం పోలీస్ స్టేషన్ పరిధిలో సూర్యారావు పేటకు చెందిన ఎన్సి ఎస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ నారాయణం మురళి 1,20,000 విలువైన సీసీ కెమెరాలు మరియు ఇతర సాంకేతిక పరికరాలను ఎస్ డి పిఓ కాకినాడ ఏ ఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, సర్పవరం సీఐ బి పెద్దిరాజు సమక్షంలో జిల్లా ఎస్పీకి గురువారం అందజేశారు. కార్యక్రమంలో సర్పవరం సీఐ పెద్దిరాజు, ఎంసీ ఎస్ ఇండస్ట్రీస్ ప్రైవేట్ లిమిటెడ్ ఈడి ఎన్. శిషిర్, హెచ్ ఆర్ పి ఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

## సామాన్యులను ఆకట్టుకునే విధంగా మొల్ల రామాయ రచన..

జిల్లా కలెక్టర్ వెంకట మురళి..

కవియత్రి మొల్ల కు ఘన నివాళి..



**బాపట్ల, మార్చి 13 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)** సామాన్య ప్రజలను ఆకట్టుకునే విధంగా మొల్ల రామాయ ణాన్ని రచించారని జిల్లా కలెక్టర్ జె. వెంకట మురళి అన్నారు. గురువారం స్థానిక కలెక్టరేట్ లో కవియిత్రి ఆతుకూరి మొల్లమాంభ జయంతిని పురస్కరించుకొని ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి కలెక్టర్ ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మొల్లమాంభ కడప జిల్లా బద్వేలు గ్రామంలో జన్మించారని ఆయన అన్నారు. మొల్ల అంటే జాస్మిన్ అని అర్థమని ఇది దేవునికి ఇష్టమైన పువ్వని ఆయన అన్నారు. కవిత్రి ఆతుకూరి మొల్లమాంబ రచించిన మొల్ల రామాయణం ఎంతో సరళంగా ఉంటుందని ఆయన అన్నారు. మొల్ల రామాయణం లో చాలా సరళమైన తెలుగు పదాలను ఉపయోగించి సంస్కృత పదాలను తక్కువగా వినియోగించారన్నారు. మల్ల కవిత్వం నాలుకపై తేనెలా ఉంటుందని తేనె నాలుకకు తగిలిన వెంటనే అనుభూతి చెందినట్లుగానే ఉంటుందని ఆయన అన్నారు. మొల్ల శ్రీనాథ మరియు విజయనగర సామ్రాజ్యం లోని కవులకు సమకాలి కురాలుగా నిలి చారన్నారు. స్వేచ్ఛ సమానత్వం లేని రోజుల్లో బాగా చదువుకొని మల్ల రామాయణాన్ని రచించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి.జి గంగాధర్ గౌడ్, జిల్లా వెనుకబడిన వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి శివలీల, జిల్లా పౌర సంబంధాల అధికారి మోహన్ రాజు తదితరులు పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ ను పూర్తిగా నిషేధించాలి..

జిల్లా కలెక్టర్ వెంకట మురళి..

ప్లాస్టిక్ విక్రయాలను అరికట్టాలి.. కలెక్టర్ ఆదేశాలు..

**బాపట్ల, మార్చి 13 (ప్రజా జ్యోతి జిల్లా స్టాఫ్ రిపోర్టర్)**



స్వచ్ఛాంధ్ర కార్యక్రమంతో పర్యావరణాన్ని పచ్చదనంతో పరిశుభ్రంగా ఉంచాలని జిల్లా కలెక్టర్ జె వెంకట మురళి తెలిపారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహణపై జిల్లా అధికారులు, మండల ప్రత్యేక అధికారులతో గురువారం స్థానిక కలెక్టరేట్ లో ఆయన సమావేశం నిర్వహించారు. పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ ఉద్గారాలను పూర్తిగా నిషేధించాలని కలెక్టర్ చెప్పారు. ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేదించాలని, విక్రయాలను సైతం అరికట్టాలన్నారు. భూమిలో కుళ్లిపోయే పదార్థాలను మాత్రమే వినియోగించాలని కలెక్టర్ చెప్పారు. స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ప్రతినెల మూడవ శనివారం ఒక అంశాన్ని ప్రామాణికంగా తీసుకుని పెద్ద ఎత్తున కార్యక్రమాన్ని నిర్వహిస్తుందన్నారు. కాలుష్యంతో దెబ్బతింటున్న పర్యావరణాన్ని పరిరక్షించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయన్నారు. ఈనెల 15వ తేదీన జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. ప్రజల భాగస్వామ్యంతో పెద్ద ఎత్తున కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. దీనికోసం కలెక్టరేట్లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ కార్యాలయంలో స్వచ్ఛత కార్యక్రమం నిర్వహించాలని ఆదేశించారు. జిల్లాలోని అన్ని కళాశాలలు, పాఠశాలలు, ప్రభుత్వ వసతి గృహాలు, పరిశ్రమలు, ఆర్టీసీ బస్టాండ్, కూరగాయలు మార్కెట్, మార్కెట్ యార్డు, రైతు బజార్లు, దేవాలయాలు, పర్యాటక ప్రాంతాలు, ప్రజలు అధికంగా సంచరించే ప్రాంతాలు, ప్రధాన కూడళ్లలో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. స్వచ్ఛాంధ్ర జిల్లాస్థాయి కార్యక్రమం సూర్యలంక బీచ్ వద్ద శనివారం ఉదయం జరుగుతుందని కలెక్టర్ చెప్పారు. ప్రజలలో విస్తృతమైన ప్రచారం చేయలన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాల ద్వారా పర్యావరణాన్నికి, ప్రజలకు కలిగే మేలుపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి గ్రామంలో తాగునీటి చెరువులన్నీ ఈ కార్యక్రమంతో పరిశుభ్రపరచాలన్నారు. పర్యావరణానికి హాని లేని వస్తువులను మాత్రమే ప్రజలు వినియోగించేలా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. భూమిలో కలిసిపోయే పదార్థాలకు మాత్రమే ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఆయా శాఖల అధికారులు చేపట్టే ఈ కార్యక్రమాలను ఆన్ లైన్ లో పొందుపరచాలన్నారు. వారు నిర్వహించే కార్యక్రమాలకు ఫోటోలు తీసి స్వచ్ఛాంధ్ర వెబ్ సైట్ లో నిక్షిప్తం చేయాలన్నారు. ఈ కార్యక్రమాలపై రాష్ట్రస్థాయిలోనూ పర్యవేక్షణ ఉంటుందని వివరించారు. సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్, సీపీఓ కె శ్రీనివాసరావు, జిల్లా అధికారులు, ఎంపిడిఓ లు, తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి



**కోరుట్ల :** కోరుట్ల,మెట్ పెల్లి పట్టణంలో మార్చి 31 లోపు ఎల్ ఆర్ ఎస్ ఫీజు వసూలు పూర్తి చేయడానికి పటిష్ట కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని జిల్లా కలెక్టర్ బి.సత్య ప్రసాద్ ఆదేశించారు.గురువారం కోరుట్ల పట్టణంలో అత్యధికంగా ఇంటి పన్ను బకాయిలు ఉన్న షాపింగ్ మాల్ లను కలెక్టర్ సందర్శించారు, రెండు రోజులలో బకాయిలు కట్టకుంటే సీజ్ చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు .ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటి వరకు కోరుట్ల పట్టణంలో 80 శాతం ఇంటి పన్ను వసూలు అయిందన్నారు .సెప్టెంబర్ 31 వరకు ఉన్న గడువులో 100 శాతం ఇంటి పన్ను వసూలు చేయడానికి ప్రణాళిక రూపొందించినట్లు తెలిపారు.గడువు లోపల అందరూ ఇంటి పన్ను బకాయిలు చెల్లించాలని, లేదంటే వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం అని తెలిపారు.ఈనెల 31 వరకు 25 శాతం రాయితీ ఉపయోగించుకొని అందరూ ఎల్ ఆర్ ఎస్ రుసుము చెల్లించి రెగ్యులర్ చేసుకుంటారో వారికి సర్టిఫికెట్స్ జారీ చేయడం జరుగుతుందని తెలిపారు. అధికారులు లక్ష్యాలను నిర్దేశించి ప్రతి ఒక్క దరఖాస్తుదారుడికి ఫోన్ చేసి తప్పనిసరిగా మార్చి 31 లోపు ఫీజు చెల్లించేలా పటిష్ట కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని కలెక్టర్ అధికారులు ఆదేశించారు. పట్టణంలో 46 మంది ఎల్ ఆర్ ఎస్ దరఖాస్తులను నిబంధనల ప్రకారం ఆమోదించబడిందని, మిగిలిన వారిని కూడా ఫాలో అప్‌లోడ్ చేస్తూ మార్చి 31 లోగా ఫీజు చెల్లించేలా చూడాలని కలెక్టర్ తెలిపారు.అత్యధిక బకాయిలు ఉన్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. వారికి నోటీసులు జారీ చేయడం, ఇంకా చెల్లించని వారి ఆస్తులను పురపాలక సంఘ చట్టం ? 2019 ప్రకారం సీజ్ చేయడం వంటి చర్యలు స్పష్టంగా తెలియజేసారు. అభివృద్ధి ప్రజల సహకారంతోనే సాధ్యమని, అందరూ ఆస్తి పన్నులు మరియు ఇతర మున్సిపల్ పన్నులను సకాలంలో చెల్లించాలని విజ్ఞప్తి చేశారు.100 శాతం పన్ను వసూలు చేయడంపై ప్రత్యేక దృష్టి సారించాలని మున్సిపల్ కమిషనర్, బిల్ కలెక్టర్లు, వార్డు అధికారులకు సూచించారు.అనంతరం కోరుట్ల పట్టణంలోని అర్బన్ ప్రైమరీ యూపీహెచ్‌ఎస్సీ, హెల్త్ సబ్ సెంటర్ పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. నిర్మాణ పనుల త్వరితగతిన పూర్తి చేయాల్సిన పనుల నిర్వహణనుకలెక్టర్ పర్యవేక్షించారు.అలాగే మెట్ పల్లి పట్టణ శివారులో నూతనంగా నిర్మించనున్న హెల్త్ సబ్ సెంటర్ స్థలం సేకరణ పనులను ఆర్వో శ్రీనివాస్ తో కలిసి పరిశీలించారు. ప్రజలకు అనుగుణంగా ఉండే స్థలంలో నిర్మాణం చేపట్టాలని అధికారులకు.కలెక్టర్ వెంట, ఆర్డీవోలు, జివాకర్ రెడ్డి శ్రీనివాస్ మున్సిపల్ కమిషనర్లు, రామకృష్ణ మోహన్, రెవిన్యూ అధికారులు ఉన్నారు.

# బీజేపీలో పాత చెత్తను బయిట పడేయాలి



**హైదరాబాద్ :** తెలంగాణలో బీజేపీ పని తీరుపై ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. హోలీపై విధించిన ఆంక్షలను తప్పుపట్టిన ఆయన బీజేపీ పని తీరుపై కూడా షాకింగ్ కామెంట్స్ చేశారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి వస్తేనే హిందూ మతం సేఫ్‌గా ఉంటుందని అన్నారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావాలంటే ముందు పార్టీలో మార్పులు జరగాలని సూచించారు రాజాసింగ్. పాత సామాను బయటకు పంపించేస్తేనే బీజేపీ బాగుపడుతుందన్నారు. కేంద్ర అధినాయకత్వం దీనిపై ఆలోచన చేయాలని సూచించారు. రాష్ట్ర నాయకులపై రాజా సింగ్ షాకింగ్ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణలో ఏ ప్రభుత్వం వస్తే వాళ్లతోనే కుమ్మక్కు అవుతున్నారని ఆరోపించారు. వాళ్లతోనే సీక్రెట్ మీటింగ్ పెట్టుకుంటుంటున్నారి విమర్శించారు. ఇలా చేస్తే తెలంగాణలో బీజేపీ ఎప్పుడు అధికారంలోకి వస్తుందని ప్రశ్నించారు. ఇలాంటి వాటిని కేంద్ర నాయకత్వం గమనించాలని రాజా సింగ్ అభిప్రాయపడ్డారు. ఇది నా పార్టీ, నా అయ్య పార్టీ అనేటోళ్లు చాలా మంది ఉన్నారని తెలిపారు. అలాంటి వాళ్లను రిటైర్ చేస్తేనే బీజేపీకి మంచి రోజులు వస్తాయని సూచించారు. ఇది తన ఒక్కడి అభిప్రాయం కాదని... చాలా మంది బీజేపీ సీనియర్ అధికారులు, కార్యకర్తలు మనసులో మాట ఇదేనన్నారు. ఇలాంటి వాటి వల్లే హోలీపై ప్రభుత్వం ఆంక్షలు విధించిందని ఆరోపించారు రాజాసింగ్. హోలీ ఎట్లా జరుపుకోవాలనేది పోలీస్ అధికారులు చెప్తారా అని ప్రశ్నించారు. హిందువులతోని పెట్టుకుంటే కెసిఆర్ పరిస్థితి ఏమైందో ఆలోచన చేయాలని రేవంత్ రెడ్డికి సూచించారు. అలాంటి పరిస్థితి రాకుండా ఉండాలంటే వైఖరి మార్చుకోవాలని హితవు పలికారు

# హోలీ పండుగను ఆనందంగా, సురక్షితంగా జరుపుకోవాలి

**ఎదుటివారికి ఇబ్బంది కలిగించవద్దు,మహిళల పట్ల మర్యాదగా ఉండాలి**



**జగిత్యాల :** హోలీ వేడుకల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అవసరమైన చర్యలు తీసుకున్నామని, మద్యం సేవించి వాహనాలు నడపడం ద్వారా ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని కావున జిల్లా ప్రజలు ప్రశాంత వాతావరణంలో హోలీ వేడుకలు జరుపుకోవాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ సూచించారు. ముఖ్యంగా యువకులు అత్యుత్సాహం ప్రదర్శించరాదని ద్విచక్ర వాహనాలపై ర్యాష్ డ్రైవింగ్ చేయకూడదని, చిన్నపిల్లలకు వాహనాలు ఇవ్వకూడదని మైనర్ డ్రైవింగ్ చేసే వారిని పట్టుకుని వారి తల్లిదండ్రులకు కేసులు నమోదు చేస్తామని ఎస్పీ హెచ్చరించారు. హోలీ రోజున పోలీస్ సిబ్బంది ముమ్మరంగా పెట్రోలింగ్ , డ్రంక్ అండ్ టెస్ట్ లు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. హోలీ వేడుకలు ముగిసిన తరువాత స్నానాల కోసం అదిక నీటి ప్రవాహం, లోతైన నీటిలోకి వెళ్లి ప్రమాదాల బారిన పడవద్దు అని ఎస్పీ సూచించారు. పండుగ వేళ ఇతరులపై బలవంతంగా రంగులు వేయడం,గొడవలు పడినా, అసత్య ప్రచారం చేసినా, ఇతరుల పట్ల అసభ్యంగా ప్రవర్తించిన, మహిళలను వేదింపులకు గురిచేసిన కఠిన చర్యలు తీసుకోవడం తోపాటు కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

# లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



**జగిత్యాల :** గర్భస్థ శిశు లింగ నిర్ధారణ నిషేధిత చట్టం 1994 ప్రకారం లింగ నిర్ధారణ చేసి పుట్టే పసిపాప ఆడపిల్ల నా.. మగ పిల్లవాడా.. అని చెప్పడం చట్టరీత్యా నేరమని మాత శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం జగిత్యాల ఆర్డీవో ఏ మధుసూదన్ తో కలిసి కొత్తగా రిజిస్ట్రేషన్ చేసుకున్నటువంటి, పాత స్కానింగ్ సెంటర్స్ రెన్యువల్ కొరకు దరఖాస్తు చేసుకున్న స్కానింగ్ సెంటర్లను, ఆసుపత్రులను మాతా శిశు సంరక్షణ అధికారి డాక్టర్ ఎం. జైపాల్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన స్కానింగ్ సెంటర్లలో పేషంట్ల సౌలభ్యం కోసం కనీస వసతులు , వెంటిలేషన్ సౌకర్యం ,వెయిటింగ్ హాల్ , నిబంధనల ప్రకారం ఉన్నాయా అని చూశారు.స్కానింగ్ మిషన్స్, డాక్టర్ల అర్హత ధ్రువీకరణ పత్రాలు దరఖాస్తు చేసుకున్న విధంగానే ఉన్నాయా అని సరిపోల్చారు. నిబంధనలకు లోబడి అన్ని సక్రమంగా ఉన్నట్లయితే ఆయా కేంద్రాల దరఖాస్తులను అనుమతి కొరకు సిఫారస్ చేస్తామని ఆర్డీవో మధుసూదన్ తెలిపారు. లింగ నిర్ధారణ చేసేటప్పుడు పేషంట్లకు కనపడే విధంగా ఇక్కడ లింగ నిర్ధారణ చేయబడదు - లింగ నిర్ధారణ చేసినచో కఠిన చర్యలు తీసుకోబడతాయి అను ఫ్లెక్సీ బోర్డులు , ఫోం బోర్డులు ఏర్పాటు చేయవలేనని డాక్టర్ జైపాల్ రెడ్డి తెలిపారు. ఈ నిబంధనలు అతిక్రమించి లింగ నిర్ధారణ చేసినచో జరిమానా విధించబడడమే కాకుండా గర్భిణీ మినహా ప్రోత్సహించిన వారిపై కూడా జరిమానా మరియు మూడు నెలల జైలు శిక్ష కూడా ఉంటుందని, వైద్యుల యొక్క రిజిస్ట్రేషన్ కూడా రద్దుపరిచ బడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్స్ కటుకం భూమేశ్వర్, తరాల శంకర్, హెల్త్ సూపర్వైజర్ ఇండివర శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

## హోలీ పండుగను సురక్షితంగా మరియు బాధ్యతతో జరుపుకుందాం

**కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌస్ ఆలం**



**కరీంనగర్ :** హోలీ పండుగను సురక్షితంగా మరియు బాధ్యతతో జరుపుకోవాలని కరీంనగర్ పోలీసు కమిషనర్ గౌస్ ఆలం ఒక ప్రకటనలో తెలిపారు. హోలీ పండుగ ప్రశాంత వాతావరణంలో జరుపుకునేలా ప్రజలకు కరీంనగర్ కమిషనరేట్ పోలీసులు, పోలీసుశాఖ తరపున కొన్ని సూచనలు జారీ చేసారు.చర్మానికి మరియు పర్యావరణానికి హానికరం కాని సహజ రంగులను ఉపయోగించండి. నీటి బెలూన్లు, గాజు పొడి కలిపిన రంగులు వాడరాదు.ఇతరులపై బలవంతంగా రంగులు వేయకుండా, పరస్పర గౌరవంతో పండుగను జరుపుకుందాం. ఎవరైనా తమ అనుమతి లేకుండా బలవంతంగా రంగులు పూయడం, శారీరక లేదా మానసిక వేధింపులకు గురిచేయడం తీవ్ర నేరంగా పరిగణించబడుతుంది. మద్యం సేవించి వాహనం నడపకండి. మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం ప్రమాదకరం మరియు చట్టవిరుద్ధం. ఈ పండుగ సమయంలో మీ అజాగ్రత్త రెండు కుటుంబాలలో మీ కుటుంబంతో పాటు ఇతరుల కుటుంబంలో కూడా విషాదం నింపవచ్చు.ద్విచక్ర వాహనాలు లేదా ఇతర వాహనాలను సమూహాలుగా తరలించడం, ట్రిపుల్ రైడింగ్ వీధుల్లో అవాంఛిత రీతిలో తిరగడం అనుమతించబడదు. ప్రజాస్థలాల్లో బహిరంగ ప్రదేశాల్లో ఇతరులను ఇబ్బంది పెట్టడం, అసభ్యంగా ప్రవర్తించడం, మద్యం మత్తులో అల్లర్లు చేయడం నిషేధం. మర్యాదగా వ్యవహరించి, ప్రశాంతమైన వాతావరణంలో పండుగను జరుపుకుందాం.హోలీ పండుగ జరుపుకున్న అనంతరం నదులు, చెరువులు, కుంటలు వద్ద స్నానాలకు వెళ్లడం, ఆయా ప్రాంతాల్లో ప్రమాదాలు పొంచివుండి వాటిల్లో స్నానాలను ఆచరించే క్రమంలో ప్రాణాలను సైతం కోల్పోయిన సందర్భాలున్నాయని గుర్తెరిగి వీలైతే వెళ్ళకపోవడమే మంచిదని సూచించారు. ఏదైనా అత్యవసర పరిస్థితిలో పోలీసుశాఖ వారి అత్యవసర ఫోన్ నంబర్ 100 కు డయల్ చేయండి లేదా సమీప పోలీస్ స్టేషన్‌ను సంప్రదించండి.శాంతిభద్రతలకు భంగం కలిగించినా, ప్రజలకు అసౌకర్యం లేదా ప్రమాదం కలిగించే ఏ చర్యైనా తీవ్రంగా పరిగణించబడుతుంది.ఈ హోలీ పండుగ ప్రేమ, ఐక్యత, మరియు సంతోషాన్ని విస్తరించేలా జరుపుకుందాం. ఈ పండుగ మీ జీవితంలో ఆనందం ఐక్యత శాంతి మరియు సమృద్ధిని తెచ్చిపెట్టాలని మనసారా కోరుకుంటున్నామని పోలీస్ కమిషనర్ తెలిపారు.

## వాసవి అట్లాంటిస్ వారి ఆర్ఎంసి ప్లాంట్‌ను వెంటనే మూసి వేయాలి


**హై కోర్టులో ఆదేశాలు జారీ.. హర్షం వ్యక్తం చేసిన ది సిటిజన్స్ కౌన్సిల్**

**హైదరాబాద్ :** వాసవి అట్లాంటిస్ వారి ఆర్.ఎం.సి ప్లాంట్ ను వెంటనే మూసి వేయవలసినదిగా హై కోర్టులో ఆదేశాలు జారీ చేసింది.ప్రజల బాగోగులను దృష్టిలో పెట్టుకొని పదివేల మంది జనాభా ఉన్న రెండు కమ్యూనిటీలలోని ప్రజల అనారోగ్య సమస్యలకు వారు హాస్పిటల్లో పడుతున్న ఇబ్బందులను విని, పసి పిల్లలు వారి తల్లిదండ్రుల ఆవేదనను విని, వయోజన వృద్ధుల క్షేమం కోరి ప్రజల గొంతుకు మద్దతు తెలుపుతూ హై కోర్టు తీర్పు ఇవ్వడం పట్ల ది సిటిజన్స్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు హర్షం వ్యక్తం చేశారు. ది సిటిజన్స్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు అందె లక్ష్మణ్ రావు, హాల్ మార్క్ విసినియా గౌతమ్, మైహోం అవతార్ సుబ్బారెడ్డిలు గౌరవ హై కోర్టులో వేసిన పిటిషన్ నంబర్ 5702/ 2025 ద్వారా గత 3 సంవత్సరాలుగా ఇక్కడి ప్రజలు దుమ్ము దూళి, వాయువు, శబ్ద కాలుష్యంతో నానా తిప్పలు పడుతున్నను, స్థానిక నివాసుల సహకారంతో పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టినను, తలపెట్టిన కృషి గుర్తించనప్పటికి, సంబంధిత అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు స్తబ్దుగా ఉండి తమాషా చూడడం జరిగినను, గౌరవ హై కోర్టులో గత వారం మరియు ఈ వారంలో 2 రోజులు వాదోప వాదాలు విని ఈ తీర్పును వెలువర్చుడం పట్ల జేస్తూ ది సిటిజన్స్ కౌన్సిల్ సభ్యులు సంతోషం వ్యక్త చేశారు. ఇది ఒకరకంగా ప్రజల విజయంగా పేర్కొంటూ ముందు ప్రజల సమస్యలను తీర్చడానికి ది సిటిజన్స్ కౌన్సిల్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

## ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి సస్పెండ్

**హైదరాబాద్ :** అసెంబ్లీలో స్పీకర్ పై బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. ఈ క్రమంలోనే సభ నుంచి ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ సస్పెండ్ చేశారు. ఈ బడ్జెట్ సమావేశాలు ముగిసే వరకు ఆయన సస్పెండ్ కు గురయ్యారు. సస్పెండ్ అయిన అభ్యర్థిని బయటకు పంపాలని స్పీకర్ ఆదేశించారు. జగదీష్ రెడ్డి మాట్లాడిన వీడియోను మంత్రులు పరిశీలించారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి చేసిన వ్యాఖ్యలకు ఆయన క్షమాపణ చెప్పాలని మంత్రి శ్రీధర్‌బాబు, ఇతర మంత్రులు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు. జగదీష్ రెడ్డిని సస్పెండ్ చేయాలని స్పీకర్ కు మంత్రులు ప్రతిపాదించారు. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని సస్పెండ్ చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారుముందుగా బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి స్పీకర్‌ను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సభ అందరిదీ.. సభ్యులందరికీ సమాన అవకాశాలు ఉంటాయని అన్నారు. సభ్యుల అందరి తరపున పెద్ద మనిషిగా స్పీకర్ వ్యవహరించాలని చెప్పారు. ఈ సభ మీ సొంతం కాదని ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి వ్యాఖ్యానించారు. అయితే సభా సంప్రదాయాలకు విరుద్ధంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడారని స్పీకర్ ఆక్షేపించారు.ఈ క్రమంలోనే.. దళిత స్పీకర్ ను ఎమ్మెల్యే జగదీష్ రెడ్డి అవమానించారని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మండిపడుతున్నారు. స్పీకర్ కు కనీసం గౌరవం కూడా ఇవ్వడం లేదని వారు ఫైరయ్యారు. జగదీష్ రెడ్డిపై స్పీకర్ వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికే అసెంబ్లీలో అధికారులు, మార్షల్స్ ను అలెర్ట్ చేశారు. అసెంబ్లీలో లాబీలో భారీగా మార్షల్స్ చేరుకున్నారు.అయితే ఎమ్మెల్యే జగదీష్ రెడ్డిని స్పీకర్ సస్పెండ్ చేయడంతో బీఆర్ఎస్ సభ్యులు సభ నుంచి బయటకు వెళ్లారు. అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యే నిరసన వ్యక్తం చేస్తున్నారు.

## 15 నుంచి ఒంటిపూట బడులు




**హైదరాబాద్ :** తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. రాబోయే రోజుల్లో ఎండల తీవ్రత మరింత ఎక్కువగా ఉండనుంది. ఈ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని.. తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో ఒక్క పూట బడులపై ప్రభుత్వం అధికారిక ఉత్తర్వులు ఇచ్చింది. . 2025 మార్చి 15వ తేదీనుంచి ఒంటిపూట బడులు నిర్వహించనున్నట్లు స్పష్టం చేసింది. ప్రభుత్వ పాఠశాలలతో పాటు ప్రైవేటు, ఎయిడెడ్ ఇతర అన్ని మేనేజ్మెంట్ల పరిధిలోని బడులు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాల వరకు పాఠశాలు ఉంటాయని వెల్లడించింది. 12:30 మధ్యాహ్న భోజనం అందిస్తారని తెలిపింది. లాస్ట్ వర్కింగ్ డే ఏప్రిల్ 23 వరకూ హాఫ్ డే స్కూల్స్ కొనసాగనున్నాయి. అయితే.. 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు కొనసాగే పాఠశాలల్లో మాత్రం మధ్యాహ్నం ఒంటిగంట నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు నిర్వహించాలని ఉత్తర్వుల్లో సూచించారు.సెలవుల కోసం విద్యార్థులు ఉత్సాహంగా ఎదురు చూస్తున్నారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం.. ఏప్రిల్ 24 నుంచి సెలవులు ప్రకటించి.. తిరిగి జూన్ 12 నుంచి తరగతులు ప్రారంభం కానున్నట్లు సమాచారం.

# టూత్ బ్రష్ విషయంలో ఈ తప్పులు చేయకండి!



టూత్ బ్రష్ ప్రతి ఒక్కరి దంతాల శుభ్రతలో కీలకమైన పాత్ర పోషిస్తుంది. కానీ దీన్ని ఉపయోగించిన తర్వాత తగిన జాగ్రత్తలు తీసుకోకపోతే అనేక ఆరోగ్య సమస్యలు రావచ్చు. ముఖ్యంగా టూత్ బ్రష్‌ను బాత్రూంలో ఉంచడం వల్ల ఇది హానికరమైన క్రిములతో నిండిపోతుంది. టూత్ బ్రష్‌ను ఎలా ఉపయోగించాలి..? దాన్ని ఎలా శుభ్రం చేయాలి..? ఇవన్నీ తెలుసుకుంటే అనారోగ్య సమస్యలను దూరంగా ఉంచుకోవచ్చు. చాలా మంది టూత్ బ్రష్‌ను బ్రష్ చేసిన తర్వాత బాత్రూంలోనే ఉంచేస్తుంటారు. కానీ అక్కడ తేమ అధికంగా ఉండటం వల్ల బ్యాక్టీరియా, ఫంగస్, ఇతర సూక్ష్మజీవులు పెరిగే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. బాత్రూంలో గాలిచలనం తక్కువగా ఉండడం కూడా దీనిని మరింత ప్రమాదకరంగా మారుస్తుంది. ఇలా కలుషితమైన టూత్ బ్రష్‌ను ఉపయోగించడం వల్ల నోటిలో హానికరమైన క్రిములు చేరి పలు ఇన్ఫెక్షన్లకు కారణమవుతుంది. దంత వైద్యుల సూచనల ప్రకారం టూత్ బ్రష్‌ను సరైన రీతిలో శుభ్రం చేయకపోతే నోటిలో క్రిములు పెరిగే అవకాశాలు అధికంగా ఉంటాయి. టూత్ బ్రష్‌ను ఎక్కువ రోజులు వాడటం కూడా దంతాల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం చూపుతుంది. ఒక టూత్ బ్రష్‌ను 3-4 నెలలకు మించకుండా మార్చాలి. అలాగే దీన్ని తేమలేని ప్రదేశంలో, గాలిచలనం ఉండే విధంగా ఉంచాలి. ఒకే టూత్ బ్రష్‌ను ఎక్కువ రోజుల పాటు ఉపయోగించడం వల్ల నోటిలో హానికరమైన బ్యాక్టీరియా పెరిగే అవకాశం ఉంటుంది. ఇది గమ్ ఇన్ఫెక్షన్, దంతక్షయం, దుర్వాసన వంటి సమస్యలకు దారి తీస్తుంది. నోటికి సంబంధించిన ఇన్ఫెక్షన్లు బ్లడ్‌స్ట్రీమ్‌లోకి వెళ్లి ఇతర ఆరోగ్య సమస్యలను కూడా కలిగించవచ్చు. టూత్ బ్రష్‌ను శుభ్రంగా ఉంచడానికి కొన్ని ముఖ్యమైన జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి రోజూ టూత్ బ్రష్‌ను బాగా నీటితో శుభ్రం చేసి గాలికి ఆరనివ్వాలి. అలాగే టూత్ బ్రష్‌ను గాలి చొరబడే ప్రదేశంలో ఉంచాలి. బ్రష్‌ను ఇతర కుటుంబ సభ్యుల టూత్ బ్రష్‌లకు దగ్గరగా పెట్టకుండా చూడాలి. ప్రతి 3-4 నెలలకు టూత్ బ్రష్‌ను మార్చడం ద్వారా క్రిములను దూరంగా ఉంచుకోవచ్చు. మౌత్ వాష్‌లో టూత్ బ్రష్‌ను కొన్ని నిమిషాలు నానబెట్టి శుభ్రం చేయడం మంచిది. ఎక్కువగా తేమ ఉన్న ప్రదేశాల్లో టూత్ బ్రష్‌ను ఉంచితే బ్యాక్టీరియా పెరిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది. టూత్ బ్రష్‌ను శుభ్రం చేయడానికి కొన్ని శాస్త్రీయ పద్ధతులు ఉన్నాయి. ఖ౨ లైట్ శానిటైజర్‌ను ఉపయోగించడం వల్ల టూత్ బ్రష్‌లోని బ్యాక్టీరియా, ఫంగస్, వైరస్‌లను పూర్తిగా తొలగించవచ్చు. ఇది శాస్త్రీయంగా నిరూపితమైన అత్యుత్తమ శుభ్రతా విధానం. మరొక సాధారణమైన పద్ధతి యాంటీ బాక్టీరియల్ మౌత్ వాష్‌లో టూత్ బ్రష్‌ను కొన్ని నిమిషాలు నానబెట్టడం. ఇది టూత్ బ్రష్‌లో ఉన్న సూక్ష్మజీవులను తగ్గించడంలో సహాయపడుతుంది. ఇంకొక సాధారణ శుభ్రపరిచే విధానం మరిగిన నీటిలో టూత్ బ్రష్‌ను కొన్ని నిమిషాలు ఉంచడం. ఇది బ్యాక్టీరియాను నాశనం చేయడంలో సహాయపడుతుంది. అయితే పదే పదే ఇలా చేయడం వల్ల టూత్ బ్రష్ బ్రిస్టల్స్ త్వరగా దెబ్బతినే ప్రమాదం ఉంది. బేకింగ్ సోడా లేదా హైడ్రోజన్ పెరాక్సైడ్‌ను ఉపయోగించి టూత్ బ్రష్‌ను శుభ్రం చేయడం కూడా సమర్థవంతమైన పరిష్కారం.

## నేరేడు పండ్లు వీరికి డేంజర్..



చాలా మంది నేరేడు పండు యొక్క ప్రయోజనాల గురించి తెలుసుకునే ఉంటారు. అందుకే మార్కెట్లో ఎక్కడ కనిపించినా వీటిని సీజనల్ ఫ్రూట్ కాబట్టి కొని తెచ్చుకుంటారు. అయితే దీనిని మితంగా తింటే ఎంత ఆరోగ్యమో అతిగా తింటే అంత ప్రమాదమని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఆయుర్వేదం ప్రకారం, ఏదైనా ఔషధ రూపంలో మాత్రమే తీసుకోవాలి. అంటే పరిమిత పరిమాణంలో. కొన్నిసార్లు అధిక వినియోగం అనేక ఇతర వ్యాధులకు కారణమవుతుంది. ఇండియన్ బ్లాక్‌బెర్రీ, నేరేడు పండు లేదా జామున్ అనే ఈ పండు వేసవి కాలంలో ఎక్కువగా లభిస్తుంది. దీన్నే జావా ప్లం అని కూడా పిలుస్తారు. ఇది ఔషధ గుణాలతో సమృద్ధిగా ఉంటుంది మరియు అనేక వ్యాధులను నివారిస్తుంది. రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంతో పాటు, ఈ పండు తినడం వల్ల లెక్కలేనన్ని ప్రయోజనాలు లభిస్తాయి. ఇది శరీరంలో రక్త లోపాన్ని నయం చేయడమే కాకుండా, రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి కూడా ఉత్తమ ఔషధం. నేరేడే పండ్లు, ఆకులతోపాటు దీని గుజ్జు అనేక వ్యాధుల నుండి రక్షిస్తుంది. అవి ఆరోగ్యానికి మంచివి అయినప్పటికీ, కొన్నిసార్లు వీటిని తినడం హానికరం అని రుజువైంది. సాధారణంగా, ఆయుర్వేదం ప్రకారం, అధిక రక్తపోటు ఉన్న రోగులకు నేరేడు పండు వినియోగం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. జామున్ పండు లేదా గుజ్జు పొడిని ఆహారంలో చేర్చుకోవడం ద్వారా దీనిని సులభంగా నియంత్రించవచ్చు. కానీ చాలా మంది దీనిని నియంత్రించడానికి ఎక్కువగా తినడం ప్రారంభిస్తారు, దీనివల్ల తక్కువ లోబీపీ సమస్య ఏర్పడవచ్చు. నేరేడు పండ్లలో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. అటువంటి పరిస్థితిలో, మీరు దానిని అధికంగా తీసుకుంటే, మీకు మలబద్ధకం సమస్య ఉండవచ్చు. నేరేడు పండ్లు రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించే శక్తిని కలిగి ఉంటాయి. అందువల్ల డయాబెటిస్ ఉన్నవారు వీటిని అధికంగా తినకూడదు. ఇవి ఎక్కువగా తింటే రక్తంలో షుగర్ లెవెల్స్ ప్రమాదకరంగా తగ్గిపోవచ్చు. మీరు బెర్రీలు ఎక్కువగా తీసుకుంటే అది మీ చర్మానికి సమస్యలను కలిగిస్తుంది. మొటిమలు మరింత ఎక్కువకావచ్చు. నేరేడు పండ్లు తిన్న తర్వాత చాలా మందికి వాంతులు అవుతాయి. మీకు కూడా అలాంటి సమస్య ఉంటే, దానిని తినకపోవడమే మంచిది.

## ఆపిల్ సైడర్ వెనిగర్ వాడుతున్నారా..?



ఆపిల్ సైడర్ వెనిగర్ ఆరోగ్యానికి అనేక ప్రయోజనాలు కలిగి ఉంది. ముఖ్యంగా మధుమేహం ఉన్నవారు దీన్ని బ్లడ్ షుగర్ నియంత్రణ కోసం ఉపయోగించాలనుకుంటారు. అయితే మధుమేహం మందులతో కలిపి వాడినప్పుడు కొన్ని ప్రమాదాలు ఉండే అవకాశం ఉంది. ఆపిల్ సైడర్ వెనిగర్ ఉపయోగించే ముందు దాని ప్రయోజనాలు, దుష్ప్రభావాలు, సరైన మోతాదు గురించి తెలుసుకోవడం ముఖ్యం. ఆపిల్ సైడర్ వెనిగర్ అనేది యాపిల్ పండ్ల నుండి తయారు చేసిన ఒక రకమైన వెనిగర్. ఆపిల్ సైడర్ వెనిగర్ అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలిగి ఉన్నప్పటికీ.. మధుమేహాన్ని పూర్తిగా నియంత్రించడానికి సమతుల్య ఆహారం, క్రమం తప్పకుండా వ్యాయామం, డాక్టర్ పర్యవేక్షణ చాలా అవసరం. ఆపిల్ సైడర్ వెనిగర్ బరువు తగ్గడానికి సహాయపడుతుంది. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది. దీని వల్ల మధుమేహం ఉన్నవారు ఆపిల్ సైడర్ వెనిగర్ వాడటానికి ఆసక్తి చూపుతారు. కానీ మధుమేహం మందులతో కలిపి వాడితే సమస్యలు వచ్చే అవకాశం ఉంది. కాబట్టి జాగ్రత్తగా వాడాలి. ఆపిల్ రసాన్ని పులియబెట్టి ఆపిల్ సైడర్ వెనిగర్ తయారు చేస్తారు. పులియబెట్టడం వల్ల ఆపిల్ రసంలోని చక్కెర ఆల్కహాల్ గా మారుతుంది. తర్వాత ఆల్కహాల్ ఎసిటిక్ యాసిడ్ గా మారుతుంది. ఎసిటిక్ యాసిడ్ వెనిగర్ లో ముఖ్యమైన భాగం. ఆపిల్ సైడర్ వెనిగర్ లో ఖనిజాలు, విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఆపిల్ సైడర్ వెనిగర్ ఇన్సులిన్ సున్నితత్వాన్ని పెంచుతుందని, భోజనం తర్వాత రక్తంలో చక్కెర పెరగకుండా చేస్తుందని కొన్ని అధ్యయనాలు చెబుతున్నాయి. కానీ ఇన్సులిన్ లేదా మధుమేహం మందులతో కలిపి ఆపిల్ సైడర్ వెనిగర్ వాడితే రక్తంలో చక్కెర స్థాయిలు బాగా తగ్గిపోయే ప్రమాదం ఉంది.

## కార్లలో వాటర్ బాటిల్స్ ఉంచే అలవాటు ఉందా?



శరీరానికి సరైన మొత్తంలో నీరు అందకపోతే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. చాలా మంది ప్రయాణాల్లో, ఇతర బిజీగా ఉండే రోజుల్లో నీరు తాగడం మర్చిపోతుంటారు. కానీ ఇది మంచి పద్ధతి కాదు. కార్లు ఉన్నవారు కూడా ప్రయాణంలో దాహం వేసినప్పుడు ప్లాస్టిక్ బాటిళ్లలోని నీళ్లు తాగుతుంటారు. కొంతమందికి కారులో నీళ్లను ఎంత కాలం క్రితం పెట్టారో కూడా గుర్తు ఉండదు. ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి ఆహారం ఎంత ముఖ్యమో, నీరు కూడా అంతే ముఖ్యం. ముఖ్యంగా ఈ వేసవి వేడి వాతావరణంలో నీరు ఎంత త్రాగినా సరిపోదు. శరీరానికి సరైన మొత్తంలో నీరు అందకపోతే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయి. చాలా మంది ప్రయాణాల్లో, ఇతర బిజీగా ఉండే రోజుల్లో నీరు తాగడం మర్చిపోతుంటారు. కానీ ఇది మంచి పద్ధతి కాదు. కార్లు ఉన్నవారు కూడా ప్రయాణంలో దాహం వేసినప్పుడు ప్లాస్టిక్ బాటిళ్లలోని నీళ్లు తాగుతుంటారు. కొంతమందికి కారులో నీళ్లను ఎంత కాలం క్రితం పెట్టారో కూడా గుర్తు ఉండదు. అయితే ఇలా కార్లలో ఉంచిన నీటిని తాగడం మంచిది కాదంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఈ నీటిలో ఏముంది? అది ఏమిటి? ఆహారం లాగే నీరు కూడా చెడిపోతుందా అనే ప్రశ్నలు మీకు తలెత్తవచ్చు. ఇది అంత పెద్ద విషయంగా అనిపించకపోయినా ఈ అలవాటును కొనసాగిస్తే మాత్రం మీ ఆరోగ్యం త్వరలోనే ప్రమాదంలో పడుతుంది. కారులో నీళ్లు ఉంచితే వాటిని ఎట్టిపరిస్థితుల్లోనూ 24 గంటల తర్వాత తాగకూడదని నిపుణులు చెబుతున్నారు. ముఖ్యంగా వేసవిలో ఇలాంటి తప్పులు చేయకూడదు. వాతావరణంలోని వేడి కారణంగా కారులో ప్లాస్టిక్ బాటిల్‌ను ఎక్కువసేపు ఉంచితే, రసాయనాలు నీటిలోకి లీకీ అవుతాయి. ఇది నీటిని కలుషితం చేస్తుంది. కాబట్టి దాహం వేసినప్పుడు తాగడం మన ఆరోగ్యానికి హానికరం. ముఖ్యంగా పాత ప్లాస్టిక్ బాటిళ్లు అధిక ఉష్ణోగ్రతల వద్ద థాలేట్స్, బిస్ఫినాల్-ఎ వంటి రసాయనాలను విడుదల చేసే అవకాశం ఉంది. కాబట్టి కారులో ఎక్కువసేపు రోజులు నిల్వ ఉంచిన ప్లాస్టిక్ బాటిళ్లలో నీరు తాగకూడదని నిపుణులు చెబుతున్నారు. టెక్సాస్ విశ్వవిద్యాలయంలోని టైలర్‌లో నిర్వహించిన మరో అధ్యయనంలో వేడి వాతావరణంలో ఒకటి లేదా రెండు రోజులు కారులో ఉంచిన నీరు తాగడం వల్ల ప్రమాదం పెరుగుతుందని నిర్ధారించారు. ఈ ప్రమాదాలను నివారించడానికి ప్లాస్టిక్ బాటిల్ వాటర్‌ను వేడి వాతావరణంలో ఎక్కువసేపు నిల్వ చేయకూడదని అధ్యయనాలు చెబుతున్నాయి. ఈ రకమైన అలవాటు జీర్ణ సమస్యలు, శ్వాసకోశ సమస్యలు, రుగ్మతలు, క్యాన్సర్ ప్రమాదం వంటి వివిధ ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## ఆ రోగులకు శుభవార్త చెప్పిన సైంటిస్టులు



హెచ్‌ఐవి నుండి రక్షించడానికి వార్షిక ఇంజెక్షన్ సురక్షితమైనది మరియు దీర్ఘకాలిక ప్రభావాలతో నివారణ పద్ధతిగా ఆశాజనకంగా ఉందని ది లాన్సెట్ జర్నల్‌లో ప్రచురించబడిన క్లినికల్ ట్రయల్ ఫలితాల ప్రకారం. 'లెనాకాపావిర్' ను యూఎస్ లోని పరిశోధన-ఆధారిత బయోఫార్మాస్యూటికల్ కంపెనీ గిలియడ్ సైన్సెస్ అభివృద్ధి చేసింది, హెచ్‌ఐవి కి గురయ్యే ప్రమాదం ఉన్న వ్యక్తులలో ఇన్ఫెక్షన్‌ను నివారించడానికి ప్రీ-ఎక్స్‌పోజర్ ప్రొఫిలాక్సిస్ (పీఆర్‌ఈపీ) ఔషధంగా దీనిని అభివృద్ధి చేసింది. దీనిని కండరాల కణజాలంలోకి ఇంజెక్షన్‌గా ఇస్తారు. మానవ కణాలలోకి హెచ్‌ఐవి ప్రవేశించకుండా, పెరగకుండా నిరోధించడం ద్వారా ఈ ఔషధం పనిచేస్తుంది. ఫేజ్ 1 యాదృచ్ఛిక నియంత్రిత ట్రయల్ ప్రకారం, కనీసం 56 వారాల పాటు శరీరంలో ఉంటుంది. ఫేజ్ 1 ట్రయల్స్ 20-100 మంది ఆరోగ్యకరమైన వాలంటీర్ల సమూహంలో కొత్త ఔషధం ఎలా పనిచేస్తుంది అనేవిషయాన్ని అంచనా వేశారు. హెచ్‌ఐవి లేదా హ్యూమన్ ఇమ్యునో డెఫిషియెన్సీ వైరస్, తెల్ల రక్త కణాలను లక్ష్యంగా చేసుకుని ఒక వ్యక్తి యొక్క రోగనిరోధక వ్యవస్థను దాడి చేసి బలహీనపరుస్తుంది. అక్వైర్డ్ ఇమ్యునో డెఫిషియెన్సీ సిండ్రోమ్ (ఎయిడ్స్) హెచ్‌ఐవి సంక్రమణ యొక్క అత్యంత అధునాతన దశలో సంభవిస్తుంది. ప్రస్తుతం, హెచ్‌ఐవి/ఎయిడ్స్ కు ఆమోదించబడిన చికిత్స లేదా వ్యాక్సిన్ ఇప్పటివరకు లేదు. ఈ విచారణలో 18-55 సంవత్సరాల వయస్సు గల 40 మంది పాల్గొన్నారు, వీరికి హెచ్‌ఐవి లేదు. ఈ ఔషధం రెండు డోసులు తయారు చేశారు. ఒకటి 5 శాతం ఇథనాల్ మరియు మరొకటి 10 శాతంతో. పాల్గొన్న వారిలో సగం మందికి మొదటి డోసు, మిగిలిన సగం మందికి రెండవది ఇచ్చారు. ఈ ఔషధాన్ని 5000 మిల్లీగ్రాముల మోతాదులో ఒకే మోతాదులో ఇచ్చారు. 56 వారాల వరకు సేకరించిన నమూనాలను భద్రత మరియు ఔషధ ప్రవర్తనను అంచనా వేయడానికి విశ్లేషించారు. రెండు సూత్రీకరణలు "సురక్షితమైనవి మరియు బాగా తట్టుకోగలవి" అని కనుగొనబడ్డాయి. ఇంజెక్షన్ సైట్ వద్ద నొప్పి అత్యంత సాధారణ ప్రతికూల సంఘటన, ఇది సాధారణంగా తేలికపాటిది, ఒక వారంలోనే పరిష్కరించబడుతుంది మరియు మంచుతో ముందస్తు చికిత్స ద్వారా గణనీయంగా తగ్గిందని రచయితలు నివేదించారు. ఇంకా, 56 వారాల వ్యవధి తర్వాత, పాల్గొనేవారిలో లెనాకాపావిర్ స్థాయిలు వేరే లెనాకాపావిర్ ఇంజెక్షన్ యొక్క దశ 3 ట్రయల్స్‌లో ఉన్న స్థాయిలను మించిపోయాయి, ఇది సంవత్సరానికి రెండుసార్లు చర్మం కింద మరియు కండరాల కణజాలం పైన ఇస్తారు. జూలై 2024లో ది న్యూ ఇంగ్లాండ్ జర్నల్ ఆఫ్ మెడిసిన్‌లో ప్రచురించబడిన దశ 3 ట్రయల్స్ ఫలితాలు, సంవత్సరానికి రెండుసార్లు సబ్కటానియస్ ఇంజెక్షన్ సురక్షితమైనదని మరియు అత్యంత ప్రభావవంతమైనదని చూపించాయి. అయితే, దీనిపై మరింత డేటా అవసరమని అధ్యయనాలు తెలిపాయి.

# బిజినెస్

## పెరిగిన మొబైల్ సబ్‌స్క్రైబర్లు.. మొదటి స్థానంలో ఏది?



డిసెంబర్ 2024లో దేశంలో మొత్తం టెలిఫోన్ చందాదారుల సంఖ్య స్వల్పంగా పెరిగి 118.99 కోట్లకు చేరుకుంది. దీనిలో జియో మొబైల్, ఎయిర్‌టెల్, బీఎస్ఎన్ఎల్, వోడాఫోన్ ఐడియాల ఏయే స్థానాల్లో ఉన్నాయో టెలికాం నియంత్రణ సంస్థ ౦=ూ× మంగళవారం వెల్లడించింది. గత సంవత్సరం చివరి నెలలో జియో నెట్‌వర్క్‌లో భారీగా చేరారు. గత కొన్ని నెలలుగా తగ్గుతూ వచ్చిన మొబైల్ సబ్‌స్క్రైబర్లు స్వల్పంగా పెరిగారు. డిసెంబర్ నెల చివరినాటికి స్వల్పంగా పెరిగి 118.99 కోట్లకు చేరుకున్నట్లు టెలికం నియంత్రణ మండలి ట్రాయ్ తాజాగా వెల్లడించింది. టెలికం దిగ్గజం జియోకు ఈసారి భారీ ఊరట లభించింది. గత సంవత్సరం నవంబర్ నెల చివరినాటికి 118.77 కోట్లుగా ఉండగా, వీరిలో పట్టణప్రాంతాల్లో ఉన్న మొబైల్ సబ్‌స్క్రైబర్లు 65.98 కోట్లు ఉన్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లో 52.72 కోట్లు ఉన్నారు. అలాగే వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్లు 114.86 కోట్ల నుంచి 115.06 కోట్లకు పెరిగినట్లు ట్రాయ్ వెల్లడించింది. గత సంవత్సరం చివరి నెలలో జియో నెట్‌వర్క్‌లోకి 39.06 లక్షల మంది చేరగా, ఎయిర్‌టెల్‌లోకి 10.33 లక్షల మంది జతయ్యారు. కానీ వొడాఫోన్ ఐడియా 17.15 లక్షల మంది వైర్‌లెస్ సబ్‌స్క్రైబర్లను కోల్పోయింది. అలాగే ప్రభుత్వ టెలికాం సంస్థ అయిన బీఎస్ఎన్ఎల్ 3.16 లక్షల మంది, ఎంటీఎన్ఎల్ 8.9 లక్షల మందిని కోల్పోయాయి. లయన్స్ జియో ఇన్ఫోకామ్ 47.65 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లతో అగ్రస్థానంలో ఉండగా, భారతీ ఎయిర్‌టెల్ 28.93 కోట్ల మంది, వొడాఫోన్ ఐడియా 12.63 కోట్ల మంది సబ్‌స్క్రైబర్లతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

## ఎల్ఐసిలో మళ్లీ వాటాల విక్రయం!




ప్రభుత్వ రంగంలోని దిగ్గజ జీవిత బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ (ఎల్ఐసి)లో 2-3 శాతం వాటాలను విక్రయించాలని మోడీ సర్కార్ యోచిస్తోంది. 2022లో ఐపిఒకు వచ్చిన సమయంలో 3.5 శాతం వాటాకు సమానమైన 22.13 కోట్ల షేర్లను విక్రయించింది. దీంతో రూ.21,000 కోట్ల నిధులను తమ ఖజానాలో వేసుకుంది. ప్రభుత్వానికి ప్రస్తుతం ఎల్ఐసిలో 96.5 శాతం వాటా ఉంది. కాగా.. 2027 నాటికి ఇందులో కనీసం 10 శాతం వాటాను ప్రయివేటు శక్తులకు కట్టబెట్టాలని బిజెపి ప్రభుత్వం ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. మార్కెట్ పరిస్థితులకు అనుకూలంగా క్రమంగా వాటాలను విక్రయించాలనేది ప్రభుత్వ వ్యూహమని మింట్ ఓ కథనంలో వెల్లడించింది. వచ్చే ఆర్థిక సంవత్సరం (2025-26)లో 2-3 శాతం వాటా విక్రయం ద్వారా రూ.9,500 కోట్ల నుంచి రూ.14,500 కోట్ల వరకు నిధుల్ని సమకూర్చుకొనే అవకాశం ఉంది. 2027 మే నాటికి ఎల్ఐసిలో కనీసం 10 శాతం వాటాలను విక్రయించాలని సెక్యూరిటీస్ అండ్ ఎక్స్చేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా (సెబీ) ఆదేశించింది. ఈ వాటాలను చిన్న విడతలుగా ఉపసంహరించుకోవాలని కేంద్రం యోచన. ప్రపంచంలోనే బీమా రంగంలో ఎల్ఐసి మూడో అత్యంత బలమైన కంపెనీగా గుర్తింపును పొందింది. బ్రాండ్ స్ట్రెంత్ ఇండెక్స్ (బిఎస్ఐ)లో 100కు గాను 88 స్కోర్ పొందినట్లు బ్రాండ్ ఫైనాన్స్ ఇన్సూరెన్స్ 100 రిపోర్ట్-2025లో ఇటీవల వెల్లడించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్‌తో ముగిసిన మూడో త్రైమాసికం (క్యూ3)లో ఎల్ఐసి నికర లాభాలు 17 శాతం పెరిగి రూ.11,056 కోట్లకు చేరాయి. ఇంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికంలో రూ.9,444.42 కోట్ల లాభాలు నమోదు చేసింది. గడిచిన క్యూ3లో ముఖ్యంగా ఉద్యోగుల వ్యయాలు తగ్గడంతో ప్రధానంగా నిర్వహణ వ్యయాలు తగ్గి సంస్థ మెరుగైన లాభాలకు దోహదం చేశాయి.

# క్రెడిట్ కార్డు బిల్లు సరిగ్గా కట్టినా క్రెడిట్ స్కోర్ తగ్గుతుందా?




చాలా సార్లు, బిల్లులు సకాలంలో చెల్లించినప్పటి, క్రెడిట్ స్కోరు పడిపోతుంది. ఇది ఎందుకు జరుగుతుందో అర్థం కాదు. సకాలంలో చెల్లింపులు చేసినప్పటికీ మీ క్రెడిట్ స్కోరు పడిపోవడానికి కొన్ని ముఖ్యమైన కారణాలు ఉంటాయి. మీ క్రెడిట్ స్కోరు తరచుగా క్రెడిట్ వినియోగ నిష్పత్తి ద్వారా ప్రభావితమవుతుంది. మీరు సకాలంలో క్రెడిట్ కార్డు బిల్లులు చెల్లించినప్పటికీ క్రెడిట్ స్కోర్ పడిపోతుంటుంది. ఇలా ఎందుకు జరుగుతుందన్న అనుమానం కూడా వస్తుంటుంది. ఇందుకు చాలా కారణాలు ఉన్నాయి. ఈ క్రెడిట్ వినియోగ నిష్పత్తి మీకు అందుబాటులో ఉన్న మొత్తం క్రెడిట్‌లో మీరు ఎంత ఉపయోగిస్తున్నారో చూపిస్తుంది. దీనిని 30% లోపు ఉంచాలి. మీరు మీ క్రెడిట్ కార్డ్ లిమిట్ మొత్తాన్ని ఉపయోగిస్తున్నా లేదా భారీ బకాయిలను మోస్తున్నా, మీరు ఆర్థిక ఒత్తిడిలో ఉన్నారని బ్యాంకులకు తెలిసిపోతుంది. తద్వారా మీ స్కోర్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుంది. మీ క్రెడిట్ స్కోరు తరచుగా క్రెడిట్ వినియోగ నిష్పత్తి ద్వారా ప్రభావితమవుతుంది. మీరు సకాలంలో క్రెడిట్ కార్డు బిల్లులు చెల్లించినప్పటికీ క్రెడిట్ స్కోర్ పడిపోతుంటుంది. ఇలా ఎందుకు జరుగుతుందన్న అనుమానం కూడా వస్తుంటుంది. ఇందుకు చాలా కారణాలు ఉన్నాయి. ఈ క్రెడిట్ వినియోగ నిష్పత్తి మీకు అందుబాటులో ఉన్న మొత్తం క్రెడిట్‌లో మీరు ఎంత ఉపయోగిస్తున్నారో చూపిస్తుంది. దీనిని 30% లోపు ఉంచాలి. మీరు మీ క్రెడిట్ కార్డ్ లిమిట్ మొత్తాన్ని ఉపయోగిస్తున్నా లేదా భారీ బకాయిలను మోస్తున్నా, మీరు ఆర్థిక ఒత్తిడిలో ఉన్నారని బ్యాంకులకు తెలిసిపోతుంది. తద్వారా మీ స్కోర్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుంది. మీరు క్రెడిట్ కోసం దరఖాస్తు చేసుకున్నప్పుడల్లా అది మీ క్రెడిట్ నివేదికపై ప్రభావం పడుతుంది. పదేపదే దరఖాస్తు చేసుకున్నప్పుడు అది రిజెక్ట్ అయితే కూడా స్కోర్ తగ్గుతుంది. ఇది మీ స్కోర్‌ను తాత్కాలికంగా తగ్గిస్తుంది. మీరు మరిన్ని అప్పులు తీసుకోవాలని ప్లాన్ చేస్తున్నారని మరిన్ని దరఖాస్తులు సూచిస్తున్నాయి. దీని వలన బ్యాంకులు మిమ్మల్ని ప్రమాదకర రుణగ్రహీతగా పరిగణించవచ్చు. కొన్ని బిల్లులు సకాలంలో చెల్లించినప్పటికీ, మీరు ఇతర క్రెడిట్ కార్డులు లేదా రుణాలపై చెల్లింపులను మిస్ అయితే మీ మంచి చెల్లింపు చరిత్ర వృథా కావచ్చు. క్రెడిట్ స్కోరింగ్ మోడల్ మీ మొత్తం క్రెడిట్ ప్రొఫైల్‌ను పరిగణనలోకి తీసుకుంటుంది. అందుకే ఒక్క ఆలస్య చెల్లింపు కూడా స్కోరులో గణనీయమైన తగ్గుదలకు దారితీస్తుంది. పాత ఖాతాలను మూసివేయడం వల్ల మీ ఖాతా సగటు వయస్సు తగ్గడమే కాకుండా మీ మొత్తం క్రెడిట్‌ను కూడా తగ్గిస్తుంది. మీ స్కోర్‌ను మరింత దెబ్బతీస్తుంది. మంచి క్రెడిట్ ఖాతాలను ఉంచడం, పాత ఖాతాలను తెరిచి ఉంచడం వల్ల బలమైన క్రెడిట్ ప్రొఫైల్‌ను నిర్మించడంలో సహాయపడుతుందని గుర్తించుకోండి. మీరు మీ క్రెడిట్ నివేదికను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలి. అలాగే ఏదైనా తప్పు జరిగితే మీరు వెంటనే క్రెడిట్ బ్యూరోను సంప్రదించి దాన్ని సరిదిద్దుకోవాలి.

# పాత కారు అమ్మేస్తున్నారా? మంచి ధర రావాలంటే..



ఎవరైనా పాత కారును అమ్ముతున్నారంటే మంచి ధర రావాలని చూస్తారు. అలాగే కొనేవారు కూడా తక్కువ ధరల్లో సెకండ్ హ్యాండ్ కారు దొరికితే కోరుకుంటారు. అయితే మీరు మీ పాత కారును అమ్ముతుంటే.. అదికూడా మంచి ధర రావాలంటే కొన్ని ట్రిక్స్ ఉన్నాయి. మీరు కొత్త కారును కొనుగోలు చేయాలనే ఉత్సాహంలో ఉంటే, మీ పాత కారును విక్రయించాలనుకుంటే, మీ పాత కారుకు మంచి ధర రావాలంటే కొన్ని ట్రిక్స్ ఉన్నాయి. వాటిని పాటిస్తే మంచి ధర పొందవచ్చంటున్నారు టెక్ నిపుణులు. మీరు మీ పాత కారును ఎవరికైనా విక్రయించినప్పుడు అది పాతదని, ఇంజిన్ పనిచేయడం లేదని, సమస్యలున్నాయని చెప్పడం తరచుగా వింటుంటాము. మీడియా నివేదికల ప్రకారం.. దేశంలో సెకండ్ హ్యాండ్ కార్ల మార్కెట్ వేగంగా పెరుగుతోంది. పెరుగుతున్న ద్రవ్యోల్బణం, పెట్రో ధరలు నిరంతరం పెరగడమే ఇందుకు కారణం. మీరు కూడా మీ కారును విక్రయించాలనుకుంటే, కొన్ని విషయాలను గుర్తుంచుకోండి. తద్వారా మీరు కారుకు మంచి ధరను పొందవచ్చు. మీ కారును కండీషన్‌గా ఉంచుకుంటే ఎవరికైనా విక్రయం చేయవచ్చు. డీలర్‌కు విక్రయించవచ్చు లేదా డీలర్‌షిప్‌తో తిరిగి ఇవ్వవచ్చు. కారు రూపురేఖలతోనే ఫస్ట్ ఇంప్రెషన్ ఏర్పడింది. కారు రూపాన్ని చూడటం ద్వారా ఒక నమ్మకం ఏర్పడుతుంది. దాని ఆధారంగా అతను దానిని కొనుగోలు చేయాలని నిర్ణయించుకుంటాడు. అందువల్ల మీరు మీ కారు లోపలి, వెలుపలి భాగాన్ని నిర్వహించడం చాలా ముఖ్యం. దీనితో మీరు మీ కారును అమ్మడం ద్వారా మంచి డబ్బు పొందవచ్చు.కారును ఎప్పటికప్పుడు సర్వీస్ చేయాలి. ఇంజన్ ఆయిల్, కూలెంట్ టాప్-అప్, ఫ్యూయల్ ఫిల్టర్‌ని క్రమం తప్పకుండా మార్చాలి.

## రికార్డులు బద్దలు.. సరికొత్త చరిత్ర!

# ఏకంగా 11 వేల కోట్లకు పైగా..



భారత్‌లో క్రికెట్ ఓ 'మతం' లాంటిది.. వేదిక ఏదైనా టీమిండియా ఆడుతోందంటే అందరూ టీవీలకు అతుక్కుపోవాల్సిందే. ఆ వెసలుబాటు లేని వాళ్లకు డిజిటల్ మీడియా రూపంలో ప్రత్యామ్నాయం ఉండనే ఉంది. ఇక ఇటీవల జరిగిన మెగా ఐసీసీ ఈవెంట్ చాంపియన్స్ ట్రోఫీ-2025 జియోహాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం అయిన విషయం తెలిసిందే.

**11 వేల కోట్ల నిమిషాలకు పైగా**

ఈ నేపథ్యంలో తాజాగా ఈ టోర్నమెంట్ వ్యూయర్‌షిప్‌నకు సంబంధించిన వివరాలు బయటకు వచ్చాయి. ఈ వన్డే టోర్నీకి 540.3 కోట్లకు పైగా వ్యూస్ వచ్చాయి. ఇక వాచ్ టైమ్ ఏకంగా 11 వేల కోట్ల నిమిషాలకు పైగా నమోదు కావడం విశేషం. అంతేకాదు.. ఓవరాల్‌గా 6.2 కోట్ల మంది వ్యూయర్స్ ఈ మెగా ఈవెంట్‌ను వీక్షించినట్లు బ్రాడ్‌కాస్టర్ వెల్లడించింది. కాగా 2017లో చివరిసారిగా చాంపియన్స్ ట్రోఫీని నిర్వహించారు. నాటి ఫైనల్లో టీమిండియాపై గెలిచి పాకిస్తాన్ టైటిల్ సొంతం చేసుకుంది. అయితే, అప్పటి నుంచి సుదీర్ఘకాలం పాటు ఈ టోర్నీని వాయిదా వేశారు. ఈ క్రమంలో 2025లో తిరిగి ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీని నిర్వహించేందుకు సిద్ధమైంది. డిఫెండింగ్ చాంపియన్ హోదాలో పాకిస్తాన్ ఆతిథ్య హక్కులు దక్కించుకోగా.. టీమిండియా మాత్రం భద్రతా కారణాల వల్ల దుబాయ్‌లో తమ మ్యాచ్‌లు ఆడింది. కాగా పాకిస్తాన్‌లో 1996 తర్వాత ఓ ఐసీసీ టోర్నీ జరగడం ఇదే తొలిసారి. ఇక ఫిబ్రవరి 19న పాకిస్తాన్‌లో మొదలైన ఈ వన్డే ఈవెంట్ మార్చి 9న భారత్- న్యూజిలాండ్ మధ్య దుబాయ్ వేదికగా ఫైనల్‌తో ముగిసింది.

**హిట్‌మ్యాన్ ఖాతాలో రెండో ఐసీసీ టైటిల్**

ఇక ఈ టోర్నమెంట్లో రోహిత్ సేన ఆది నుంచి ఆఖరి వరకు అజేయంగా నిలిచి ట్రోఫీని ముద్దాడింది. గ్రూప్ దశలో బంగ్లాదేశ్, పాకిస్తాన్, న్యూజిలాండ్... సెమీస్‌లో ఆస్ట్రేలియాను, ఫైనల్లో న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. తద్వారా హిట్‌మ్యాన్ ఖాతాలో రెండో ఐసీసీ టైటిల్ చేరింది. మరోవైపు.. ఈ వన్డే టోర్నీలో తొలిసారి అడుగుపెట్టిన అఫ్గనిస్తాన్ ఇంగ్లండ్ వంటి పటిష్ట జట్టును చిత్తు చేసి గెలుపు నమోదు చేయడం విశేషం. ఇక వన్డే వరల్డ్‌కప్-2023 విజేత ఆసీస్‌పై రన్నరప్ టీమిండియా ప్రతీకారం తీర్చుకోవడం కూడా హైలైట్‌గా నిలిచింది. ఇన్ని ప్రత్యేకతలు ఉన్న చాంపియన్స్ ట్రోఫీ-2025ని కోట్లాది మంది వీక్షించడంలో ఆశ్చర్యమేమీ లేకపోయినా.. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఏకంగా 540 కోట్లకు పైగా వ్యూస్ రావడం ఇదే తొలిసారి అని తెలుస్తోంది. స్టార్ స్పోర్ట్స్, స్పోర్ట్స్' 18 నెట్‌వర్క్‌లో టీవీలో ప్రసారాలు జరుగగా.. జియోహాట్‌స్టార్‌లోనూ ప్రత్యక్ష ప్రసారం చేశారు.

**అత్యధిక వ్యూస్ ఆ మ్యాచ్‌కే**

కాగా మిగతా మ్యాచ్‌లతో పోలిస్తే టీమిండియా-న్యూజిలాండ్ మధ్య ఫైనల్‌కు అత్యధిక వ్యూస్ వచ్చినట్లు తెలుస్తోంది. ఈ టైటిల్ పోరుకు ఏకంగా 124.2 కోట్ల వీక్షణలు వచ్చాయి. కాగా మొత్తంగా చాంపియన్స్ ట్రోఫీకి వచ్చిన వ్యూయర్‌షిప్‌లో ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, మహారాష్ట్ర, గోవా, పంజాబ్, హర్యానా రాష్ట్రాల నుంచి 38 శాతం మేర వ్యూస్ వచ్చినట్లు సమాచారం. ఇక వైపై సాయంతో మ్యాచ్ వీక్షించిన రాష్ట్రాల్లో మహారాష్ట్ర ముందు ఉంది. కాగా 16 మాధ్యమాల్లో చాంపియన్స్ ట్రోఫీని ప్రసారం చేశారు. తొమ్మిది భాషల్లో కామెంట్రీ ఇచ్చారు. ఇక ఈ మెగా టోర్నీలో గెలవడం ద్వారా భారత్ ఖాతాలో ఏడో ఐసీసీ టైటిల్ చేరింది. 1983 వన్డే వరల్డ్‌కప్, 2002లో శ్రీలంకతో కలిసి ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ, 2007 టీ20 ప్రపంచకప్, 2011 వన్డే వరల్డ్‌కప్, 2013 చాంపియన్స్ ట్రోఫీ, 2024 టీ20 ప్రపంచకప్, 2025 చాంపియన్స్ ట్రోఫీలను భారత్ గెలుచుకుంది. కాగా చాంపియన్స్ ట్రోఫీ-2025లో గ్రూప్-ఎ నుంచి భారత్, పాకిస్తాన్, బంగ్లాదేశ్, న్యూజిలాండ్.. గ్రూప్-బి నుంచి ఆస్ట్రేలియా, సౌతాఫ్రికా, అఫ్గనిస్తాన్, ఇంగ్లండ్ పాల్గొన్నాయి. దుబాయ్‌తో పాటు కరాచీ, లాహోర్, రావల్పిండి ఇందుకు వేదికలు.

# స్పోర్ట్స్

**ఐపీఎల్‌లో ఆడేందుకు మిచెల్ మార్ష్‌కు గ్రీన్ సిగ్నల్..!**

## కేవలం బ్యాట్స్‌మెన్‌గా లక్నో తరపున బరిలోకి..!




ఐపీఎల్-2025 సీజన్‌లో ఆడేందుకు ఆస్ట్రేలియా ఆల్‌రౌండర్ మిచెల్ మార్ష్ అనుమతి లభించింది. అయితే, కేవలం బ్యాట్స్‌మెన్‌గా మాత్రమే ఆడనున్నాడు. ఈ సీజన్‌లో మిచెల్ మార్ష్ లక్నో సూపర్‌జెయింట్స్ తరఫున బరిలోకి దిగనున్నాడు. ఇప్పటి వరకు ఐపీఎల్‌లో ఆడతాడా? లేదా? అన్నది అనుమానాస్పదంగా ఉండగా.. నిపుణులతో చర్చించిన తర్వాత లక్నో జట్టు తరఫున ఆడేందుకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లుగా ఓ నివేదిక పేర్కొంది. రీహాబిలిటేషన్, వైద్య పరీక్షల అనంతరం ఈ ఆల్‌రౌండర్‌కు షరతులతో కూడిన అనుమతి వచ్చింది. అతను బౌలింగ్ చేయొద్దని.. ఫీల్డింగ్ చేస్తున్న సమయంలో వీపుపై ఎక్కువగా ఒత్తిడిపడకుండా చూసుకోవాలని స్పెషలిస్ట్ అడ్వైజ్ ఇచ్చారు. ఈ క్రమంలో మిచెల్ మార్ష్ కేవలం లక్నో సూపర్‌జెయింట్స్‌కు ఇంపాక్ట్ ప్లేయర్‌గా మాత్రమే ఆడనున్నాడు. మార్ష్ చాంపియన్స్ ట్రోఫీ జట్టులో ఈ ఆల్‌రౌండర్ లేకపోవడంతో ఆ లోటు కనిపించింది. గత కొంతకాలంగా పరిమిత ఓవర్ల క్రికెట్‌లో మార్ష్ కీలక సభ్యుడిగా కొనసాగుతున్నాడు. మార్ష్ బ్యాటింగ్, బౌలింగ్‌లో ఇబ్బందుపడుతున్న నేపథ్యంలో భారత్‌తో జరిగిన బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ చివరి మ్యాచ్‌లో తుది జట్టు నుంచి తప్పించారు. అతని స్థానంలో బ్యూ వెబ్‌స్టర్‌కు చోటు కల్పించారు. మిచెల్ మార్ష్ జనవరిలో జరిగిన బిగ్ బాష్ లీగ్‌లో కేవలం ఒక మ్యాచ్ మాత్రమే ఆడాడు. ఛాంపియన్స్ ట్రోఫీకి దూరంగా ఉన్నాడు. తాజాగా ఐపీఎల్‌లో ఆడేందుకు గ్రీన్ సిగ్నల్ లభించింది.

# అల్లు అర్జున్ - అట్లీ.. సినిమా ఎలా ఉండబోతోందంటే?



శ్రియా శరణ్ తన తాజా ఇన్‌స్టాగ్రామ్ స్నాప్‌షాట్‌లలో అందాలను ఆరబోసింది

ఇటీవల కాలంలో పాన్ ఇండియా సినిమాల స్థాయి పూర్తిగా మారిపోయింది. ఇక మామూలు మాస్ కమర్షియల్ సినిమాలతో ప్రేక్షకులను ఆకట్టుకోవడం కష్టమవుతోంది. భారీ బడ్జెట్, విభిన్న కథ, ఊహించని మేకింగ్ స్టైల్ తప్పకుండ ఉండాలి. ముఖ్యంగా దర్శకులు ఇప్పుడు కథకు తగ్గట్లుగా కొత్త ప్రపంచాన్ని సృష్టించేందుకు ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. అదే రూట్లో మరో కాంబినేషన్ కూడా రెడీ అవుతోంది. రాజమౌళి 'బాహుబలి' కోసం మహిష్మతిని సృష్టించాడని, ప్రశాంత్ నీల్ 'కేజీఎఫ్' లో గోల్డ్ ఫీల్డ్ మాఫియాను చూపించాడని, అదే ట్రెండ్ సలార్, దేవర సినిమాల వరకూ కొనసాగింది. ఇప్పుడు ఇదే తరహాలో అల్లు అర్జున్ – అట్లీ సినిమా కూడా రూపొందబోతోందనే టాక్ ఫిల్మ్ నగర్‌లో వినిపిస్తోంది. ఈ భారీ ప్రాజెక్ట్‌ను జూన్ లో లాంచ్ చేసి, 2026 ఆగస్ట్ లో రిలీజ్ చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. అంటే, ఈ సినిమా షూటింగ్ కోసం ఏడాది సమయం వెచ్చించబోతున్నారు. చూస్తుంటే అట్లీ ఇప్పటి వరకు చేసిన సినిమాలకు పూర్తిగా భిన్నంగా ఉండేలా, విభిన్నమైన స్క్రిప్ట్ సిద్ధం చేసుకుంటున్నట్లు స్పష్టమవుతోంది. పక్కా కమర్షియల్ మేకర్‌గా పేరు తెచ్చుకున్న అట్లీ, ఈసారి తన మార్క్ స్టైల్‌ను 'కేజీఎఫ్' లేదా 'దేవర' తరహాలో మాస్ లెవెల్‌కు తీసుకెళ్లబోతున్నట్లు తెలుస్తోంది. 'జవాన్'తో బాలీవుడ్‌ను శాసించిన అట్లీ, ఇప్పుడు టాలీవుడ్‌లో మునుపెన్నడూ లేని స్కేల్‌లో సినిమా చేయాలని పట్టుదలగా ఉన్నట్లు సమాచారం. ఈ సినిమా గురించి బయటకు వస్తున్న అప్‌డేట్ ప్రకారం, ఒక కొత్త ప్రపంచాన్ని సెటప్ చేసేలా కథను డిజైన్ చేసినట్లు సమాచారం. కథలో కొత్త వాతావరణాన్ని రూపొందించేందుకు గ్రాండ్ సెట్స్, హైటెక్ విజువల్స్, యాక్షన్ బ్యాక్‌డ్రాప్‌లో అట్లీ సినిమాను ప్లాన్ చేస్తున్నట్లు టాక్. బన్నీ కోసం హై ఇంటెన్సిటీ క్యారెక్టర్ డిజైన్ చేయడం మాత్రమే కాకుండా, స్టైల్, లుక్ పరంగా కూడా కొత్తగా కనిపించేలా ఫుల్ మేకోవర్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. పాన్ ఇండియా సినిమా కావడం వల్ల, ఇందులో తమిళ, హిందీ పరిశ్రమల నుండి సీనియర్ నటులను తీసుకోవడానికి కూడా స్క్రిప్ట్ రీ డిజైన్ జరుగుతోందని సమాచారం. ఇప్పుడు బన్నీ – అట్లీ కాంబినేషన్ కూడా అదే తరహాలో ప్రేక్షకులను ఊహించని దిశగా తీసుకెళ్లేలా ప్లాన్ చేస్తున్నట్లు సమాచారం. ఫ్యూచరిస్టిక్ యాక్షన్ డ్రామా, ఒక రివోల్యూషనరీ కథ, పీరియాడిక్ యాక్షన్ డ్రామా అనే మూడు ప్రధాన కథాంశాలతో ఈ సినిమా ఉండొచ్చని ఇండస్ట్రీ వర్గాల్లో ప్రచారం నడుస్తోంది. ఈ సినిమా కోసం బడ్జెట్ పరంగా కూడా భారీ స్థాయిలో ఖర్చు చేయబోతున్నట్లు టాక్. బన్నీ క్రేజ్, అట్లీ ట్రాక్ రికార్డ్‌ను బట్టి ఈ సినిమా 400–500 కోట్ల బడ్జెట్‌తో రూపొందించే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే 'పుష్ప 2'తో బన్నీ మార్కెట్ 1800 కోట్లకు పైగా వసూళ్లు సాధించే స్థాయికి వెళ్లింది.





దీంతో, ఈ సినిమా తర్వాత ఇంకో మెట్టు పైకి వెళ్లేలా బన్నీ ప్లాన్ చేస్తున్నాడు. ఈ లెవెల్‌లో సినిమాకు హైప్ క్రియేట్ చేయాలంటే, కేవలం స్టోరీ, యాక్షన్ మాత్రమే కాకుండా, అట్లీ ప్రత్యేకమైన మాస్ కమర్షియల్ ట్రీట్మెంట్ కూడా ఉండాలి. మరి అట్లీ ప్లానింగ్ ఏ లెవెల్లో ఉంటుందో చూడాలి.



దేవియాని శర్మ యొక్క తాజా లుక్ సింప్లిసిటీ శక్తివంతమై నదని రుజువు చేస్తుంది

# రాజా సాబ్ ఆడియన్స్‌కు రేర్ ఎక్స్ పీరియన్స్?



రెబల్ స్టార్ ప్రభాస్ మారుతి కాంబినేషన్ లో వస్తున్న సినిమా రాజా సాబ్. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మిస్తున్న ఈ సినిమాలో మాళవిక మోహనన్, నిధి అగర్వాల్ హీరోయిన్ గా నటిస్తున్నారు. ఈ సినిమాకు థమన్ మ్యూజిక్ అందిస్తున్నారు. థ్రిల్లర్ జోనర్ లో వస్తున్న ఈ సినిమా విషయంలో మేకర్స్ ప్లానింగ్ అంతా ఒక రేంజ్ లో ఉంది. ఐతే స్టార్ సినిమాల్లో థ్రిల్లర్ జోనర్ సినిమాలు చాలా అరుదు. అందులోనూ ప్రభాస్ లాంటి స్టార్ తో ఇలాంటి అటెంప్ట్ నెవర్ బిఫోర్ అని చెప్పొచ్చు. ఇప్పటివరకు రాజా సాబ్ సినిమా నుంచి కేవలం ప్రభాస్ ఎంట్రీ తో పాటు మోషన్ పోస్టర్ మాత్రమే వచ్చాయి. సినిమా నుంచి టీజర్ కోసం ఫ్యాన్స్ ఎంతగానో ఎదురుచూస్తున్నారు. ఐతే రాజా సాబ్ సినిమా నుంచి లేటెస్ట్ గా వస్తున్న టాక్ ఏంటంటే ఇది ఆడియన్స్ కు ఒక రేర్ ఎక్స్ పీరియన్స్ అందిస్తుందని అంటున్నారు. రెగ్యులర్ థ్రిల్లర్ కథలు, సినిమాలకు భిన్నంగా ఈ సినిమా నెక్ట్స్ లెవెల్ లో ఉండబోతుందని తెలుస్తుంది. థ్రిల్లర్ సినిమా అనగానే భయ పెట్టడం నవ్వించడం ఉంటాయి ఐతే ఈ సినిమాలో ఆ రెండిటితో పాటు ఆడియన్స్ కు ఒక కొత్త ఎక్స్ పీరియన్స్ కూడా ఫీల్ అయ్యే ఛాన్స్ ఉంటుందట. పాన్ ఇండియాలో భారీ క్రేజ్ ఉన్న ప్రభాస్ ఇలాంటి కథను ఎంపిక చేసుకోవడమే పెద్ద సాహసం అనిపించేలా ఈ సినిమా ఉంటుందని తెలుస్తుంది. సినిమాను అసలైతే ఈ సమ్మర్ కి తీసుకు రావాలని అనుకున్నారు కానీ కుదరలేదు. ప్రభాస్ రాజా సాబ్ రిలీజ్ కన్ ఫ్యూజన్ కొనసాగుతూనే ఉంది. సినిమాలో చాలా సర్ ప్రైజ్ లు ఉన్నాయని మేకర్స్ ఊరిస్తున్నారు తప్ప సినిమా నుంచి ఎలాంటి ప్రమోషనల్ కంటెంట్ రిలీజ్ చేయట్లేదు. ఈ విషయంలో ఫ్యాన్స్ డిజప్పాయింటెడ్ గా ఉన్నారు. రాజా సాబ్ సెప్టెంబర్ రిలీజ్ అని కొందరు అంటుంటే దసరా బరిలో దిగుతుందని కొందరు చెబుతున్నారు. మరి ఈ సినిమా ఏ రేంజ్ లో ఆడియన్స్ ని అలరిస్తుందో చూడాలి. రాజా సాబ్ తో పాటుగా ప్రభాస్ హను రాఘవపూడి డైరెక్షన్ లో ఫౌజీ (వర్కింగ్ టైటిల్) ని కూడా షూటింగ్ చేస్తున్నాడు. రాజా సాబ్ ఈ ఇయర్ రిలీజ్ అవుతుందని తెలుస్తుండగా ఫౌజీని నెక్ట్స్ ఇయర్ రిలీజ్ ప్లాన్ చేస్తున్నారు.

Printed and Published by V. Srinivas Reddy on behalf of M/s Sai Krishna Publications, Owned by M/s Sai Krishna Publications Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at Plot No. 3, Flat No.13, Surya Saroj Apartments, HUDA Complex, Saroornagar Ranga Reddy District.(Hyd) - 500 035, Telangana. Editor : V. SRINIVAS REDDY, cell:9440231967 RNI No. APTEL/2010/36516, prajajyothiadilabad@gmail.com